
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 13-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 27 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: షష్టి రా. 2.51 తదుపరి సప్తమి; నక్షత్రం: పునర్వసు ఉ. 11.23 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా. 7.57-9.39; దుర్ముహూర్తం: మ. 12.37-1.28, మ. 3.10-4.01; అమృతఘడియలు: ఉ. 8.53-10.33; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.396 కోట్లు ఉపసంహరణ

న్యూఢిల్లీ: బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) ల్లోనూ లాభాల స్వీకరణ ప్రారంభమైంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మదుపరులు ఈ పథకాల నుంచి రూ.396 కోట్ల నికర పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. గత ఏడాది మార్చి తర్వాత మదుపరులు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం ఇదే మొదటిసారి. పసిడి ధర పెరగడంతో లాభాల స్వీకరణ కోసం ఈ అమ్మకాలు జరిగాయని భావిస్తున్నారు. అయినా ఏప్రిల్ నెలాఖరుకు గోల్డ్ ఈటీఎఫ్ పథకాల నిర్వహణలోని పెట్టుబడుల విలువ (ఏయూఎం) అంతకు ముందు నెలతో పోలిస్తే ఐదు శాతం పెరిగి రూ.32,789 కోట్లకు చేరాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	540
వరంగల్	537	గోదావరి	540
చిత్తూరు	608	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	గోదావరి	145
వరంగల్	135	విజయవాడ	145
కరీంనగర్	135	గుంటూరు	145
మహబూబ్‌నగర్	135	ఒంగోలు	145
కర్నూలు	135	చిత్తూరు	150
విశాఖపట్నం	137		

ఈ ఏడాది 12,000 కొలువులు

ఇందులో 85 శాతం మంది ఇంజనీర్లే .. టెక్నాలజీ అప్‌గ్రేడేషన్‌పైనే దృష్టి

ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా



ముంబై: ప్రభుత్వ రంగంలోని భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) పెద్దఎత్తున ఉద్యోగుల నియామకానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఎంత లేదన్నా 12,000 నియామకాలు ఉంటాయని బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా చెప్పారు. ఇందులో 85 శాతం మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లే ఉంటారన్నారు. ఐటీ రంగంలో ఫ్రెషర్స్ నియామకాలు తగ్గిన నేపథ్యంలో ఎస్‌బీఐ ఇలా పెద్దఎత్తున ఇంజనీర్ల నియామకానికి సిద్ధమవడం విశేషం. ప్రొబేషనరీ ఆఫీసర్లు, అసోసియేట్ల పోస్టుల్లో ఈ నియామకాలు ఉంటాయని ఖారా చెప్పారు. 'కొత్త ఉద్యోగులకు ముందుగా బ్యాంకింగ్ విధి విధానాల్లో శిక్షణ ఇస్తాం. తర్వాత వారి యోగ్యత, ఆసక్తిని బట్టి ఐటీ, వివిధ వ్యాపార బాధ్యతల్లో నియమిస్తాం. దీనివల్ల బ్యాంక్‌కు నిరంతరం టెక్నాలజీ నైపుణ్యాలు ఉన్న మానవ వనరులు అందుబాటులో ఉంటాయి' అని ఆయన అన్నారు. సరికొత్త టెక్నాలజీతో ఖాతాదారులను ఆకర్షించేందుకు బ్యాంకులు పోటీపడుతున్న సమయంలో ఎస్‌బీఐ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల నియామకాలపై దృష్టి పెట్టడం విశేషం.

టెక్నాలజీనే కీలకం: బ్యాంకుల నిర్వహణకు టెక్నాలజీ అత్యంత ముఖ్యమని ఎస్‌బీఐ చైర్మన్ స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరూ ఈ విషయాన్ని ఏ మాత్రం విస్మరించలేరన్నారు. బ్యాంకింగ్ రంగంలో టెక్నాలజీ వినియోగానికి సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కూడా ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు జారీ చేస్తూ.. టెక్నాలజీ వినియోగంలో వెనకబడిన బ్యాంకులపై పెనాల్టీలు విధిస్తున్న విషయాన్ని ఖారా గుర్తు చేశారు.

టెక్నాలజీపై భారీగా ఖర్చు: టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ కోసం ఎస్‌బీఐ ఎంత ఖర్చు చేస్తోందన్న విషయాన్ని వెల్లడించేందుకు దినేశ్ నిరాకరించారు. అయితే ఇది ఇతర బ్యాంకుల కంటే ఎక్కువే ఉంటుందన్నారు. ప్రస్తుతం దేశీయ బ్యాంకులు తమ నిర్వహణ ఖర్చుల్లో సగటున 7 నుంచి 8 శాతం టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ కోసం ఖర్చు చేస్తున్నాయి. అయితే ఎస్‌బీఐ చైర్మన్ మాటలను బట్టి చూస్తే బ్యాంక్ ఇంత కంటే ఎక్కువే ఖర్చు చేస్తోందని భావించాలి.

ఎస్కార్ట్స్ కుబోటా రూ.4,500 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: వ్యవసాయ, నిర్మాణ రంగ పరికరాల తయారీ సంస్థ ఎస్కార్ట్స్ కుబోటా కొత్త ప్లాంట్ ఏర్పాటుపై రాబోయే మూడు, నాలుగు సంవత్సరాల కాలంలో రూ.4,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. రాజస్థాన్‌లోని ఘిలోత్‌లో ఏడాదికి 3.4 లక్షల ట్రాక్టర్ల తయారీ సామర్థ్యంతో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయడానికి స్థలం కోసం ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది. తదుపరి దశలో ఈ ప్లాంట్‌లో కొత్తగా ఇంజన్లు, నిర్మాణ రంగపరికరాల తయారీ కోసం ప్రత్యేక లైన్లు కూడా నిర్మించనుంది. ఈ ఏడాది ఆ స్థలం తాము కొనుగోలు చేయగలమనుకుంటున్నట్టు కంపెనీ సీఎఫ్ఓ, హోల్ టైమ్ డైరెక్టర్ భరత్ మదన్ చెప్పారు. స్థలానికి రూ.400 నుంచి 450 కోట్ల వరకు ఖర్చు కావచ్చని తెలిపారు. ప్రస్తుతం ఫరీదాబాద్ ప్లాంట్‌లో ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 1.7 లక్షల ట్రాక్టర్లని, వీటికి అవసరమైన కుబోటా ఇంజన్లను దిగుమతి చేసుకుంటున్నామని భరత్ వెల్లడించారు.

చైనానే భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి

» 2023-24లో ఇరు దేశాల మధ్య వాణిజ్యం రూ.9.88 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా భారత-చైనా ద్వైపాక్షిక వాణిజ్య మూడు పువ్వులు, ఆరు కాయల్లా వర్ధిల్లుతోంది. గత ఆర్థిక పసంవత్సరం (2023-24) చైనా అమెరికాను తోసిపుచ్చి.. భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అవతరించింది. ఈ కాలంలో రెండు దేశాల వాణిజ్యం 11,840 కోట్ల డాలర్లకు (సుమారు రూ.9.88 లక్షల కోట్లు) చేరింది. ఇదే సమయంలో 11,830 కోట్ల డాలర్లతో (సుమారు రూ.9.87 లక్షల కోట్లు) అమెరికా రెండో స్థానానికి పడిపోయింది. 2021-23 మధ్య కాలంలో అమెరికా మన దేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉండేది. ఇప్పుడు ఆ స్థానాన్ని చైనా ఆక్రమించింది. గత ఆర్థిక సంవత్సరం చైనా మన దేశానికి 10,170 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.49 లక్షల కోట్లు) విలువైన సరుకులు ఎగుమతి చేసి.. మన దేశం నుంచి 1,667 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.39 లక్షల కోట్లు) సరుకులను మాత్రమే దిగుమతి చేసుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశానికి చైనా ఎగుమతులు 3.24 శాతం మాత్రమే పెరిగినా.. అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఎదగడం విశేషం.

మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏకంగా మూడింతలు వృద్ధి చెంది రూ.65.48 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.23.47 కోట్లుగా ఉంది. ఈ కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.2,107.56 కోట్ల నుంచి రూ.2,144.40 కోట్లకు పెరిగింది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.9,601.87 కోట్ల ఆదాయంపై రూ.359.45 కోట్ల లాభాన్ని నమోదు చేసింది.

సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్.. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.61 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.39 కోట్లు)తో పోల్చితే లాభం 56.4 శాతం పెరిగింది. సమీక్షా కాలంలో నికర వడ్డీ ఆదాయం కూడా 29 శాతం వృద్ధితో రూ.271 కోట్లకు చేరుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రుణాల మంజూరు రూ.5,083 కోట్ల నుంచి రూ.6,919 కోట్లకు పెరిగింది.

ఏప్రిల్ నెలలో 11,656 ట్రాక్టర్లను విక్రయించినట్టు సోనాలికా ట్రాక్టర్స్ వెల్లడించింది. హెవీ ట్రాక్టర్ శ్రేణిలో నాణ్యత, పనితీరు ఆధారంగా సోనాలికా దేశంలోనే మూడో అతి పెద్ద ట్రాక్టర్ బ్రాండ్‌గా నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరాన్ని అద్భుతంగా ప్రారంభించినట్టు ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జేఎండీ రమణ్ మిట్టల్ తెలిపారు.

22,355 పైన బుల్లిష్

(మే 13-17 తేదీల మధ్య వారా



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,476-21,932 పాయింట్ల మధ్యన కదలాడి గత వారంతో పోల్చితే 421 పాయింట్ల నష్టంతో 22,055 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,355 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,115, 22,305, 22,422, 22,420 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

టెక్ వ్యూ

బ్రేకౌట్ స్థాయి: 22,355 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21,750

నిరోధ స్థాయిలు : 22,255, 22,355, 22,455 (22,155 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 21,850, 21,750, 21,650

జర జాగ్రత్త!

ఈ వారం ట్రేడర్లు, ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది. రఫాపై ఇజ్రాయెల్ తీవ్రంగా విరుచుకుపడుతుండటంతో పాటు కంపెనీల ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవటం వంటివి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. మరోవైపు సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి నెలకొంది. ఇదే సమయంలో విదేశీ సంస్థాగత మదుపరులు నిధులను పెద్దఎత్తున ఉపసంహరించుకుంటున్నారు. ఈ నెల 2 నుంచి ఇప్పటి వరకు రూ.25,000 కోట్లు ఉపసంహరించుకున్నారు. కాగా నిఫ్టీకి 22,000 వద్ద మద్దతు, 22,550వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఇండియా విక్స్ పెరుగుదల బేర్స్ పట్టును సూచిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

టాటా మోటార్స్: రెండు నెలలుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ షేరు మళ్లీ జీవితకాల నిరోధ స్థాయికి చేరుకుంది. మార్కెట్ అంచనాలను మించి ఫలితాలు విడుదల చేయటం సానుకూల అంశం. చివరి మూడు సెషన్లలో మూమెంటమ్‌ను బట్టి చూస్తే నిరోధాన్ని బ్రేక్ చేసేలా కనిపిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 1.59 శాతం లాభంతో రూ.1,046వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,040/1,020 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,150/1,210 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.990స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆస్ట్రాల్: గడిచిన కొన్నాళ్లుగా సైడ్‌వేస్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరులో ఒక్కసారిగా మూమెంటమ్ పెరిగింది. చివరి ఐదు రోజుల్లో ట్రేడింగ్, డెలివరీ సగటు వాల్యూమ్ 2.5 రెట్లు పెరిగింది. పైగా శుక్రవారం ఆల్‌టైమ్ హై రూ.2,149ని బ్రేక్ చేసింది. నిఫ్టీతో పోలిస్తే జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం ఈషేరు 4.3% లాభంతో రూ.2,159 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.2,140 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.2,260/2,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,100 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జొమాటో: ఈ కౌంటర్ సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. మెరుగైన త్రైమాసిక ఫలితాలు విడుదల చేస్తుందన్న అంచనాలు ఉన్నాయి. గత నెల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.200 శ్రేణిలో ప్రవేశించి రూ.225/255 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.185 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హీరోమోటోకార్ప్: గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసినప్పటి నుంచి ఈ కంపెనీ షేరు దూసుకుపోతోంది. మరోసారి కీలక నిరోధ స్థాయికి చేరుకుంది. రిలేటివ్ స్ట్రెంత్, డెలివరీ వాల్యూమ్ పెరుగుదలను బట్టి చూస్తే దీన్ని బ్రేక్ చేయటం ఖాయంగా కనిపిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 2.36 శాతం లాభంతో రూ.4,877 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.4,850/4,820 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.4,980/5,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,780 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందుస్థాన్ జింక్: గడచిన ఆరు వారాల నుంచి ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. ఏకంగా 85 మేర రిటర్నులు అందించింది. డివిడెండ్ తేదీ సమీపిస్తుండటం, చైనాలో జింక్ ధరలు పెరుగుతాయన్న అంచనాలతో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెడుతున్నారు. దీంతో క్రితం జీవితకాల గరిష్ఠ స్థాయి అయిన రూ.487ను బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు 15 శాతం లాభంతో రూ.527 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.500/520 స్థాయిల్లో ప్రవేశించి రూ.555/595 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

మద్దతు స్థాయి 21,950



వి. సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం నెగెటివ్‌గా ప్రారంభమై 22,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైంది. తదుపరి క్రమంలో 22,000 కన్నా దిగజారినా శుక్రవారం మైనర్ రికవరీతో ఆ స్థాయి కన్నా పైనే ముగిసింది. అయినప్పటికీ ముందు వారంతో పోల్చితే 420 పాయింట్ల నష్టంతో వారం కనిష్ఠ స్థాయి, స్వల్పకాలిక మద్దతు స్థాయిలకు సమీపంలో ముగిసింది. గత కొద్ది నెలలుగా ఈ స్థాయిల్లో రికవరీ ఏర్పడుతోంది. గత వారం మైనర్ బ్రేక్‌డౌన్ సాధించినందు వల్ల మరింత బలహీనపడే ఆస్కారం ఉంది. కాగా గత వారం మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1400 పాయింట్లు, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 830 పాయింట్లు నష్టపోయాయి.

గత రెండు నెలలుగా పరిమిత పరిధిలోనే కదలాడుతున్న మార్కెట్ ఇప్పుడు ఈ పరిధిలో దిగువ మద్దతు స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది. సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో ఈ స్థాయిలో తప్పనిసరిగా బలం ప్రదర్శించాలి. మార్కెట్లో కన్సాలిడేషన్ ఏర్పడవలసి ఉంది. 22,000 వద్ద నిలదొక్కుకుని పురోగమిస్తుందా, లేదా వేచి చూడాలి.

బుల్లిష్ స్థాయిలు: తొలుత మార్కెట్ నిలదొక్కుకోవాల్సి ఉంది. పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 22,150 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. ఆ పైన మరో నిరోధం 22,300. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయి 21,950 (గత రెండు సెషన్లలో ఏర్పడిన మద్దతు స్థాయి) వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనత ఉన్నట్టుగా సంకేతం ఇస్తుంది. దిగువన మరో మద్దతు స్థాయి 21,700. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 21,500.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచీ గత వారం 49,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై 1,500 పాయింట్ల మేరకు నష్టపోయి 47,400 వద్ద ముగిసింది. ఇది బలహీనత సంకేతం. రికవరీ బాట పట్టినట్టయితే ప్రధాన నిరోధ స్థాయిలు 47,600, 48,000 వద్ద కన్సాలిడేట్ కావాలి. మరింత బలహీనపడినట్టయితే దిగువన మద్దతు స్థాయిలు 46,900, 46,500.

పాటర్న్: మార్కెట్ గత వారం 50 డిఎంఏ కన్నా దిగజారింది. ఇప్పుడు 100 డిఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనబోతోంది. గత నాలుగు నెలల్లో నిఫ్టీకి 22,000 వద్ద నాలుగు బాటమ్‌లు ఏర్పడ్డాయి.ఇప్పుడు ఐదోసారి పరీక్షకు సమాయత్తమవుతోంది.

టైమ్ : మార్కెట్ గత వారం టాప్ ఏర్పరచుకున్నట్టు కనిపిస్తోంది. స్వల్పకాలిక బలహీనత ఉండవచ్చుననేందుకు ఇది సంకేతం. ఈ సూచీ ప్రకారం గురువారం స్వల్పకాలిక రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,100, 22,150
మద్దతు	21,950, 21,870

www.sundartrends.in

స్పోర్ట్స్

చెన్నై చమక్



ప్లేఆఫ్స్ ఆశలు సజీవం

ఐదు వికెట్లతో రాజస్థాన్‌పై విజయం
రాణించిన సిమర్‌జీత్, రుతురాజ్

చెన్నై: కీలక పోరులో చెన్నై సత్తా చాటింది. స్వస్థలంలో ఈ సీజన్‌లో జరిగిన చివరి మ్యాచ్‌లో రాజస్థాన్‌తోపై ఐదు వికెట్లతో నెగ్గిన సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. ఆదివారం జరిగిన స్వల్ప స్కోర్ల పోరులో మొదట రాజస్థాన్ 20 ఓవర్లలో 141/5 స్కోరుకే పరిమితమైంది. రియాన్ పరాగ్ (47 నాటౌట్) టాప్ స్కోరర్. జురెల్ (28), జైస్వాల్ (24) పర్లేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సిమర్‌జీత్ సింగ్ మూడు వికెట్లతో ప్రత్యర్థిని కట్టడి చేశాడు. తుషార్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో చెన్నై 18.2 ఓవర్లలో 145/5 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ రుతురాజ్ (42 నాటౌట్) అజేయంగా నిలవగా, రచిన్ (27), మిచెల్ (22) రాణించారు. అశ్విన్ రెండు వికెట్లు సాధించాడు. ఈ విజయంతో 14 పాయింట్లతో చెన్నై మూడో స్థానానికి చేరింది.

దూకుడైన ఆరంభం: బౌల్ట్ వేసిన మూడో ఓవర్లో రచిన్ 4,6 బాదడంతో చెన్నై ఛేదన దూకుడుగా సాగింది. నాలుగో ఓవర్లో రచిన్‌ను అశ్విన్ అవుట్ చేసి చెన్నైకి షాకిచ్చాడు. కానీ మిచెల్ బౌండరీలతో హోరెత్తించగా, ఆచితూచి ఆడిన రుతురాజ్ అతడితో కలిసి రెండో వికెట్‌కు 35 పరుగులు జత చేశాడు. మిచెల్‌ను స్పిన్నర్ చాహల్ ఎల్బీ చేయగా..మొయిన్ (10) కూడా త్వరగా నిష్క్రమించాడు. శివమ్ దూబే (18) తన సహజ శైలిలో మెరుపులు మెరిపించగా..జడేజా అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్ (ఫీల్డర్‌ను అడ్డుకున్నందుకు)గా రనౌటయ్యాడు. ఆపై సమీర్ రిజ్వీ (15 నాటౌట్) జతగా రుతురాజ్ చెన్నైను విజయ తీరాలకు చేర్చాడు.

దెబ్బ కొట్టిన సిమర్‌జీత్: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్‌కు స్లో పిచ్‌పై పరుగులు చేయడం కష్టమైంది. ఓపెనర్లు జైస్వాల్, బట్లర్ ఆచితూచి ఆడి తొలి వికెట్‌కు 43 రన్స్ జోడించారు. పవర్ ప్లే తర్వాత బౌలింగ్ చేపట్టిన సమర్‌జీత్ సింగ్..తన వరుస ఓవర్లలో తొలుత జైస్వాల్‌ను, ఆపై బట్లర్‌ను అవుట్ చేశాడు. ఈ దశలో కెప్టెన్ శాంసన్, పరాగ్ మూడో వికెట్‌కు 42 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. 15 ఓవర్లో సంజూ (15)ను పెవిలియన్ చేర్చిన సిమర్‌జీత్ మరోసారి ప్రత్యర్థికి ఝలకిచ్చాడు. ఆపై జురెల్-పరాగ్ నాలుగో వికెట్‌కు 40 పరుగులు జోడించినా.. వేగంగా రన్స్ రాబట్టలేకపోయారు. ఆఖరి ఓవర్లో వరుస బంతుల్లో జురెల్, శుభమ్ దూబే (0)ను తుషార్ అవుట్ చేయడంతో రాజస్థాన్ స్కోరు కనీసం150 కూడా చేరలేదు.

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (సి) రుతురాజ్ (బి) సిమర్‌జీత్ 24, బట్లర్ (సి) తుషార్ (బి) సిమర్‌జీత్ 21, శాంసన్ (సి) రుతురాజ్ (బి) సిమర్‌జీత్ 15, పరాగ్ (నాటౌట్) 47, జురెల్ (సి) శార్దూల్ (బి) తుషార్ 28, శుభమ్ దూబే (సి) శివమ్ దూబే (బి) తుషార్ 0, అశ్విన్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 141/5; వికెట్లపతనం:** 1-43, 2-49, 3-91, 4-131, 5-131; **బౌలింగ్:** తుషార్ దేశ్‌పాండే 4-0-30-2, తీక్షణ 4-0-28-0, శార్దూల్ 4-0-32-0, సిమర్‌జీత్ సింగ్ 4-0-26-3, జడేజా 4-0-24-0.

చెన్నై: రచిన్ (సి అండ్ బీ) అశ్విన్ 27, రుతురాజ్ (నాటౌట్) 42, మిచెల్ (ఎల్బీ) చాహల్ 22, మొయిన్ (సి) అవేశ్ (బి) బర్గర్ 10, శివమ్ దూబే (సి) పరాగ్ (బి) అశ్విన్ 18, జడేజా (అబ్‌స్ట్రక్టింగ్ ది ఫీల్డ్) 5, సమీర్ రిజ్వీ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.2 ఓవర్లలో 145/5; వికెట్లపతనం:** 1-32, 2-67, 3-86, 4-107, 5-121; **బౌలింగ్:** బౌల్ట్ 2.2-0-24-0, సందీప్ శర్మ 3-0-30-0, అశ్విన్ 4-0-35-2, నాంద్రే బర్గర్ 3-0-21-1, చాహల్ 4-0-22-1, అవేశ్ ఖాన్ 2-0-12-0.



జడేజా అవుట్ ఇలా..

జడేజా అబ్‌స్ట్రక్టింగ్ ది ఫీల్డ్ పద్ధతిలో రనౌటయ్యాడు. అవేశ్ ఖాన్ వేసిన 16 ఓవర్ ఐదో బంతిని జడేజా థర్డ్‌మ్యాన్‌వైపు కొట్టి పరుగు తీశాడు. రెండో రన్‌కోసం కూడా జడేజా ప్రయత్నించగా మరో ఎండ్‌లో ఉన్న రుతురాజ్ నివారించాడు. దాంతో జడేజా మళ్లీ వెనక్కు మళ్లాడు. ఈలోపు థర్డ్‌మ్యాన్‌లో ఉన్న ఫీల్డర్ అందించిన బంతిని బౌలింగ్ ఎండ్‌వైపు కీపర్ శాంసన్ విసిరాడు. ఈక్రమంలో..వెనక్కు మళ్లిన జడేజాకు ఆ బంతి తగిలింది. దాంతో రనౌట్‌కోసం రాజస్థాన్ అప్పీలు చేసింది. బంతి ఏ దిశలో వస్తుందో తెలిసీ జడేజా..ఆ దిశలో వెనక్కు వెళ్లాడని భావించిన అంపైర్ అతడిని అవుట్‌గా ప్రకటించాడు. ఐపీఎల్‌లో ఇలా అవుటైన మూడో ఆటగాడు జడేజా. 2013లో యూసుఫ్ పఠాన్, 2019 అమిత్ మిశ్రా కూడా ఈ విధంగానే నిష్క్రమించాడు.

ప్రజ్ఞానందకు 4, అర్జున్‌కు 5
సూపర్ బెట్ చెస్ విజేత కార్ల్‌సన్

వార్సా (పోలెండ్) : వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్ సూపర్ బెట్ చెస్ టోర్నీ తొలి అంచె విజేతగా నిలిచాడు. 9 రౌండ్ల ర్యాపిడ్, 18 రౌండ్ల బ్లిట్జ్ గేమ్‌లతో కూడిన టోర్నీలో మొత్తం 26 పాయింట్లతో కార్ల్‌సన్ టైటిల్ అందుకున్నాడు. చైనాకు చెందిన వీ ఈ (25.5) రెండో స్థానంలో నిలిచాడు. ప్రజ్ఞానంద (19), అర్జున్ (18) వరుసగా నాలుగు, ఐదో స్థానాలు దక్కించుకున్నారు. గుకేష్ (12.5) పదో, ఆఖరి స్థానంతో నిరాశ పరిచాడు.. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ 27వ, చివరి రౌండ్‌లో నార్వే సూపర్ స్టార్ కార్ల్‌సన్‌ను నిలువరించడం విశేషం. కాగా..గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా ఈ టోర్నీ మొత్తం ఐదు అంచెల్లో జరగనుంది.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం. వేదిక: అహ్మదాబాద్

గుజరాత్ X కోల్‌కతా

ఇప్పటికి వీరే..




పరుగులు: విరాట్ కోహ్లీ (బెంగళూరు) 661 (13 మ్యాచ్‌లు)



వికెట్లు: బుమ్రా (ముంబై) 20 (13 మ్యాచ్‌లు)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	12	9	3	0	18	1.428
రాజస్థాన్	12	8	4	0	16	0.349
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
బెంగళూరు	13	6	7	0	12	0.387
ఢిల్లీ	13	6	7	0	12	-0.482
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
గుజరాత్	12	5	7	0	10	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423



దీక్ష రికార్డు ప్రదర్శన

న్యూఢిల్లీ: భారత అథ్లెట్ కేఎమ్ దీక్ష అంతర్జాతీయ వేదికపై రికార్డు ప్రదర్శనతో అదరగొట్టింది. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జరిగిన సౌండ్ రన్నింగ్ ట్రాక్ ఫెస్ట్‌లో మహిళల 1500 మీటర్ల రేసులో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం కొల్లగొట్టింది. దీక్ష ఫైనల్లో 4 నిమిషాల 04.78 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. ఈ క్రమంలో 2021 జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో 4 నిమిషాల 05.39 సెకన్లతో హర్మిలన్ బెయిన్స్ నెలకొల్పిన రికార్డును 25 ఏళ్ల దీక్ష బద్దలు కొట్టింది. ఇక, పురుషుల 5వేల మీటర్ల రేసులో భారత స్టార్ అవినాష్ సబ్లే 13:20.37 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు.

ట్రిపుల్ జంప్‌లో అనూషకు స్వర్ణం



భువనేశ్వర్: జాతీయ ఫెడరేషన్ కప్ చాంపియన్‌షిప్‌లో తెలుగు అథ్లెట్ మల్లాల అనూష పతకంతో మెరిసింది. ట్రిపుల్ జంప్‌లో స్వర్ణం సాధించింది. ఆదివారం ఇక్కడ జరిగిన ట్రిపుల్ జంప్ ఫైనల్స్‌లో ఏపీకి చెందిన అనూష 13.53 మీటర్లు లంఘించి విజేతగా నిలిచింది.

ఢిల్లీ ఢమాల్

బెంగళూరుకు వరుసగా ఐదో గెలుపు
రేసు రసవత్తరం



1 ఐపీఎల్‌లో ఎక్కువ సార్లు (18) డకౌట్ అయిన బ్యాటర్‌గా దినేశ్ కార్తీక్

బెంగళూరు: ఇరు జట్లదీ కచ్చితంగా గెలిచితీరాల్సిన పరిస్థితే.. కానీ కీలక మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ చేతులెత్తేసింది. బౌలర్లు మెరుగ్గానే రాణించినా, బ్యాటింగ్, ఫీల్డింగ్ వైఫల్యంతో మూల్యం చెల్లించుకుంది. అటు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మాత్రం అనూహ్య ఆటతీరుతో దూసుకెళుతోంది. వరుసగా ఆరు ఓటములతో ఫ్యాన్స్‌ను నిరాశపరిచిన ఈ జట్టు ఆ తర్వాత బలంగా పుంజుకుని వరుసగా ఐదో గెలుపును ఖాతాలో వేసుకొంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 47 రన్స్‌తో ఢిల్లీపై ఘన విజయం సాధించింది. దీంతో 12 పాయింట్లతో ఐదో స్థానానికి చేరింది. డీసీ ఆరో స్థానానికి పడిపోయింది. ఫలితంగా ఆర్‌సీబీ ప్లేఆఫ్ ఆశలు కూడా సజీవం కావడంతో రేసు రసవత్తరంగా మారింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 187 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (52), విల్ జాక్స్ (41), గ్రీన్ (32 నాటౌట్) రాణించారు. రసిక్, ఖలీల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.1 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటైంది. అక్షర్ (57), హోప్ (29) మాత్రమే రాణించారు. యష్ దయాల్‌కు 3, ఫెర్గూసన్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గ్రీన్ నిలిచాడు. కోహ్లీకిది 250వ ఐపీఎల్ మ్యాచ్.

అక్షర్ ఒక్కడే: ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అక్షర్ పటేల్ మాత్రమే ఆకట్టుకున్నాడు. ఓ మాదిరి ఛేదనే అయినా పేలవ షాట్లకు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. చాలా రోజుల తర్వాత జట్టులో స్థానం దక్కించుకున్న ఓపెనర్ వార్నర్ (1) తొలి ఓవర్‌లోనే నిష్క్రమించగా.. మూడో ఓవర్‌లో అభిషేక్ పోరెల్ (2)తో పాటు 2 సిక్సర్లు, 2 ఫోర్లతో జోరు మీదున్న మరో ఓపెనర్ ఫ్రేజర్ (21) అవుటయ్యారు. కుషాగ్ర (2)ను సిరాజ్ ఎల్బీ చేయడంతో 30/4 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. ఈ స్థితిలో అక్షర్-హోప్ జోడీ వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. ఐదో ఓవర్‌లో హోప్ 3 ఫోర్లతో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత అక్షర్ 2 ఫోర్లతో పవర్‌ప్లేలో 54/4తో జట్టు ఫర్వాలేదనిపించింది. అనంతరం బౌలర్లు కట్టడి చేయడంతో పరుగుల వేగం తగ్గింది. పదో ఓవర్‌లో హోప్‌ను ఫెర్గూసన్ అవుట్ చేయడంతో ఐదో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే స్టబ్స్ (3) రనౌటయ్యాడు. అటు అక్షర్ జోరు కొనసాగిస్తూ జాక్స్ ఓవర్‌లో రెండు సిక్సర్లతో 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ కాసేపట్లోనే రసిక్ (10), అక్షర్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేరడంతో ఢిల్లీ ఓటమి ఖాయమైంది.

ఆదుకున్న పటీదార్-జాక్స్: తొలి పది ఓవర్లలో 110/2.. ఆ తర్వాత చేసింది 77/7 మాత్రమే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ ఆడిన తీరిది. రజత్ పటీదార్-విల్ జాక్స్ ఉన్నంతసేపు సులువుగా 200 దాటుతుందనిపించినా.. ఆఖర్లో ఢిల్లీ బౌలర్లు అదరగొట్టారు. తొలి నాలుగు ఓవర్లలోనే ఓపెనర్లు డుప్లెసి (6), విరాట్ (27) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో విల్ జాక్స్, రజత్ పటీదార్ జోడీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. దీనికి తోడు కుల్దీప్ ఓవర్‌లో వీరిచ్చిన సులువైన క్యాచ్‌లను వదిలివేయడం కలిసివచ్చింది. ఐదో ఓవర్‌లో పటీదార్ 3 ఫోర్లు బాదడంతో పవర్‌ప్లేలో జట్టు 61/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా ఇద్దరూ భారీ షాట్లతో ఆకట్టుకున్నారు. దీంతో పటీదార్ 29 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఎట్టకేలకు 13వ ఓవర్‌లో పటీదార్ ఇచ్చిన క్యాచ్‌ను అక్షర్ అందుకోవడంతో మూడో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వెంటనే జాక్స్‌ను కుల్దీప్ అవుట్ చేశాడు. ఈ దశలో 17వ ఓవర్‌లో గ్రీన్ రెండు, లొమ్రోర్ (13) ఓ సిక్సర్‌తో 22 రన్స్ వచ్చాయి. కానీ చివరి 3 ఓవర్లలో జట్టు తడబడింది. లొమ్రోర్, దినేశ్ కార్తీక్ (0)లను ఖలీల్ ఒకే ఓవర్‌లో అవుట్ చేయగా.. ఆ తర్వాత 12 బంతుల్లో 13 పరుగులే చేసిన ఆర్‌సీబీ స్వప్నిల్ (0), కర్ణ్ శర్మ (6), సిరాజ్ (0) వికెట్లను కోల్పోయింది. దీంతో 190 రన్స్ లోపే ఇన్నింగ్స్ ముగిసింది.



స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (సి) అభిషేక్ (బి) ఇషాంత్ 27, డుప్లెసి (సి) ఫ్రేజర్ (బి) ముకేశ్ 6, విల్ జాక్స్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 41, పటీదార్ (సి) అక్షర్ (బి) రసిక్ 52, గ్రీన్ (నాటౌట్) 32, లోమ్రోర్ (సి) అభిషేక్ (బి) ఖలీల్ 13, కార్తీక్ (సి) కుల్దీప్ (బి) ఖలీల్ 0, స్వప్నిల్ (సి) కుశాగ్ర (బి) రసిక్ 0, కర్ణ్ శర్మ (రనౌట్) 6, సిరాజ్ (రనౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 187/9; వికెట్ల పతనం:** 1-23, 2-36, 3-124, 4-137, 5-174, 6-174, 7-176, 8-185, 9-187; **బౌలింగ్:** ఇషాంత్ 3-0-31-1, ఖలీల్ 4-0-31-2, ముకేశ్ 3-0-23-1, అక్షర్ 3-0-24-0, కుల్దీప్ 4-0-52-1, రసిక్ 3-0-23-2.

ఢిల్లీ: వార్నర్ (సి) జాక్స్ (బి) స్వప్నిల్ 1, ఫ్రేజర్ (రనౌట్) 21, అభిషేక్ పోరెల్ (సి) ఫెర్గూసన్ (బి) యశ్ దయాల్ 2, హోప్ (సి) కర్ణ్ (బి) ఫెర్గూసన్ 29, కుశాగ్ర (ఎల్బీ) సిరాజ్ 2, అక్షర్ (సి) డుప్లెసి (బి) యశ్ దయాల్ 57, స్టబ్స్ (రనౌట్) 3, రసిక్ (సి) జాక్స్ (బి) గ్రీన్ 10, కుల్దీప్ (బి) యశ్ దయాల్ 6, ముకేశ్ (సి) లోమ్రోర్ (బి) ఫెర్గూసన్ 3, ఇషాంత్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19.1 ఓవర్లలో 140 ఆలౌట్: వికెట్ల పతనం:** 1-8, 2-24, 3-24, 4-30, 5-86, 6-90, 7-127, 8-128, 9-135, 10-140; **బౌలింగ్:** స్వప్నిల్ 1-0-9-1, సిరాజ్ 4-0-33-1, యశ్ దయాల్ 3.1-0-20-3, కర్ణ్ శర్మ 2-0-19-0, ఫెర్గూసన్ 4-0-23-2, గ్రీన్ 4-0-19-1, విల్ జాక్స్ 1-0-16-0.

ఆఖరి టీ20లో జింబాబ్వే గెలుపు

ఢాకా: ఆతిథ్య బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో జింబాబ్వేకు ఊరట విజయం దక్కింది. ఇప్పటికే వరుసగా 4 మ్యాచ్‌లు కోల్పోయిన జింబాబ్వే.. ఆఖరిదైన ఐదో పోరులో 8 వికెట్లతో గెలిచింది. మొదట బంగ్లా.. మహ్మదుల్లా (54) రాణించడంతో 20 ఓవర్లలో 157/6 స్కోరు చేసింది. ఛేదనలో కెప్టెన్ సికందర్ రజా (72 నాటౌట్), ఓపెనర్ బ్రయాన్ (70) సత్తా చాటడంతో 18.3 ఓవర్లలోనే 158/2 స్కోరు చేసి గెలిచింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 13-5-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ

నాలుగో దశలో 96 ఎంపీ స్థానాలకు నేడు ఓటింగ్

ఒడిసా అసెంబ్లీలోని 28 స్థానాలకు సైతం

బెంగాల్‌లోని అన్ని పోలింగ్ కేంద్రాలూ తీవ్ర సమస్యాత్మకం 2

భారీ సంఖ్యలో కేంద్ర బలగాలు

సాక్ష్యాలన్నీ చెరిపేద్దాం!

మాయమవుతున్న మద్యం విక్రయాల డేటా

ప్రభుత్వం మారితే అక్రమాలన్నీ వెలుగులోకి

ముందే సర్దుకుంటున్న బేవరేజెస్ అధికారులు

ఏకంగా కంప్యూటర్లలోని హార్డ్‌డిస్క్‌లే మాయం

ఇబ్బందులకున్న సమాచారమంతా బయటికి

అదనపు ధరకు కొనుగోళ్లు, బ్రాండ్ల వారీ అమ్మకాలు, నగదు అంశాలన్నీ గాయబ్ 3

నేడే పోలింగ్

ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్

3 చోట్ల 4 గంటలకు, మరో 3 చోట్ల 5 గంటల వరకు

చీమ చిటుక్కుమన్నా తెలిసేలా వెబ్‌కాస్టింగ్

'పోల్‌డే మేనేజ్‌మెంట్'తో ఈసీ నిశిత పరిశీలన

ఓటేసేందుకు 12 ప్రత్యామ్నాయ కార్డులు

ఓటర్లు: 4,14,18,870.. పోలింగ్ కేంద్రాలు: 46,389

బలగాలు: 1,06,145.. పోల్ సిబ్బంది: 4,05,126



తిరుపతి జిల్లా తడ మండల పరిధిలోని పులికాట్ సరస్సు మధ్యలో ఉండే ఇరకం దీవికి ఈవీఎంలను, సిబ్బందిని పడవలో తరలిస్తున్న దృశ్యం

ఆఖరి రోజూ

అవే కుత్రలు

ధనం, మద్యంతో వైసీపీ ప్రలోభాలు

డీప్‌ఫేక్ వీడియోలతో మాయలు

రోత, కూలి, నీలి మీడియా నీచం

వెబ్‌కాస్టింగ్‌ను అడ్డుకునే యత్నాలు

పల్నాడులో కెమెరా, కేబుళ్లు ఎత్తుకెళ్లిన మూకలు

పోలింగ్ వేళ అరాచకాలు సృష్టించే ఎత్తుగడ

ఎన్నికల కమిషన్ పకడ్బందీ చర్యలు

34 వేల కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు

అందులో 12 వేల సమస్యాత్మక కేంద్రాలు

నియోజకవర్గానికో పోలీసు అబ్జర్వర్

అవాంఛనీయ ఘటనలకు కలెక్టర్లు, ఎస్పీలదే బాధ్యత

విచ్చలవిడిగా మద్యం, డబ్బులు, కానుకల పంపిణీతో ఓటర్లపై ప్రలోభాల వల! అయినా గెలుపుపై ధీమా లేకపోవడంతో 'డీప్ ఫేక్' వీడియోలతో నీచ రాజకీయం! చంద్రబాబు అనని మాటలు అన్నట్లుగా తప్పుడు వీడియోలతో రోత, కూలి మీడియా కుతంత్రం! సోమవారం పోలింగ్ జరగనుండగా... ఆదివారం రాత్రిదాకా అవే కుత్రలు! అన్నిరకాల అడ్డగోలు వ్యూహాలూ రచిస్తూ... అక్రమాలపై నిఘా కోసం ఈసీ ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్‌కూ అడ్డంకులు

మిగతా 12వ పేజీలో...

వైసీపీ 'ఫేక్' ప్రచారం

చంద్రబాబుపై డీప్ ఫేక్ వీడియో

కట్, పేస్ట్‌లతో అసత్య ప్రచారం

పోలింగ్ ముందు దిగజారుడు రాజకీయం

వీడియో తనది కాదని బాబు ఖండన

ఎక్స్‌లో ఒరిజినల్ వీడియో పోస్టు



చీరలు విసిరి కొడుతున్న మహిళలు

డబ్బులివ్వాల్సిందే!

ఓటర్ల నుంచి వైసీపీకి వింత నిరసనలు

అధికార పార్టీ నేతలు, అభ్యర్థులకు చుక్కలు

పలు నియోజకవర్గాల్లో ముట్టడులు, ఘెరావ్‌లు

కొన్నిచోట్ల పోలీసులను రప్పించాల్సిన పరిస్థితి

నాసిరకం చీరలా అంటూ కోనసీమలో వైసీపీ నేతల ముఖాన్నే కొట్టిన మహిళలు 2

ఓటెవరికి?

ఆలోచించండి.. ఓటుకు పోటెత్తండి

1 బటన్ నొక్కినంత మాత్రాన బతుకులనూ నొక్కేందుకు లైసెన్స్ ఇచ్చేసినట్లేనా!?

1 సంక్షేమాన్ని తానే కనిపెట్టినట్లు, గతంలో ఏ ముఖ్యమంత్రీ సంక్షేమ పథకాలు అమలు చేయనట్లు చేసిన మాయలను నమ్మేస్తామా?

1 తెలుగుదేశం హయాంలో రూ.200ల పింఛను ఒకేసారి వెయ్యికి, ఆపై రెండువేలకు పెరిగిందనే విషయాన్ని మరిచిపోతారా?

1 లక్షల కోట్ల అప్పు తెచ్చి, పన్నులతో పీడించి, వంద లాక్కొని పది పంచడమే సంక్షేమమా?

1 సంక్షేమంతోపాటు అభివృద్ధి ఉండాలనే జనం ఆకాంక్షలను విస్మరించిన పాలకులను క్షమిస్తారా?

1 'అధికారం పాలన సాగించేందుకు కాదు... పగ సాధించేందుకు' అనే సూత్రీకరణకు సమాధి కట్టకుండా వదిలేస్తారా?

1 ఉద్యోగాల కోసం ఉన్న ఊరిని, కన్నవారినీ వదిలి హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు బ్యాగులు సర్దుకుని పోక తప్పని పరిస్థితినే కొనసాగిద్దామా?

1 పోలవరం అనే జలనాడిని కత్తిరించడం... అమరావతి అనే జీవనాడిని ఛిద్రం చేయడాన్ని సమ్మతిస్తారా?

1 విభజన జరిగి దశాబ్దం గడుస్తున్నా రాజధాని లేని రాష్ట్రంగా కొనసాగడమే కావాలా?

1 మీ తాతలు, తండ్రులు ఇచ్చిన భూములు, ఆస్తి పత్రాలపై ఇంకెవరి ఫొటోలో ఉంటే సహిస్తారా?

1 భూమిని రక్షించడం కాదు... భూమిని భక్షించే చట్టాలను మెడకు చుట్టేస్తుంటే చూస్తూ ఉంటారా?

1 ఇల్లూ ఒళ్లూ గుల్ల చేసే నాసిరకం మద్యం... ఇసుక తవ్వకాలతో నదులకు గర్భశోకం... మాఫియా రాజ్ నుంచి విముక్తి లేదా?

1 'ఒక్క చాన్స్'తో జరిగిన విధ్వంసం చాలదా!?



ఐదేళ్ల అరాచకాలపై ఓటుతో వేటెయ్యండి!

హై.. హై.. నాయకా!

10 11

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..



నిర్ణయం మీది.. తీర్పు చెప్పేది మీరే! కదలండి.. ఓటుకు పోటెత్తండి!

పోలింగ్‌కు ముందు

మరో పంచ్

నంద్యాల ఎస్పీపై వేటేసిన సీఈసీ

కోడ్ అమల్లో రఘువీర్‌రెడ్డి ఫెయిల్..

ఓఎస్డీ, సీఐపైనా ఎన్నికల సంఘం ఫైర్

ఆ ముగ్గురిపైనా విచారణకు ఆదేశాలు

సస్పెన్షన్, మేజర్ పెనాల్టీకి సిఫారసు

60 రోజుల్లోగా వారిపై చర్య తీసుకుని తమకు నివేదించాలని డీజీపీకి నిర్దేశం

తిరుపతి జిల్లాలో ఐదుగురి బదిలీ



ఎస్పీ రఘువీర్‌రెడ్డి

అమరావతి/నంద్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీకి దాసోహం అంటున్న పోలీసులపై సీరియస్‌గా ఉన్న కేంద్ర ఎన్నికల కమిషన్.. పోలింగ్‌కు కొన్ని గంటల ముందు వైసీపీ వీరభక్త పోలీసులకు మరోసారి షాకిచ్చింది. జిల్లాల ఎస్పీల నుంచి డీజీపీ వరకూ ఏకపక్ష పోలీసు అధికారుల్ని దెబ్బమీద దెబ్బ కొడుతున్న సీఈసీ....తాజాగా ఒక ఎస్పీతో పాటు ముగ్గురు అధికారులపై సీరియస్ అయ్యింది. నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డితోపాటు

మిగతా 9వ పేజీలో...

బందోబస్తులో దిద్దుబాటు

పోలీసుల కేటాయింపుల్లో మార్పులు.. సమస్యాత్మక ప్రాంతాలకు అధిక బలగాలు

చివరి నిమిషం మార్పులతో కలకలం.. అయితే, గతంలో 'ఏకపక్షం'గా కేటాయింపు

దాన్ని గుర్తించి, సరిదిద్దిన కొత్త డీజీపీ హరీశ్ గుప్తా 3



కూటమిలో జోష్!

ప్రభుత్వం మారడం ఖాయమని నేతల ధీమా

ఆత్మవిశ్వాసంతో పోలింగ్‌కు సన్నద్ధం

జగన్‌పై వివిధ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత

వైసీపీ పథకాల కంటే సూపర్‌సిక్స్ స్కీంలు హిట్

ఓటేయడానికి పొరుగు నుంచీ ప్రవాహంలా జనం

విదేశాల నుంచీ భారీగా తరలివచ్చిన ఎన్నారైలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలింగ్ వేళ టీడీపీ కూటమిలో సమరోత్సాహం కనిపిస్తోంది. ఎన్నికల్లో తమ విజయం ఖాయమన్న ధీమా కూటమి నేతల్లో బలంగా వ్యక్తమవుతోంది. సోమవారం జరిగే పోలింగ్‌కు కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, శ్రేణులు

మిగతా 9వ పేజీలో...

వైసీపీ.. నాడు ధీమా.. నేడు డీలా!

'వైనాట్ 175' ఉత్సాహం మాయం 9



వీరభక్తులపై ఈసీ వేటుతో జగన్‌లో ఆకస్మిక బేలతనం

చిన్నాన్న వివేకా హత్య కేసు రివర్స్.. కాంగ్రెస్‌లో చేరి చెల్లెలు షర్మిల సవాల్

ఏకంగా కడపలో అవినాశ్‌రెడ్డిపై పోటీ.. ఆమెకు మద్దతుగా సునీత ప్రచారం

కడపలో కుమార్తెకే ఓటేయాలని అమెరికా నుంచి తల్లి విజయలక్ష్మి సందేశం

భారీగా దెబ్బతీసిన ల్యాండ్ యాక్టు?.. విజయం నుంచి 'టైట్'కు పడ్డ అంచనాలు



నిర్భయంగా ఓటేయండి

భద్రత కల్పించే బాధ్యత మాది.. ఓటర్లకు సీఈవో భరోసా

ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు.. మూడంచెల్లో ఈవీఎంలకు భద్రత

దివ్యాంగులకు వీల్ చైర్ల ఏర్పాటు.. 'నో వయలెన్స్-నో రీపోల్' నినాదంతో ప్రక్రియ

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో సీఈవో మీనా 12

ఝార్ఖండ్ మంత్రి ఆలంగీర్‌కు ఈడీ సమన్లు

రాంచీ, మే 12: మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని ఝార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆలంగీర్ ఆలం(70)కు ఈడీ సమన్లు పంపించింది. ఆయన ఇంట్లో పని చేసే సహాయకుడు జహంగీర్ ఆలం(42) వద్ద రూ.32 కోట్లు లభించిన నేపథ్యంలో ప్రశ్నించే నిమిత్తం మంగళవారం రాంచీలోని తమ కార్యాలయానికి రావాలని సూచించింది. గత వారం ఇదే వ్యవహారంలో జహంగీర్‌తో పాటు మంత్రి పీఎస్ సంజీవ్‌లాల్(52)ను ఈడీ అరెస్టు చేసింది.

దేశమంతా 200 యూనిట్ల ఉచిత విద్యుత్

» అగ్నిపథ్ పథకం రద్దు... రైతులకు కనీస మద్దతు ధర

» పది గ్యారెంటీలను ప్రకటించిన ఆప్ అధినేత కేజ్రీవాల్



న్యూఢిల్లీ, మే 12: 'నన్ను అరెస్టు చేసి ఆప్‌ను విచ్ఛిన్నం చేయాలని, ఆప్ ప్రభుత్వాన్ని కూలదోయాలన్న బీజేపీ కుట్ర భగ్నమైంది. నా అరెస్టుతో ఆప్ మరింత బలపడింద'ని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాను జైలులో ఉన్నప్పుడు ఆప్ ఎమ్మెల్యేలను, నాయకులను బీజేపీ సంప్రదించిందని తెలిపారు. కానీ వారెవరూ బీజేపీ కుట్రలను సాగనివ్వలేదని, ఆప్‌ను వీడి వెళ్లలేదన్నారు. 'దేశం మిమ్మల్ని చూసి గర్వపడుతోంద'ని తన పార్టీ ఎమ్మెల్యేలను అభినందించారు. ఆదివారం కేజ్రీవాల్ వారితో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో లోక్‌సభ ఎన్నికలకు పది గ్యారెంటీలను ప్రకటించారు. కేంద్రంలో 'ఇండియా' అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా 24 గంటల విద్యుత్తు సరఫరా చేస్తామని, ఢిల్లీలో మాదిరిగా 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తామని చెప్పారు. ఢిల్లీలో చేసినట్టే దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తామని తెలిపారు. ఢిల్లీ మోడల్‌లో దేశమంతటా మారుమూల ప్రాంతాలతో సహా 'మొహల్లా క్లినిక్'లు ఏర్పాటు చేస్తామన్నారు. చైనా ఆక్రమించిన భారత భూభాగాన్ని విడిపిస్తామన్నారు. స్వామినాథన్ కమిటీ నివేదికకు అనుగుణంగా రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామన్నారు. ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తి కల్పిస్తామన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ అవినీతిపై దేశవ్యాప్తంగా దాడులు చేయిస్తామని, జీఎస్టీని సరళం చేస్తామని కేజ్రీవాల్ తెలిపారు. అయితే, ఈ గ్యారెంటీలను 'ఇండియా' భాగస్వామ్య పక్షాలతో చర్చించలేదని, అందుకు సమయం దొరకలేదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. తాను ప్రధాని పదవి రేసులో లేనని స్పష్టం చేశారు. తర్వాత, కేజ్రీవాల్ పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్‌తో కలిసి ఢిల్లీలో ఆప్ లోక్‌సభ అభ్యర్థుల తరఫున రోడ్ షో నిర్వహించారు.

కులగణన ద్వారా దేశాన్ని 'ఎక్స్‌రే' తీస్తాం: రాహుల్

న్యూఢిల్లీ, మే 12: ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదివారం మరోసారి విరుచుకుపడ్డారు. కుబేరుల ద్వారా టెంపోల్లో పొందిన నోట్ల కట్టలను బీజేపీ లెక్కపెట్టుకుంటోందని, తమ పార్టీ మాత్రం అసమానతల్ని పారదోలేందుకు కులగణనను చేపట్టాలని చూస్తోందని ఆయన పేర్కొన్నారు. అంబానీ, అదానీల నుంచి టెంపోల్లో వచ్చిన ధనాన్ని కాంగ్రెస్ పొందుతోందని ఇటీవల ప్రధాని మోదీ ఆరోపించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "పదేళ్లుగా కుబేరుల నుంచి టెంపోల్లో వచ్చిన నోట్లను వాళ్లు లెక్కపెట్టుకుంటూనే ఉన్నారు. మేము మాత్రం అధికారంలోకి రాగానే కులగణన ద్వారా దేశాన్ని 'ఎక్స్‌రే' తీసి సంపదను అన్ని వర్గాలకు సమానంగా పంచుతా"మని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

అదానీ సంచీడు డబ్బులిచ్చినా చాలు!: అధీర్ రంజన్

న్యూఢిల్లీ, మే 12: దేశంలో నల్లజాతీయులు, మంగోలాయిడ్లు ఉన్నారనే వ్యాఖ్యలతో నాలుగైదు రోజుల క్రితమే పార్టీని ఇబ్బంది పెట్టిన బెంగాల్ కాంగ్రెస్ చీఫ్ అధీర్ రంజన్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'అదానీ-అంబానీ నుంచి టెంపోల్లో ఎంత నల్లధనం మీకు ముట్టింది?' అంటూ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ మే 8న చేసిన వ్యాఖ్యలపై ఒక యూట్యూబ్ చానల్ ఆయన స్పందన కోరగా.. "అలా (అదానీ, అంబానీ నుంచి డబ్బు) అంది ఉంటే చాలా ఆనందించేవాణ్ని. టెంపో లోడ్ డబ్బుల సంగతి పక్కన పెట్టండి.. అదానీ మా ఇంటికి ఒక సంచీడు డబ్బులు పంపినా నాకు సరిపోతుంది" అని బదులిచ్చారు. పార్లమెంటులో వారికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ప్రశ్నించగా.. "వారు డబ్బులు పంపలేదు. అందుకే మాట్లాడాం. వారు పంపి ఉంటే మేం మౌనంగా ఉండేవాళ్లం" అన్నారు.

నేడే నాలుగో దశ పోలింగ్

» 96 లోక్‌సభ స్థానాల్లో ఓటింగ్

» ఏపీ శాసనసభకు కూడా

» ఒడిశా అసెంబ్లీలోని 28 స్థానాలకూ



న్యూఢిల్లీ(ఆంధ్రజ్యోతి), అమరావతి/లఖ్‌నవూ, మే 12: దేశంలో పార్లమెంటు ఎన్నికల నాలుగో దశ పోలింగ్ సోమవారం జరగనుంది. 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 96 లోక్‌సభ స్థానాలతో 175 ఏపీ అసెంబ్లీ స్థానాలకు కూడా ఈ విడతలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. దీనికిసంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. నాలుగో దశ పార్లమెంటు ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన అగ్ర నేతలు బరిలో ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీలు ఈ దశలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గిరిరాజ్ సింగ్ బిహార్‌లోని బెగుసరాయ్ నుంచి, నిత్యానంద రాయ్ బిహార్‌లోని ఉజియార్‌పూర్ నుంచి, రావ్‌సాహెబ్ దాన్వే మహారాష్ట్రలోని జల్నా నియోజకవర్గం నుంచి, కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌధరి, టీఎంసీ నేత, మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్ ఇరువురూ పశ్చిమబెంగాల్‌లోని బహరంపూర్ నుంచి పోటీచేస్తున్నారు. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ నుంచి, కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల కడప పార్లమెంటు స్థానం నుంచి బరిలో ఉన్నారు. మొత్తం 96స్థానాల్లో బీజేపీ 40చోట్ల పోటీ చేస్తుండడం గమనార్హం. మిగిలిన స్థానాల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా, ఇప్పటి వరకు జరిగిన తొలి మూడు దశల్లో 283 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ప్రక్రియ ముగిసింది.

ఏపీ, తెలంగాణలోనే అత్యధిక సీట్లు

తెలంగాణలో 17, ఏపీలో 25, యూపీలో 13, బిహార్‌లో5, ఝార్ఖండ్‌లో 4, మధ్యప్రదేశ్‌లో 8, మహారాష్ట్రలో 11, ఒడిశాలో 4, బెంగాల్‌లో 8, జమ్ము కశ్మీర్‌లోని (శ్రీనగర్) 1 స్థానానికి సోమవారం పోలింగ్ జరగనుంది. కాగా, జమ్ము కశ్మీర్‌లోని ఒకేఒక్క నియోజకవర్గానికి జరిగే ఎన్నికలో 24మంది అభ్యర్థులు పోటీ చేస్తుండడం గమనార్హం. ఆర్టికల్ 370రద్దు తర్వాత జరుగుతున్న తొలి అతిపెద్ద ఎన్నిక ఇదే. ఈ ఎన్నికలో బీజేపీ పోటీకి దూరంగా ఉంది. షియా నాయకుడు అగా సయ్యద్ రుహుల్లా మెహ్దీ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ తరఫున బరిలోఉండగా, పీడీపీ తరఫున వహీద్ పారా పోటీ చేస్తున్నారు.

నాలుగో దశ పోలింగ్ అంకెల్లో..

బరిలో ఉన్న అభ్యర్థులు :	1,717
పోలింగ్ కేంద్రాలు:	1.92 లక్షలు
పోలింగ్ సిబ్బంది:	19 లక్షలు
ఓటర్లు:	17.70 కోట్లు
మహిళా ఓటర్లు:	8.73 కోట్లు
పురుష ఓటర్లు:	8.75 కోట్లు
వందేళ్లు దాటిన ఓటర్లు:	705

వీరికి టెన్షన్...

- యూపీలోని ఖేరి నియోజకవర్గం నుంచి వరుసగా మూడోసారి కేంద్రమంత్రి అజయ్ కుమార్ మిశ్రా తేని బరిలో ఉన్నారు. 2021లో లఖింపూర్‌ఖేరిలో జరిగిన విధ్వంసం కేసులో ఈయన కుమారుడు నిందితుడు. ఆ కేసు తాలూకు ప్రభావం పడే అవకాశం ఉందని ఈయన అంతర్మథనం చెందుతున్నారు.
- టీఎంసీ ఫైర్‌బ్రాండ్ మహువా మొయిత్రా.. ప్రశ్నలకు డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలతో లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఇప్పుడు మరోసారి ఆమె బెంగాల్‌లోని కృష్ణానగర్ నుంచి పోటీలో ఉన్నారు.
- అఖిలేశ్ యాదవ్ యూపీలోని కన్నోజ్ నుంచి పోటీ చేస్తుండగా ఈయన తరఫున కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ ఈ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు.
- బెంగాల్‌లోని అసన్‌సోల్ నియోజకవర్గం నుంచి సినీ నటుడు శత్రుఘ్న సిన్హా టీఎంసీ తరఫున పోటీ చేస్తున్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు ఎస్.ఎస్ అహ్లూవాలియాపై ఆయన బరిలో ఉన్నారు.
- కేంద్రమంత్రి, ఝార్ఖండ్ మాజీ సీఎం అర్జున్ ముండా కుంతి నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నారు.
- మాధవీలత బీజేపీ తరఫున హైదరాబాద్ నుంచి బరిలో ఉన్నారు.
- బీజేపీ ఫైర్‌బ్రాండ్ నాయకుడు బండిసంజయ్ కరీంనగర్ నుంచి పోటీ చేస్తున్నారు.
- నాలుగో దశ ఎన్నికల ప్రచారంలో రిజర్వేషన్లు, బుజ్జగింపు రాజకీయాలు, ఉద్యోగాలువంటి కీలక అంశాలు ప్రధానంగా అన్ని పార్టీలూ ప్రస్తావించాయి.
- బెంగాల్‌లోని 8నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన 3647 పోలింగ్ కేంద్రాలు అత్యంత సమస్యాత్మకమేనని ఎన్నికల సంఘం గుర్తించింది.
- ఏపీలో ఎన్డీయే కూటమి పక్షాలైన టీడీపీ 17, జనసేన 2, బీజేపీ 6 చోట్ల పోటీలో ఉన్నాయి.
- ఒడిశా శాసనసభకు సంబంధించి 28 స్థానాలకు కూడా నాలుగో దశలోనే పోలింగ్ జరగనుంది.

ఎన్డీయే మిత్రులకు అగ్నిపరీక్ష!

» నాలుగో విడత బరిలో టీడీపీ, జనసేన షిండే సేన, పవార్ ఎన్సీపీ, జేడీయూ

న్యూఢిల్లీ, మే12: లోక్‌సభ ఎన్నికల సంగ్రామంలో మరో కీలక ఘట్టం సోమవారం ముగియనుంది. నాలుగో దశలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 25, తెలంగాణలో 17 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశ ఎన్డీయే మిత్రపక్షాలకు అగ్నిపరీక్షేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఆంధ్రలో టీడీపీ-జనసేన, మహారాష్ట్రలో షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీ, బిహార్‌లో జేడీయూ, చిరాగ్ పాసవాన్ ఎల్‌జేపీ.. బీజేపీతో జట్టుకట్టాయి. ఆంధ్రలో 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలకూ పోలింగ్ జరగనుంది. ఎంపీ స్థానాల్లో టీడీపీ 17, జనసేన2, బీజేపీ6సీట్లలో పోటీచేస్తున్నాయి. టీడీపీ-జనసేన బలంపైనే బీజేపీ పూర్తిగా ఆధారపడింది. మహారాష్ట్రలో ఈ దశలో 11ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా వీటిలో 7చోట్ల బీజేపీ, షిండే సేన3, అజిత్ ఎన్సీపీ ఒకచోట బరిలోకి దిగాయి. శివసేన, ఎన్సీపీ నిలువునా చీలాక కీలక ఎన్నికలివి. షిండే సేన, అజిత్ ఎన్సీపీ తమ బలాన్ని నిరూపించుకోవడమేగాక బీజేపీ బరిలో ఉన్న స్థానాల్లో తమ ఓట్లను బదిలీచేయాల్సి ఉంది. బిహార్‌లో ఈ దశలో 5స్థానాల్లో ఎన్నికలు జరగనుండగా వీటిలో 3చోట్ల బీజేపీ, చెరోచోట ఎల్‌జేపీ, జేడీయూ పోటీచేస్తున్నాయి. గతఎన్నికల్లో కలిసి పోటీచేసిన ఎల్‌జేపీ అసెంబ్లీ ఎన్నికలనాటికి దూరమైంది. ఆ తర్వాత జేడీయూ కూడా బీజేపీనికాదని ఆర్‌జేడీ కూటమితో జట్టుకట్టి మళ్లీ ఎన్డీయేలోకివచ్చింది. ఎల్‌జేపీ కలిసి రావడంతో ఆర్‌జేడీ కూటమికి గట్టి సవాల్ విసురుతున్నాయి.

లోకం తీరు



టెంపోల్లో సొమ్ము వస్తే.. ఈడీని పంపరెందుకు?

» అదానీ, అంబానీలపై దర్యాప్తు చేయించండి.. మోదీకి ఖర్గే సవాలు

ధూలే (మహారాష్ట్ర), మే 12: అదానీ, అంబానీలు కాంగ్రెస్‌కు టెంపోల్లో సొమ్ము పంపిస్తున్నారంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పందించారు. దీంట్లో నిజానిజాలు తేల్చడానికి అదానీ, అంబానీలపై ఈడీ ద్వారా విచారణ జరిపించాలని డిమాండు చేశారు. ఆదివారం ధూలేలో ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగిస్తూ.. "అంబానీ, అదానీలు సొమ్ము పంపినప్పుడు మోదీ నిద్ర పోతున్నారా" అని అడిగారు. ఏదో ఆరోపణలు చేసి పారిపోవడం కాదని, దమ్ముంటే దర్యాప్తు చేయించాలని సవాలు చేశారు. ఇంతవరకు వారిని రక్షిస్తూ వస్తున్న మోదీ ప్రస్తుతం వారిని ఎందుకు విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే పేదలు, దళితులు, గిరిజనులు మరోసారి బానిసలుగా మారుతారని ఖర్గే అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఖాళీగా ఉన్న 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడ రిజర్వేషన్లను అమలు చేయాల్సి వస్తుందోనన్న ఉద్దేశంతోనే మోదీ ఆ పోస్టులను భర్తీ చేయడం లేదని చెప్పారు.

నలుగురైదుగురి చేతుల్లోనే దేశ సంపద

రాయ్‌బరేలీ, మే 12: దేశ యావత్ సంపదను ప్రధాని మోదీ నలుగురైదుగురు ధనవంతుల చేతుల్లోనే పెట్టారని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆరోపించారు. ఆదివారం ఆమె రాయ్‌బరేలీలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ప్రైవేటీకరణ పేరుతో బొగ్గు గనులు, విద్యుత్ సంస్థలు, పోర్టులు, విమానాశ్రయాలను మోదీ తన నలుగురైదుగురు ధనవంతులైన స్నేహితులకు పంచిపెట్టారని ఆరోపించారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పల్లెటూర్లకు వెళ్లి అక్కడి ప్రజలతో మాట్లాడి.. వారి సమస్యలేంటో తెలుసుకుని పరిష్కరించేవారని చెప్పారు. మోదీ ఏనాడైనా పల్లెటూర్లను సందర్శించి ఒక్క రైతునైనా కలిశారా అని ఆమె ప్రశ్నించారు.

వైసీపీ 'ఫేక్' ప్రచారం

» చంద్రబాబుపై డీప్ ఫేక్ వీడియో

» పోలింగ్ ముందు దిగజారుడు రాజకీయం

» టీడీపీ అధినేత వీడియో మార్ఫింగ్

» కట్, పేస్ట్‌లతో అసత్య ప్రచారం

» వీడియో తనది కాదని బాబు ఖండన

» ఎక్స్‌లో ఒరిజనల్ వీడియో పోస్టు

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియాలో తమకు గిట్టనివారిపై బురదజల్లడం, అబద్ధాలు ప్రచారం చేయడం అలవాటుగా మారింది. ఇప్పుడు ఎన్నికల సమరం చివరి క్షణంలో వైసీపీ ప్రచార బృందాలు మరో అడుగు ముందుకేసి డీప్ ఫేక్ డ్రామాలు ఆడుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు గొంతును మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. దీంతో స్వయంగా చంద్రబాబు రంగంలోకి దిగి ఖండించాల్సి వచ్చింది. పోలింగ్ మొదలు కావడానికి సరిగ్గా ఇరవై నాలుగు గంటల ముందు వైసీపీ శిబిరం నుంచి చంద్రబాబు వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఆయన ఒక టీవీ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలను తొలగించి, వైసీపీకి అనుకూలంగా మాటలను జత చేసి దానిని వదిలారు. తాము ఇచ్చిన హామీలు, ప్రకటించిన హామీలు అమలు అసాధ్యమని, అవన్నీ ఎక్కడ చేస్తామని అన్నట్లు ఈ వీడియోలో ఉంది. వీడియోలో ఎదురుగా చంద్రబాబు కనిపిస్తూ మాట్లాడటంతో ఆయనే ఈ మాటలు చెప్పారని విన్నవారు అనుకొంటారు. అయితే డీప్ ఫేక్ టెక్నాలజీతో నిజంగానే చంద్రబాబు మాట్లాడినట్లుగా భ్రమ కల్పించేలా మార్ఫింగ్ చేసిన వీడియో రూపొందించారు. వైసీపీ అనుకూల 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే సామాజిక మాధ్యమ ఖాతాలో ఈ మార్ఫింగ్ వీడియోను మొదట పోస్టు చేశారు. తర్వాత వైసీపీ శ్రేణులు తమకు తెలిసిన వారికి విస్తృతంగా షేర్ చేశారు. ఆదివారం సాయంత్రానికి ఈ ఖాతాలో ఈ వీడియోను సుమారుగా డెబ్బై వేల మంది చూశారు. చూసిన వాళ్లు ఇంకా ఎంత మందికి పంపారో తెలియదు. ఈ విషయం చంద్రబాబు దృష్టికి రావడంతో దానిని ఖండిస్తూ ఎక్స్(ట్విటర్)లో ఒక పోస్టు చేశారు. ఈ ఫేక్ వీడియోను నమ్మవద్దని కోరారు. 'కొన్ని గంటల్లో పోలింగ్ మొదలు కాబోతోంది. ఈ కొన్ని గంటలైనా నిజాయితీగా ఉండాలన్న ఇంగిత జ్ఞానం జగన్‌కు లేదు. ఉంటే ఇలా కులమతాలను రెచ్చగొట్టే ఫేక్ వీడియోలను చేయించడు. వైసీపీ వాళ్లు తిప్పుతున్న ఫేక్ వీడియోకు నేను మాట్లాడిన ఈ అసలు వీడియో ఆధారం. దీన్నే వాళ్లు ఫేక్ చేశారు. పోలింగ్ పూర్తయ్యే వరకూ ఇలాంటి ఫేక్ వీడియోలు కుప్పతెప్పలుగా జగన్ చేయిస్తాడు. వీటిని నమ్మవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నాను' అని చంద్రబాబు కోరారు. తాను మాట్లాడిన అసలు వీడియోను ఆయన దీనికి జత చేశారు. ఇంతకుముందు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గొంతును ఇలాంటి టెక్నాలజీతోనే మార్చి ఒక ఆడియో విడుదల చేశారు. ఆమె దళితులను తిట్టారంటూ ఆ ఆడియోను వైసీపీ అనుకూల సామాజిక మాధ్యమాల్లో తిప్పారు. వినేవారికి అచ్చం ఆమె మాట్లాడినట్లుగానే మార్ఫింగ్ చేశారు. దీనిని టీడీపీ వెంటనే ఖండించింది. ఇటువంటి ఆడియోలను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. ఇదే సమయంలో టీడీపీ తరఫున క్రియాశీలంగా పనిచేస్తున్న మహిళలపై కొన్ని మార్ఫింగ్ వీడియోలు తయారు చేసి వైసీపీ సామాజిక మాధ్యమాల్లో తిప్పారు. అసభ్యకరంగా మార్ఫింగ్ చేసిన ఈ వీడియోలపై బాధిత మహిళలు నేరుగా ఎన్నికల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

వైసీపీ దిగజారుడుతనం

డీప్ ఫేక్ టెక్నాలజీతో ఎవరి గొంతునైనా అనుకరించి అచ్చం ఆ వ్యక్తే మాట్లాడినట్లుగా భ్రమ కల్పించడం తేలికగా మారింది. ఎన్నికల సమయంలో వైసీపీ ప్రచార బృందాలు ఈ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాయి. ఏకంగా ప్రధాన ప్రతిపక్ష నేతపైనే గురి పెట్టాయని టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. 'ఎవరైనా కింది స్థాయిలో ఉన్న సానుభూతిపరులు, కార్యకర్తలు ఆవేశంతో ఏవో తప్పుడు వీడియోలు చేసి పెడతారు. కానీ ఒక పార్టీ ప్రత్యేక విభాగాన్ని పెట్టి వీడియోలు, ఆడియోలు తయారు చేయించడం ఇప్పుడే చూస్తున్నాం' అని టీడీపీ నేత ఒకరు అన్నారు.

రాహుల్ వయస్సంత సీట్లైనా రావు

పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌ను ఉద్దేశించి మోదీ



న్యూఢిల్లీ, మే 12: ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గతంలో ఎన్నడూ రానంత తక్కువ సీట్లు వస్తాయని ప్రధాని మోదీ అన్నారు. ఆయన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వయస్సును గుర్తు చేస్తూ.. "రాహుల్‌కు యాభై ఏళ్లు దాటాయి. కానీ, కాంగ్రెస్ పార్టీకి అన్ని సీట్లు కూడా రావు" అని వ్యాఖ్యానించారు. అవినీతి అనేది ఇండియా కూటమిలోని ఉమ్మడి తత్వం అని, అదే ఆ పార్టీలను కలిపిందని మోదీ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ప్రభుత్వం అవినీతిని పూర్తిస్థాయి బిజినెస్‌గా మార్చిందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌ను ఆ పార్టీ 'కుటీర బాంబుల పరిశ్రమ'గా మార్చివేసిందని మండిపడ్డారు. "ప్రతి ఇంటికి మంచి నీళ్లు అని మేం అంటుంటే.. ప్రతి ఇంటిలో బాంబు అని వాళ్లు మాట్లాడుతున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆదివారం బెంగాల్‌లోని హౌరా, బారక్‌పూర్, హుగ్లీలో ఎన్నికల ర్యాలీల్లో పాల్గొని ప్రసంగించారు. అక్రమ వలసదారుల సంక్షేమమే టీఎంసీ ఎజెండా అని, సీఎం మమతా బెనర్జీ బెంగాల్ రాష్ట్ర ప్రజలను పట్టించుకోవడం ఎప్పుడో మానేశారని ఆరోపించారు. ఇక్కడ హిందువులు రెండో తరగతి పౌరులుగా మారిపోయారని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హిందువులు రామనామం పలకడాన్ని, రామనవమి పండుగను చేసుకోవడాన్ని కూడా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇటీవల ఓ టీఎంసీ ఎమ్మెల్యే హిందువులను భాగీరథి నదిలో పడేస్తాం అన్నారు. వాళ్లకు అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది?" అని ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు టీఎంసీ లొంగిపోయిందన్నారు. తాను బతికి ఉండగా సీఏఏను ఎవరూ రద్దు చేయలేరని మోదీ అన్నారు. సీఏఏ అనేది పౌరసత్వం ఇవ్వడానికే తప్ప, లాక్కోవడానికి కాదన్నారు.

సందేశ్‌ఖాలీలో టీఎంసీ కొత్త నాటకం

సందేశ్‌ఖాలీలో టీఎంసీ కొత్త నాటకానికి తెరతీసిందని మోదీ ఆరోపించారు. సందేశ్‌ఖాలీ స్థానిక బీజేపీ నేత అక్కడి మహిళల నుంచి ఖాళీ కాగితాలపై సంతకాలు తీసుకొని, ఆ తర్వాత వాటిపై టీఎంసీ నేతలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు రాసి పోలీసులకు ఇస్తున్నట్లు తాజాగా వీడియోలు వైరల్ అయ్యాయి. వీటితో పాటు సందేశ్‌ఖాలీలో ఆందోళనలు చేయాలంటూ మహిళలకు బీజేపీనే రూ.2వేల చొప్పున పంచిందని, స్థానిక బీజేపీ నేతనే ఈ విషయాన్ని చెప్పినట్లు మరికొన్ని వీడియోలు వైరల్ అయ్యాయి. వీటిని ఉద్దేశించి మోదీ ఆ వ్యాఖ్యలు చేశారు. సందేశ్‌ఖాలీ మహిళలను టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారన్నారు. "సందేశ్‌ఖాలీలోని తల్లులకు, చెల్లెళ్లకు టీఎంసీ ఏం చేసిందో మనందరం చూశాం. కేవలం నిందితుని పేరు షాజహాన్ షేక్ అని పేరు ఉన్నందుకే ఇదంతా జరుగుతోంది. కానీ, టీఎంసీకి భయపడకండి. దోషులెవరినీ వదలబోం" అని మోదీ అన్నారు.

మంచి పాలన అందించాం

ఈ పదేళ్లలో మంచి పాలనను అందించడం వల్లనే ఎన్నికల ముందు బీజేపీ ఎటువంటి జనాకర్షక విధానాలను ప్రకటించలేదని మోదీ చెప్పారు. పదేళ్ల పాలనలో నిజమైన అభివృద్ధిని ఈ ప్రపంచానికి చూపించామన్నారు. ఆదివారం ఓ జాతీయ వార్తా సంస్థకు మోదీ ఇంటర్వ్యూ ఇచ్చారు. తన అడ్డును రాజకీయంగా తొలగించుకోవడానికే ఇన్నాళ్లుగా విపక్షాలు ప్రయత్నిస్తూ వచ్చాయని ఈ సందర్భంగా విమర్శించారు. పేదలను కేంద్రంగా చేసుకుని తాము నిర్వహించిన కార్యక్రమాల వల్ల గత పదేళ్లలో 25 కోట్లమంది దారిద్ర్యరేఖ నుంచి బయటపడ్డారని వివరించారు. కేవలం ఐదేళ్ల కాలాన్ని దృష్టిలో ఉంచుకుని బీజేపీ ఈ ఎన్నికల్లో పోటీచేయడం లేదని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలపడం లక్ష్యంగానే తలపడుతోందని తెలిపారు.

డబ్బులివ్వాల్సిందే..!

ఓటర్ల నుంచి వైసీపీకి వింత నిరసనలు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

ప్రలోభాల పర్వంలో కొత్త పోకడ తెరపైకి వచ్చింది. ఎన్నికల ప్రచారం ముగిసిన శనివారం సాయంత్రం నుంచే ఓటర్లను రాజకీయ పార్టీలు పెద్దఎత్తున ప్రలోభాలకు గురిచేస్తున్నాయి. మరోవైపు నోటు కోసం ఓటర్ల నుంచి వింత నిరసనలు హోరెత్తుతున్నాయి. 'డబ్బులివ్వాల్సిందే'నంటూ అధికార పార్టీ నేతలు, అభ్యర్థులకు చుక్కలు చూపించారు. డబ్బులు నొక్కేశారంటూ ఆ పార్టీ నాయకుల ఇళ్లు, కార్యాలయాలను ముట్టడించారు. ఆదివారం ఉదయం వరకూ వేచిచూసినా సొమ్ములు ఇవ్వకపోవడంతో పిఠాపురంలో ఓటర్లు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కార్యాలయాన్ని ముట్టడించారు. వైసీపీ నేతలు సొమ్ము స్వాహా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల ఆందోళనలతో వైసీపీ నేతలు ఒక్కొక్కరూ జారుకుని తమ ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. పలుచోట్ల వైసీపీ నేతలు పంపిణీ చేసిన గోవా మద్యం తీసుకునేందుకు ఓటర్లు నిరాకరించారు. తమకు నాణ్యమైన మద్యాన్నే ఇవ్వాలని డిమాండ్ చేయడం గమనార్హం.

మూడు వేలు పలికిన 'తూర్పు'

తూర్పుగోదావరి జిల్లాలో ఓటుకు గరిష్ఠంగా రూ.3వేల వరకూ రేటుకట్టారు. రాజమహేంద్రవరంసిటీలో 3వేలు, రూరల్, కొవ్వూరులో రూ.2వేల చొప్పున పంపిణీ చేశారు. మరోచోట ఓ అభ్యర్థి కొందరికి చీట్లపై డబ్బులు రాసిచ్చారు. గెలిచాక వచ్చి వసూలు చేసుకోవాలని సెలవిచ్చారు. నోట్లు అందని కొందరు ఓటర్లు వైసీపీ అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి నిలదీశారు. వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ రామ్ కార్యాలయాన్ని సుమారు 400 మంది మహిళలు చుట్టుముట్టారు.

ఓటర్లతో వైసీపీ ప్రమాణాలు

తిరుపతి టౌన్ బ్యాంకు ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆదివారం కొర్లగుంటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆటో డ్రైవర్లకు డబ్బు పంపిణీ చేశారు. స్వామివారి సాక్షిగా వైసీపీకే ఓటు వేస్తామని వారితో ప్రమాణం చేయించారు. దీనిపై తిరుపతి అసెంబ్లీ జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఓటుకు రూ.1,500 నుంచి రూ.2వేలు వంతున పంచారు. కొత్తపేట అసెంబ్లీ పరిధిలోని నాలుగు మండలాల్లో వైసీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అనుచరులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అయితే అవి నాసిరకంగా ఉన్నాయంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు మహిళలు తమకు ఇచ్చిన చీరలను వైసీపీ నాయకుల ఇళ్ల ముందు విసిరేసిపోయారు.



కాకినాడ జిల్లా పిఠాపురంలోని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కార్యాలయంవద్ద ఆందోళన చేస్తున్న ఓటర్లు



మంగళగిరిలో ఎమ్మెల్సీ హనుమంతరావు నివాసం ఎదుట రాత్రి పది గంటలకు ఆందోళన చేస్తున్న వైసీపీ కార్యకర్తలు

మా ఓటుకు డబ్బు ఎందుకివ్వరు?

'మాకు ఓట్లు లేవా... మాకు డబ్బులు ఎందుకు ఇవ్వరూ..' అంటూ కర్నూలు జిల్లా మద్దికెరలో కొందరు ఓటర్లు రాజకీయ పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు ఎందుకు ఇవ్వరంటూ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. కాగా, డబ్బుల కోసం వైసీపీ విశాఖ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. తమకు కూపన్లు ఇచ్చారని, డబ్బులు అందలేదంటూ వందలాది మంది లాసన్స్‌బే కాలనీలోని ఎంవీవీ కార్యాలయానికి తరలివచ్చారు. ఓటుకు నోటు కోసం పలువురు ఆదివారం గాజువాక వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు ఇంటికి వెళ్లారు. వెళ్లారు. ఇక గుంటూరు జిల్లా మంగళగిరిలో వైసీపీ రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు పంపిణీ చేసింది. దీంతో ఓటర్లు కూడా వెర్రెత్తిపోయారు. ఇరు పార్టీల నాయకులు అక్కడక్కడా కొన్ని వీధులతోపాటు ఇళ్లను దాటవేసి వెళ్లడంతో ఆ ప్రాంత ఓటర్లు ఆగ్రహంతో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల నివాసాల వద్దకు భారీగా చేరుకుని డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ ఆందోళనకు దిగారు. స్లిప్పులను పరిశీలించి డబ్బు పంపిణీ చేయడంతో వెనుదిరిగారు. కాగా, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో వైసీపీ అభ్యర్థి, మంత్రి ఉష శ్రీచరణ్ తన ఫొటోతో ఉన్న కూపన్‌లను పంపిణీ చేశారు. కూపన్ ఉన్నవారికి 1500 ఇస్తామని నమ్మించారు. కానీ డబ్బులు ఇవ్వకపోవడంతో పలువురు ముస్లింలు మంత్రి ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. ఎలా గెలుస్తారో చూస్తామంటూ శాపనార్థాలు పెట్టారు. హిందూపురంలో డబ్బుల కోసం ఓటర్లు వైసీపీ కార్యాలయాన్ని ఆదివారం రాత్రి ముట్టడించారు.

బూత్ ఏజెంట్లను పెట్టబోం

పిఠాపురంలో వైసీపీ నేతల తిరుగుబాటు

పిఠాపురంలో వైసీపీ అధిష్ఠానానికి ఆ పార్టీ నేతలే ఝలక్ ఇచ్చారు. బూత్ ఏజెంట్లను పెట్టేది లేదంటూ తిరుగుబాటు స్వరం వినిపించారు. ఓటర్లకు డబ్బులు పంచకుండా తమను పలచన చేశారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తేల్చేశారు. దీంతో కూటమి అభ్యర్థి పవన్‌కల్యాణ్ ఓటమి లక్ష్యంగా వైసీపీ అధిష్ఠానం దించిన చిత్తూరు, కడప జిల్లా నేతలు తలలు పట్టుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో వైసీపీ ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. వారి సూచనల మేరకు పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు పట్టణానికి చెందిన నేతలతో సమావేశమై చర్చలు జరుపుతున్నారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ABN ఆంధ్రజ్యోతి

ABN ఆంధ్రజ్యోతి

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేడు భిన్న వాతావరణ పరిస్థితులు!

కొన్ని చోట్ల వడగాడ్పులు.. మరికొన్ని చోట్ల పిడుగులు?

అమరావతి, విశాఖపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): దక్షిణ కర్ణాటక పరిసరాల్లో ఆవర్తనం ఆవరించింది. దాని నుంచి మధ్యప్రదేశ్ వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో ఆదివారం పలుచోట్ల ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురిశాయి. రాష్ట్రంలో రానున్న మూడు రోజులు భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని, కొన్ని ప్రాంతాల్లో ఎండ, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం ఓటు హక్కు వినియోగించుకునే ప్రజలు స్థానిక వాతావరణాన్ని బట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు. సోమవారం శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు జిల్లాల్లోనూ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందన్నారు. విజయనగరం, మన్యం జిల్లాల్లో ఎండతీవ్రత ఎక్కువగా ఉండి, వడగాడ్పులు వీస్తాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నటి పవిత్ర దుర్మరణం

త్రినయని, నిన్నే పెళ్లాడతా వంటి సీరియళ్లతో గుర్తింపు



భూత్పూర్, మే 12: మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ తెలుగు, కన్నడ నటి పవిత్ర జయరామ్ (42) మరణించారు. ఆమె ప్రయాణిస్తున్న కారు వేగంగా డివైడర్‌ను ఢీకొట్టి.. దాని పైనుంచి అవతలివైపు రోడ్డు మీ దకు దూసుకెళ్లింది. ఆ లేన్‌లో వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి నుజ్జయింది. పవిత్రది కర్ణాటక రాష్ట్రం మాండ్య జిల్లా ఉమ్మదహళ్లి గ్రామం. ఆమెతో పాటు పినతల్లి కుమార్తె అపేక్ష, మరో నటుడు చంద్రకాంత్ (చందు), డ్రైవర్ శ్రీకాంత్‌తో కలిసి శనివారం సాయంత్రం కారు (స్కార్పియో)లో బెంగళూరు నుంచి హైదరాబాదుకు బయలుదేరారు. కారు భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని శేరిపల్లి (బీ) వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై అదుపు తప్పి డివైడర్‌ని బలంగా ఢీకొట్టింది. దాని మీదుగా రోడ్డు అవతలివైపు పడి హైదరాబాద్ నుంచి వనపర్తి వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో పవిత్ర అక్కడికక్కడే మృతిచెందారు. చంద్రకాంత్, అపేక్ష, శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పవిత్ర 'త్రినయని' తెలుగు సీరియల్‌లో తిలోత్తమ అనే నెగటివ్ రోల్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు. నిన్నే పెళ్లాడతా, స్వర్ణ ప్యాలెస్, కోడళ్లు మీకు జోహార్లు సీరియళ్లలో ప్రతినాయిక పాత్రలతో మెప్పించారు. 'జోకలి' అనే కన్నడ సీరియల్‌తో నట జీవితం ప్రారంభించారు. ఆ తర్వాత 'రోబో ఫ్యామిలీ', 'గాలి పటా', 'రాధారమణి', 'విద్యా వినాయక' తదితర కన్నడ సీరియళ్లలో మంచి పేరు తెచ్చుకున్నారు. చిన్నతనంలోనే పెళ్లి చేసుకున్న ఆమె ప్రస్తుతం భర్తకు దూరంగా ఉంటున్నారు. ఆమెకు కుమారుడు ప్రజ్వల్, కుమార్తె ఉన్నారు. కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

ఫోన్ మాట్లాడుతోందని...కుమార్తెపై కత్తితో దాడి

చికిత్స పొందుతూ యువతి మృతి

ఐ.పోలవరం, మే 12: తరచూ ఫోన్ మాట్లాడుతోందన్న ఆగ్రహంతో కన్న కూతురి పైనే ఓ తండ్రి కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం పాతఇంజరం గ్రామానికి చెందిన మాదాసు శివసుబ్రహ్మణ్యం కుమార్తె రాణి (27) వేరొకరితో ఫోన్‌లో తరుచూ మాట్లాడుతుండేది. ఈ విషయంలో కూతురు తీరుపై ఆగ్రహంతో ఉన్న శివసుబ్రహ్మణ్యం ఆదివారం ఉదయం కత్తితో ఆమెపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను స్థానికులు యానాం ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాణి మృతిచెందింది. సీఐ సలీం ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు మహిళలను మింగేసిన ఊబి

వాడపల్లి వెంకన్న దర్శనానికి వెళుతుండగా ఘటన

ఆత్రేయపురం, మే 12: గౌతమి గోదావరి నదిలో కాలి నడకన వాడపల్లి వెళుతున్న ముగ్గురు మహిళలు ప్రమాదవశాత్తూ ఊబిలో కూరుకుపోయి మృత్యువాత పడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంక, మడికి, చిలకపాడుకు చెందిన పాలూరి సత్య అనంతలక్ష్మి (40), కొప్పిరెడ్డి ఏసమ్మ (60), కర్రి సునీత (16) శనివారం వేకువజాము 5.30 గంటలకు కాలినడకన గోదావరి పాయలో వాడపల్లి బయల్దేరారు. మార్గమధ్యలో వాడపల్లి శెట్టిబలిజపాలెం రేవులోని ఊబిలో కూరుకుపోయారు. అక్కడ రక్షించేందుకు ఎవరూ లేకపోవడంతో వారు బయటకు రాలేకపోయారు. గుడికి వెళ్లిన వారు ఎంతకీ రాకపోవడంతో కుటుంబసభ్యులు గోదావరి మార్గంలో గాలిస్తుండగా ఆదివారం ఉదయం ఒకరి మృతదేహం లభ్యమైంది. మిగిలిన వారి కోసం గాలించగా వారి మృతదేహాలూ అక్కడే లభ్యమయ్యాయి.

ఎన్నికల విధులకు వెళుతూ ఇద్దరు మృతి

పట్టాలు దాటుతున్న తల్లీకొడుకును ఢీ కొన్న రైలు



సుభాషిణి, విజయ్‌కుమార్

కావలి రూరల్, మే 12: ఎన్నికల విధుల కోసం ఊరుగాని ఊరొచ్చిన తల్లీకొడుకును రైలు రూపంలో వచ్చిన మృత్యువు పొట్టనపెట్టుకుంది. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఉదయం పట్టాలు దాటుతున్న తల్లీకొడుకును రైలు వేగంగా ఢీకొనడంతో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. సైదాపురం మండలం చాగణం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సుభాషిణి (58)కి కావలిలో ఎన్నికల విధులు కేటాయించారు. వయోభారంతోపాటు అనారోగ్యం కారణంగా తోడు కోసం ఆమె కుమారుడు వలంటీరుగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ (26)ను వెంటబెట్టుకుని వచ్చింది. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు నుంచి కావలి చేరుకున్నారు. మూడో నంబర్ ప్లాట్‌ఫారం నుంచి రెండో ప్లాట్‌ఫారానికి వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా హౌరా నుంచి బెంగళూరు వెళుతున్న దురంతో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తల్లీకొడుకును ఢీకొనగా... వారి శరీర భాగాలు ఎగిరి పట్టాలపై చెల్లాచెదురుగా పడ్డాయి.

కేంద్ర బలగాలతో భద్రత కల్పించాలి: బీజేపీ

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో బీజేపీ పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో కేంద్ర సాయుధ బలగాలతో మరింత పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని ఆ పార్టీ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు. ఆదివారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్ మీనాను బీజేపీ అధికార ప్రతినిధి యామినీ శర్మ, బీజేపీ పబ్లిక్ మీటింగ్ ఇన్‌చార్జి కిలారు దిలీప్ కలిశారు. బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తున్న చోట కేంద్ర బలగాలతో భద్రత కల్పించాలన్న హైకోర్టు ఉత్తర్వులను సీఈవోకు అందజేశారు. కోర్టు ఉత్తర్వులను డీజీపీకి కూడా అందజేశారు.

డాక్టర్ సునీతకు 'ఐడీఎస్ఏ ఫెలోషిప్'

అభినందనలు తెలిపిన 'అపోలో' జేఎండీ సంగీతారెడ్డి



హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రి డాక్టర్ సునీత నర్రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. అంటు వ్యాధులను ఎదుర్కోవడంలో అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఆమెకు ప్రతిష్ఠాత్మకమైన 'ఇన్ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ ఆఫ్ అమెరికా (ఐడీఎస్ఏ) ఫెలోషిప్' లభించింది. డాక్టర్ సునీత అంకితభావం, నాయకత్వం, నైపుణ్యం, రోగుల సంరక్షణ ఐడీఎస్ఏకు ఎంతగానో దోహదపడతాయని సంస్థ అధ్యక్షుడు స్టీఫెన్ కె.స్మిత్ అన్నారు. వ్యాధుల రంగంలో డాక్టర్ సునీత చేసిన కృషికి గాను ఈ ఫెలోషిప్ దక్కిందని తెలిపారు. ఐడీఎస్ఏ ఫెలోషిప్ దక్కినందుకు ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు సునీత చెప్పారు. ఐడీఎస్ఏ ఫెలోషిప్ పొందినందుకు డాక్టర్ సునీతను అభినందిస్తున్నామని అపోలో ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. అంటు వ్యాధుల రంగంలో ఆమె అలుపెరగని కృషి, ఆరోగ్య సంరక్షణలో నిబద్ధత అపోలో ఆస్పత్రికి గర్వకారణమని ఓ ప్రకటనలో తెలిపారు.

సాక్ష్యాలన్నీ చెరిపేద్దాం!

మాయమవుతున్న మద్యం విక్రయాల డేటా

- ప్రభుత్వం మారితే అక్రమాలన్నీ వెలుగులోకి
- ముందే సర్దుకుంటున్న బేవరేజెస్ అధికారులు
- ఏకంగా కంప్యూటర్లలో హార్డ్‌డిస్క్‌లే మాయం
- ఇబ్బందనుకున్న సమాచారమంతా అపహరణ
- మద్యం కంపెనీల నుంచి అదనపు ధరకు కొనుగోళ్లు, బ్రాండ్ల వారీ అమ్మకాలు, నగదు అంశాలన్నీ గాయబ్
- తాజాగా జీపీఎస్ కోసం రూ.3.5కోట్లు వసూలు
- తిరిగి ఇస్తామని కిక్కురుమనని అధికారులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అధికార పార్టీ ఓటమి పాలవుతుందన్న ప్రచారం జోరందుకున్న నేపథ్యంలో మద్యం అమ్మకాల సమాచారంపై అధికారులు దృష్టి పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరుక్షణమే మద్యం ఉత్పత్తి, సరఫరా, అమ్మకాలపై విచారణ చేపట్టే అవకాశం ఉంది. దీనిపై టీడీపీ నేతలు ఇప్పటికే ప్రకటనలు కూడా చేశారు. మరోవైపు కొద్దికాలంగా వైసీపీ ప్రభుత్వం మారిపోతుందనే ప్రచారం ఊపందుకుంది. దీంతో బేవరేజెస్ కార్పొరేషన్‌లోని కొందరు అధికారులు, రిటైర్డ్ అధికారులు అప్రమత్తమై... అక్రమాల డేటాను లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా కొన్ని కంప్యూటర్ల హార్డ్‌డిస్క్‌లను ఆఫీసు నుంచి తీసుకెళ్లిపోతున్నట్లు ఎక్సైజ్ శాఖలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కొత్తగా వచ్చిన కార్పొరేషన్ ఎండీ కంటపడకుండా డేటా అపహరణకు గురవుతున్నట్లు తెలుస్తోంది. సాధారణ సమాచారాన్ని అలాగే ఉంచి అక్రమాలు జరిగినవి, అనుమానం కలిగించే సమాచారాన్ని మాత్రం మాయం చేస్తున్నారు. ఇందులో మద్యం కంపెనీల నుంచి అదనపు ధరలకు కొనుగోళ్లు, బ్రాండ్ల వారీగా అమ్మకాలు, నగదు సంబంధిత అంశాలు ఉన్నాయి.

అంత భయం ఎందుకంటే...

ప్రభుత్వం మారితే మొట్టమొదట విచారణను ఎదుర్కొనేది ఎక్సైజ్ శాఖే. ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతో గత నాలుగున్నరేళ్లలో అనేక అక్రమాలు జరిగాయి. కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టడం, వాటినే బలవంతంగా షాపుల్లో అమ్మేలా చేయడం, పాపులర్ బ్రాండ్లను తెరమరుగు చేయడం, కంపెనీల నుంచి వసూళ్లు లాంటి అనేక అక్రమాలకు బేవరేజెస్ కార్పొరేషన్ వేదికైంది. దాదాపు రూ.1.25 లక్షల కోట్ల మేర జరిగిన మద్యం వ్యాపారంలో రూ.వేలాది కోట్ల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. కమీషన్లు ఇవ్వని కంపెనీల మద్యాన్ని గోడౌన్లకే పరిమితం చేసిన ప్రభుత్వం వారిని ముప్పతిప్పలు పెట్టింది. ఈ వ్యవహారాలన్నీ వెలుగులోకి వస్తే అందరూ ఇరుక్కుంటారనే భయం అధికారవర్గాల్లో ఉంది. ఆదేశాలు తాడేపల్లి ప్యాలెస్ నుంచే వచ్చినా.. వాటిని అమలు చేసింది మాత్రం కార్పొరేషన్ అధికారులే కావడంతో మొదట వారే ఇందులో ఇరుక్కునే ప్రమాదం ఉంది. దీంతో సమాచారం విషయంలో పైస్థాయితో సంబంధం లేకుండా కొందరు అధికారులు అప్రమత్తమవుతున్నారు.

కంపెనీలకూ అరకొర లెక్కలే

డిస్టిలరీలో తయారైన మద్యం తొలుత ప్రభుత్వ మద్యం డిపోకు వెళ్తుంది. అక్కడినుంచి షాపులు, బార్లకు చేరుతుంది. డిస్టిలరీ నుంచి ఎంత తీసుకెళ్లారనే వివరాలు సక్రమంగానే అందినా, డిపోల నుంచి షాపులు, బార్లకు ఎంత పంపుతున్నారనే వివరాలు కంపెనీలకు అందడం లేదు. ఎక్కువకాలం నిల్వలు ఉన్నాయనే కారణంతో కంపెనీలకు తరచూ జరిమానాలు విధిస్తున్న కార్పొరేషన్, ఏ షాపులో ఎంత స్టాకు ఉందనే వివరాలను మాత్రం కంపెనీలకు ఇవ్వట్లేదు. అప్పుడప్పుడూ స్కానర్లు పనిచేయకపోవడంతో ఆ సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు కావట్లేదు. అసలు అవి అప్‌డేట్ చేస్తున్నారా అనేదానిపై అనుమానాలున్నాయి. ఇక తాజాగా మద్యం తీసుకెళ్లే వాహనాలకు జీపీఎస్ సాంకేతికత ఏర్పాటు చేయాలంటూ కంపెనీల నుంచి కార్పొరేషన్ అధికారులు రూ.3.46కోట్లు వసూలు చేశారు. ఈ నగదు తర్వాత తిరిగి ఇస్తామన్న అధికారులు... ఎండీ బదిలీ తర్వాత దానిపై మాట్లాడట్లేదు. కొత్త ఎండీ ఎదుట దీనిపై చర్చ జరగ్గా... నగదు వసూలు చేసిన అధికారులు కిక్కురుమనలేదు. అంతకుముందు కేసుల అట్టపెట్టెల టెండర్లలోనూ అవినీతి జరిగినట్లు ఆరోపణలొచ్చాయి. ఈ సమాచారమంతా దొరక్కుండా చేసే ప్రయత్నంలో భాగంగా ఇప్పుడు హార్డ్‌డిస్క్‌లు మాయం చేసే ప్రయత్నాల్లో ఉన్నారు.

కమీషన్ల కోసమే ధరల పెంపు

కార్పొరేషన్‌కు కంపెనీలు మద్యాన్ని సరఫరా చేస్తాయి. ఎంత ధరకు సరఫరా చేయాలో ఎక్సైజ్‌లోని కమిటీ నిర్ణయిస్తుంది. కంపెనీలతో చర్చించి రేట్లు సవరిస్తుంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అదే ఏడాది అక్టోబరు నుంచి ప్రభుత్వ మద్యం షాపులు వచ్చాయి. ఆ వెంటనే మద్యం కంపెనీలకు ఇచ్చే ధరలు అమాంతం పెరిగాయి. ఎందుకంటే తొలుత ప్రతి కేసుకు రూ.200 నుంచి రూ.250 కమీషన్‌గా ఇవ్వాలని ప్రభుత్వ పెద్దలు డిమాండ్ చేశారు. ఒక ప్రణాళిక ప్రకారం ప్రభుత్వం మద్యం కంపెనీలకు ఇచ్చే ధరలను అధికారికంగానే పెంచేసింది. ఉదాహరణకు 8పీఎం అనే బ్రాండ్ కేసుకు తెలంగాణ రూ.1,550 చెల్లిస్తుండే, ఏపీ ప్రభుత్వం రూ.1,730 చెల్లిస్తోంది. ఓఏబీ అనే బ్రాండ్ కేసు తెలంగాణ రూ.689 ఇస్తుంటే, ఏపీ రూ.777 ఇస్తోంది. ఇలా అన్ని బ్రాండ్లలోనూ తెలంగాణతో పోలిస్తే ఏపీ ప్రభుత్వం ఎక్కువ చెల్లిస్తోంది. అలా అదనంగా చెల్లించింది తిరిగి కమీషన్ల రూపంలో ప్రభుత్వ పెద్దలకు చేరుతోంది. ఇలా ఈ ఐదేళ్లలో దాదాపుగా రూ.5వేల కోట్లకు పైగా కేవలం కమీషన్ల రూపంలోనే దండుకున్నారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ నరేంద్ర, జస్టిస్ మన్మథరావు, జస్టిస్ వెంకటరమణ, జస్టిస్ ఇందిరేష్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేంద్ర, జస్టిస్ మన్మథరావు ఆదివారం ఉదయం బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పాల వెంకటరమణ, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈఎస్ ఇందిరేష్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

చిన వెంకన్న సేవలో జస్టిస్ శేషసాయి



జస్టిస్ ఏవీ శేషసాయికి మెమెంటో అందజేస్తున్న ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల, మే 12: ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన ఆయన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం పొందారు. ఆలయ ఏఈవో మెట్టపల్లి దుర్గారావు ఆయనకు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

మల్లన్న సేవలో జస్టిస్ టి.మల్లికార్జునరావు



జస్టిస్ టి.మల్లికార్జునరావుకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలం, మే 12: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జున రావు ఆదివారం దర్శించుకున్నారు. సతీ సమేతంగా ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించారు. భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జస్టిస్ మల్లికార్జునరావు దంపతులకు వేదపండితులు వేదాశీర్వచనం, అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

ఇసుక అక్రమాలు నిజమే

ఎన్జీటీ ఉత్తర్వులను ఉల్లంఘించి తవ్వకాలు

- తక్షణమే ఇసుక అక్రమ తవ్వకాలు ఆపాలి
- ప్రత్యేక బృందాలతో పరిశీలన చేయించాలి
- ఈ నెల 16లోగా నివేదిక ఇవ్వండి
- జగన్ సర్కారును ఆదేశించిన సుప్రీం ధర్మాసనం
- నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయండి
- కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖకు ఆదేశం
- తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో కేంద్ర బృందాల పరిశీలన
- ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ సంస్థలపై చర్యలుంటాయా?
- అస్మదీయ కంపెనీలని వెనకేసుకొస్తారా అని సందేహాలు

'మా దృష్టికి వచ్చిన ఫొటోలను పరిశీలిస్తే... ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఏపీలోని అనేక ప్రాంతాల్లో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ప్రాథమికంగా కనిపిస్తోంది. ఈ ఫొటోలు తీసిన సమయం, తేదీ స్పష్టంగా ఉన్నాయి. ఇంకా అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాలను తెలిపే అక్షాంశ, రేఖాంశాలు కూడా అందులో ఉన్నాయి.' - సుప్రీంకోర్టు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. తక్షణం ఇసుక అక్రమాలను నిలిపివేయించాలని, ఈ వ్యవహారంపై ఈ నెల 16లోగా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని జగన్ సర్కారును ఆదేశించింది. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఫొటోల్లో ఉన్న అక్రమ ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతాలను పరిశీలన చేయించాలని సూచించింది. ఇదే అంశంలో ఇంతకుముందు ఇచ్చిన ఆదేశంపై నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని, ఏపీకి ప్రత్యేకంగా అధికారుల బృందాన్ని పంపించి అక్రమ ఇసుక తవ్వకాలు నిలిపివేశారా, లేదా పరిశీలించాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖను ధర్మాసనం ఆదేశించింది. పర్యావరణాన్ని పణంగా పెట్టి, అన్ని నిబంధనలు ఉల్లంఘించి ఇసుక అక్రమ మైనింగ్ చేస్తున్నారన్న కారణంతో రాష్ట్రంలో 160కి పైగా బీ2 రీచ్‌ల పర్యావరణ, మైనింగ్ లైసెన్స్‌లను ఏడాదిన్నర క్రితమే ఎన్జీటీ రద్దుచేసింది. అయినా భారీ యంత్రాలను ఉపయోగించి, అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని తాజాగా సుప్రీంకోర్టు పరిశీలనలోనూ తేలింది. ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలపై 2022-23లోనే ఎన్జీటీ నిగ్గుతేల్చింది. అప్పట్లోనే ఇసుక రీచ్‌ల లైసెన్సులు రద్దు చేసింది. అక్రమ తవ్వకాలకు పాల్పడినందుకు జేపీ వెంచర్స్‌కు భారీ జరిమానా విధించింది. దీనిపై జేపీ వెంచర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఎన్జీటీ విధించిన పెనాల్టీపై స్టే ఇచ్చింది. శుక్రవారం సుప్రీంకోర్టులో ఈ కేసు మరోసారి విచారణకొచ్చింది. గతంలో ఇసుక తవ్వకాల కాంట్రాక్టు చేసిన జేపీ వెంచర్స్‌తో పాటు తాజాగా కాంట్రాక్టు నిర్వహిస్తున్న ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ సంస్థలు కూడా అక్రమ తవ్వకాలు చేస్తున్నాయంటూ ఫొటోలు, వీడియోలతో సహా పిటిషనర్లు నాగేంద్రకుమార్, ఇతరులు కీలక ఆధారాలు సమర్పించారు. బీ2 రీచ్‌లకు కొత్తగా పర్యావరణ, మైనింగ్ అనుమతులు లేకుండానే ఎనిమిది జిల్లాల పరిధిలో జీసీకేసీ, మరో 18 జిల్లాల్లో ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థలు ఇసుక తవ్వకాలు చేపడుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వీటిని పరిశీలించిన జస్టిస్ అభయ్ ఎస్. ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం... ఎన్జీటీ ఆదేశాలను ఉల్లంఘించి ఏపీలో అక్రమ మైనింగ్ జరుగుతోందని తేల్చిచెప్పింది. రాష్ట్రంలో పర్యావరణ విభాగం, కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ ప్రభావ అంచనా విభాగాలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్లు, మైనింగ్ అధికారులు ఇసుక తవ్వకాలపై ఇప్పటికే ఎన్జీటీకి, హైకోర్టుకు నివేదికలు ఇచ్చారు. అయినా కేంద్రం నుంచి ప్రత్యేకంగా అధికారులను పంపి, పరిశీలన చేయించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం ఒకరకంగా జగన్ సర్కారుకు చెంపపెట్టులాంటి తీర్పు అని నిపుణులు చెబుతున్నారు.

హైకోర్టుకు తప్పుడు నివేదికలు

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై హైకోర్టులోనూ విచారణ జరుగుతోంది. అక్రమ తవ్వకాలు, పర్యావరణ ఉల్లంఘనలపై జిల్లా కలెక్టర్లు, జిల్లా గనులశాఖ అధికారులను నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నివేదికలు గనులశాఖ ద్వారా హైకోర్టుకు వెళ్లాల్సి ఉంది. అయితే, ఇసుక తవ్వకాల్లో ఎలాంటి అక్రమాలు లేవని నివేదిక ఇవ్వాలంటూ ప్రభుత్వ పెద్దలు అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. దీంతో వారు కూడా సానుకూల నివేదికలు పంపారు.

జగన్ సర్కారుకు విషమ పరీక్ష

ఇసుక తవ్వకాల్లో అక్రమాలు లేవంటూ కలెక్టర్లు, గనుల శాఖ అధికారులు గతంలో నివేదికలు ఇచ్చారు. వాటిపై అనుమానంతో ఎన్జీటీ... కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ శాస్త్రవేత్తలు, నిపుణులను రాష్ట్రానికి పంపి ప్రత్యేకంగా అధ్యయనం చేయించింది. పర్యావరణాన్ని ఉల్లంఘిస్తూ 2టన్నుల బకెట్ ఉన్న జేసీలతో నదీగర్భాల్లో నుంచి ఇసుకను తోడేస్తున్నారని, 24 గంటలపాటు తవ్వకాలు జరుగుతున్నాయని కేంద్ర కమిటీ నివేదిక ఇచ్చింది. ఇదే నివేదిక హైకోర్టు పరిశీలనకు కూడా వెళ్లింది. ఇటీవల హైకోర్టు కూడా అధికారుల నివేదికలు కోరింది. ఏ తప్పూ జరగడం లేదని అటు కలెక్టర్లు, ఇటు గనులశాఖ అధికారులు నివేదికలు పంపారు. కానీ, ఇప్పుడు అక్రమ తవ్వకాల పరిశీలనకు ప్రత్యేక అధికారుల బృందాలను పంపించడంతో పాటు 16లోగా నివేదిక పంపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో ఇసుక తవ్వకాలపై ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అధికారుల బృందాలు వేర్వేరుగా నివేదికలు ఇవ్వనున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో పలుమార్లు అధ్యయనాలు చేసిన కేంద్ర బృందం కచ్చితంగా వాస్తవాలతో కూడిన నివేదికను ఇవ్వనుంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం ఏం నివేదిక ఇవ్వనుందన్నదే ఆసక్తికరంగా మారింది. ఒకవేళ అంతా సానుకూలమేనని నివేదిక ఇస్తే అధికార పెద్దలు అడ్డంగా దొరికిపోవడం, కోర్టు ఆగ్రహానికి గురికావడం ఖాయం. కాబట్టి, సుప్రీంకోర్టు ఆదేశం రాష్ట్ర ప్రభుత్వానికి విషమ పరీక్షేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కొమ్ముకాస్తారా... చర్యలుంటాయా?

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ పరిధిలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ సంస్థలపై జగన్ సర్కారు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆ రెండు కంపెనీలపై చర్యలు తీసుకుంటారా లేక అస్మదీయ కంపెనీలని వెనకేసుకొస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తే ధిక్కార చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. గతంలో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడిన జేపీ వెంచర్స్‌పై చర్యలు తీసుకోవాలన్నప్పుడు జగన్ సర్కారు పట్టించుకోలేదు. ఫలితంగా ఆ సంస్థ ఆధ్వర్యంలో దర్జాగా నదీ గర్భాలను తోడేశారు. ఇప్పుడు ఈ రెండు సంస్థల విషయంలో జగన్ సర్కారు వైఖరి ఏమిటో త్వరలోనే తేలనుంది.

బందోబస్తులో దిద్దుబాటు

- సమస్యాత్మక ప్రాంతాలకు అధిక బలగాలు
- గతంలో 'ఏకపక్షం'గా కేటాయింపు
- దాన్ని గుర్తించి, సరిదిద్దిన కొత్త డీజీపీ

అమరావతి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బందోబస్తు కోసం ఇప్పటికే ప్రాంతాల వారీగా కేటాయించిన పోలీసులను అటూ ఇటూ మార్చడం తీవ్ర కలకలం రేపింది. అధికార పక్షానికి పోలింగ్ సందర్భంగా కలిసివచ్చేలా చివరినిమిషంలో ఈ మార్పులు చేస్తున్నారా అనే అనుమానాలతో సర్వత్రా కలవరం బయలుదేరింది. అయితే, దీనిపై డీజీపీ హరీశ్ గుప్తా ఇచ్చిన వివరణతో ఎట్టకేలకు పరిస్థితి సద్దుమణిగింది. ప్రాంతాలవారీగా పోలీసుల కేటాయింపు గత డీజీపీ ఉండగా జరిగింది. అప్పట్లో సున్నిత, సమస్యాత్మక ప్రాంతాలకు తక్కువగానూ, మిగతా ప్రాంతాల్లో ఎక్కువగానూ పోలీసులను కేటాయించినట్లు డీజీపీ హరీశ్ గుప్తా గుర్తించారు. ఇలా ఎందుకు జరిగిందనేది ఆయన ఆరాతీశారు. అప్పటి 'ఏకపక్ష' పోలీసింగ్ వ్యవహారాలు ఆయన దృష్టికి వచ్చాయి. దీంతో ఆయన దిద్దుబాటు చర్యలను చేపట్టారు. గత 45 రోజులపాటు గొడవలు, ఘర్షణలు అతి తక్కువగా నమోదైన ప్రాంతాల్లో పోలీసులను తగ్గించారు. ఆ అదనపు బలగాలను సమస్యాత్మకంగా ఉన్న పల్నాడు, రాయలసీమ ప్రాంతాలకు తరలించి.. అక్కడి బందోబస్తును కట్టుదిట్టం చేశారు.


మైలవరంలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన..!

- గడువు ముగిసినా వైసీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం
- అధికార పార్టీకి కొమ్ముకాసిన పోలీసులు, అధికారులు
- ఫొటోలు తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' విలేకరికి బెదిరింపులు



మైలవరం యాదవుల బజారులో ప్రచారం చేస్తున్న వైసీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు

మైలవరం, మే 12: మైలవరం వైసీపీ అభ్యర్థి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. శనివారంతో సార్వత్రిక ఎన్నికల ప్రచారం గడువు ముగిసినా.. 144 సెక్షన్ అమల్లో ఉన్నా.. మందీమార్బలంతో ఆదివారం రాత్రి ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణంలోని యాదవుల బజారులో యథేచ్ఛగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారాన్ని అడ్డుకునేందుకు పోలీసులు, అధికారులు అటువైపు రాకపోవడం గమనార్హం. వైసీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారాన్ని చిత్రీకరిస్తున్న 'ఆంధ్రజ్యోతి' విలేకరిపై సర్నాల బంధుగణం బెదిరింపులకు దిగింది. ఎన్నికలయ్యాక నీ అంతు చూస్తామని బెదిరించి ఫొటోలు మొబైల్ ఫోన్ నుంచి డిలీట్ చేయాలని భయపెట్టారు. విషయం చెప్పేందుకు పోలీసులకు విలేకరి ఫోన్ చేసినా స్పందించలేదు. ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకోవాల్సిన ఎంపీడీవో జాడలేదు. 'మా బజారులో ఇంతవరకు నేను ఓటర్లను కలవలేదు.. మావాళ్లని ఓట్లు అడగొద్దంటారా..' అని తిరుపతిరావు ఎదురు ప్రశ్నించడంతో స్థానికులు విస్తుపోయారు.


సుంకం అచ్చాలు

నెహ్రూ కన్నా

మా నాన్నకే ఓట్లు ఎక్కువ

మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలు (1952)లో నెహ్రూకన్నా ఎక్కువ ఓట్లు రావి నారాయణ రెడ్డికి మాత్రమే వచ్చాయని అనుకుంటారంతా. కానీ నల్లగొండ పార్లమెంటు ద్విసభ్య స్థానం నుంచి పోటీ చేసిన మరొకరికి కూడా తొలి ప్రధానికన్నా మిన్నగా ఓట్లు పోలైన విషయం పెద్దగా వెలుగులోకి రాలేదు. 27 ఏళ్లకే మొదటి పార్లమెంటులో అడుగుపెట్టి, సభలో పిన్నవయస్కుడిగా చరిత్రకెక్కిన ఆ నాయకుడు సుంకం అచ్చాలు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తనదైన పాత్ర పోషించారు. జీవితాంతం సామ్యవాద సిద్ధాంతానికి నిబద్ధుడైన అచ్చాలు జీవిత విశేషాలను.... ఆయన కుమార్తె సుంకం ఆలోచన 'నవ్య'తో చెబుతున్నారిలా...

మా నాన్న సుంకం అచ్చాలు నల్లగొండకు మొదటి లోక్‌సభ సభ్యుడిగా ప్రజా సేవ చేశారు. ఇప్పటి రాజకీయనాయకుల్లా కాకుండా, చివరి శ్వాస వరకు అత్యంత నిజాయితీగా బతికారు. ఆస్తిపాస్తులకన్నా విలువైన ప్రజాభిమానాన్ని సంపాదించారు. బతికినన్నాళ్లు నిఖార్సయిన కమ్యూనిస్టుగా జీవించారు. సుంకం అచ్చాలు అంటే రావి నారాయణరెడ్డి గారి మొదలు గుడిసెల్లోని జనం వరకు... అందరూ అభిమానించేవారు. బొమ్మగాని ధర్మభిక్షంగారైతే మా నాన్న లేకుండా నల్లగొండలో ఒక్క సభ కూడా నిర్వహించేవారు కాదు. దొడ్డా నర్సయ్య, ఉప్పల్ మల్సూర్ లాంటి ఆనాటి కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలు కొందరు ఎన్నో సాయంత్రాలు మా ఇంటి ముంగిట నులక మంచం మీద కూర్చొని ప్రజా సమస్యలమీద చర్చించుకోవడం నాకు బాగా గుర్తు. పెద్దగా చదువుకోకున్నా, మా నాన్నకు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషలు వచ్చు. కమ్యూనిస్టు పార్టీ పుస్తకాలు ఎక్కువగా చదివేవారు. కౌలుదారుల పక్షాన కొట్లాడి, చాలామందికి ఇనాం భూములతో పాటు నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు ఇప్పించారు. నల్లగొండలోని రిక్షా కార్మికుల సహకార సంఘం కార్యదర్శిగా వారికి బ్యాంకు నుంచి రుణాలిప్పించడం లాంటి పనులు చాలానే చేశారు. నల్గొండ చుట్టుపక్కల గ్రామాల్లోని చాలామంది మా నాన్నను ఇప్పటికి యాది చేసుకొంటారు.

> పార్లమెంటు సమావేశాలకు మా నాన్న సుంకం అచ్చాలు... వరంగల్ లోక్‌సభ సభ్యుడు పెండ్యాల రాఘవరావు గారు కలిసి వెళ్లేవారు. వీరిద్దరికీ కలిపి ఢిల్లీలో ఒకే క్వార్టర్ ఇచ్చారట. మొదటి లోక్‌సభ సభ్యుల గ్రూప్ ఫొటోలోనూ ఇద్దరూ పక్కపక్కనే కనిపిస్తారు. ఒకరికొకరు చాలా స్నేహంగా మెలిగేవారు. సాటి మనిషి ఆపదలో ఉంటే చూస్తూ ఊరుకునే రకం కాదు మా నాన్న. అచ్చంపేట నుంచి శాసనసభకు పోటీ చేస్తున్న సమయంలో ఒకరోజు ప్రచారానికి బాడుగ కారులో వెళుతుండగా దారిలో ప్రత్యర్థి పార్టీ కార్యకర్త ఒళ్ళంతా దెబ్బలతో కనిపించాడట. ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే అతన్ని కారులో ఎక్కించుకొని దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లి దగ్గరుండి మరీ చికిత్స చేయించారట. దీన్ని ప్రత్యక్షంగా చూసిన కందిమళ్ళ ప్రతాపరెడ్డిగారు ఈ సంగతి చెప్పారు.

దిగువసభలో చిన్నవాడు

మొట్టమొదటి ఎన్నికలు 1952లో నల్లగొండ పార్లమెంటు ద్విసభ్య స్థానం(ఎస్సీ, జనరల్) పోటీలో పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థులు మా నాన్న సుంకం అచ్చాలు, రావి నారాయణరెడ్డి... కాంగ్రెస్ నాయకులు పి.మహేంద్రనాథ్, వి.భాస్కర రావు మీద మంచి మెజారిటీతో గెలిచారు. అప్పుడు రావి నారాయణరెడ్డి గారికి 3,09,162 వస్తే, మా నాన్నకు 2,82,117 ఓట్లు పోలయ్యాయి. యూపీలోని పుల్పూర్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన జవహర్‌లాల్ నెహ్రూకు 2,33,571 ఓట్లు వచ్చాయి. అలా ఆ ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక ఓట్లు పోలైన అభ్యర్థులుగా రావి నారాయణరెడ్డి, సుంకం అచ్చాలు చరిత్ర సృష్టించారు. అందుకుగాను ఇద్దరినీ పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ సన్మానించారు. 27 ఏళ్ల వయసులో మొదటి లోక్‌సభకు ఎన్నికైన మా నాన్న దిగువసభలోని మిగతా సభ్యుల్లోకెల్లా చిన్నవాడట. అందుకు ఆనాటి పార్లమెంటులోని పెద్దలంతా నాన్నను ప్రత్యేకంగా అభినందించారని విన్నాను. అచ్చంపేట శాసనసభ స్థానం నుంచి 1962 ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా నాన్న పోటీచేసి కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆయనకు అస్సలు పరిచయం లేని అచ్చంపేట నుంచి పోటీకి నిలబెట్టడమే అందుకు ప్రధాన కారణం. అయినా, నాన్న ఎన్నడూ కుంగిపోలేదు. విజయాన్ని, ఓటమిని సమంగా స్వీకరించే స్థితప్రజ్ఞత మా నాన్న సొంతం.

మా ఇల్లు ఓ రహస్య స్థావరం

మా పూర్వీకులది కర్నూలు జిల్లా. మా తాతయ్య కాశయ్య బతుకుతెరువు కోసం కర్నూలు నుంచి కాలినడకన నల్లగొండకు వచ్చాడు. చెప్పులు కుట్టే వృత్తిని వదిలేసి వ్యవసాయం చేయడం మొదలుపెట్టాడు. నల్లగొండ జైలుఖానాలో తోటమాలిగానూ పని చేసేవాడు. ఆయన రెక్కల కష్టంతో మాన్యం చెలకలో కొంత భూమి కొన్నాడు. బొట్టుగూడాలో పెద్ద ఇల్లు కట్టాడు. అది ఎంతోమందికి ఆశ్రయమిచ్చింది. అన్నపూర్ణలా ఎంతోమంది ఆకలి తీర్చింది. మాకేమైనా ఆస్తి ఉందంటే, అది మా తాత సంపాదించి ఇచ్చిందే. ఒకవైపు మా తాత కష్టపడుతూ ఉంటే, మరోవైపు మా నాన్న కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలలో తీరిక లేకుండా ఉండేవారు. ఆంధ్రమహాసభ కార్యక్రమాల్లో కార్యకర్తగా చాలా చురుగ్గా పాల్గొన్నారని విన్నాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో మా ఇల్లు ఒక పెద్ద రహస్య స్థావరం. కొద్దిమంది నాయకులు మా ఇంట్లో అజ్ఞాత జీవితాన్ని గడిపారు. ఒకరోజు పోరాట దళాలకు సమాచారం చేర్చడం కోసం కొరియర్‌గా కందిమళ్ళ ప్రతాపరెడ్డి గారు మా ఇంటికొచ్చారట. ఈ విషయాన్ని ఆయనే ఒకసారి గుర్తు చేసుకొన్నారు. అలా మాకు తెలియడమే కానీ, మా నాన్న ఎన్నడూ తన గురించి ఏమీ చెప్పలేదు. మా నాన్న అని గొప్పగా చెప్పడం కాదు కానీ, 'సుంకం అచ్చాలు అంటే మితభాషి, సౌమ్యుడు, స్నేహశీలి' అని సురవరం సుధాకర్‌రెడ్డి గారి లాంటి నాయకులు గొప్పగా చెప్పగా విన్నాం.

మా నాన్న మంచి దర్జీ కూడా

మేము మొత్తం ఏడుగురు సంతానం. ముగ్గురు అన్నదమ్ములు, నలుగురు అక్కచెల్లెళ్లం. నేను రెండో బిడ్డను. ప్రతి మనిషి జీవితానికి ఆ వ్యక్తి ఆలోచనే ఆధారమని మా నాన్న నమ్మకం. అందుకే నాకు 'ఆలోచన' పేరు పెట్టారు. విశాలాంధ్ర ఉద్యమం సమయంలో పుట్టిందని మా చెల్లెలికి 'విశాలాంధ్ర' అని నామకరణం చేశారు. మా నాన్నకు మొదట 'షెడ్యూల్ క్యాస్ట్ ఫెడరేషన్' పార్టీతో అనుబంధం ఉన్నదని చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ గారు రాసిన వ్యాసం చదివాకే మాకు తెలిసింది. అయితే, తను ఎంపీగా ఉన్న సమయంలో ఢిల్లీలో అంబేడ్కర్ గారిని కలిశానని నాన్నే ఒక సందర్భంలో స్వయంగా చెప్పారు. ఆ మహనీయుడి మీద అభిమానంతో మా చిన్న తమ్ముడికి 'అంబేడ్కర్' అని పెట్టారు. ప్రతి పండుగకు పిల్లలందరికీ నాన్నే దుస్తులు కుట్టేవారు. దర్జీ పని బాగా వచ్చు. ఎంపీ పదవి ముగిసిన తర్వాత చాలాకాలం మా నాన్న దుస్తులు కుట్టారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకోకపోయినా, జీవితాంతం భారత కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరుడిగానే కొనసాగారు. మొట్టమొదటి ఎన్నికలప్పుడు నల్లగొండలో పార్టీ జిల్లా కార్యాలయం కోసం వకీలు అబ్దుల్ లతీఫ్ ఇంటిని అద్దెకు తీసుకొన్నారు. కొద్ది రోజుల తర్వాత స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇబ్బంది పెట్టడంతో, మా ఇల్లే కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం అయింది. నల్లగొండకు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు ఎవరు వచ్చినా నేరుగా మా ఇంటి దగ్గరే దిగేవారు. ఎంతమంది వచ్చినా మా అమ్మ లింగమ్మ విసుగు, అలసట లేకుండా వండి వడ్డించేది. సమావేశాలు లాంటివేమైనా ఉన్న రోజున వంద ఇస్తర్లు కూడా లేచిన సందర్భాలున్నాయి. పైగా ఇంటికి ఎవరొచ్చినా అన్నం తినకుండా వెళ్ళనిచ్చేవారు కాదు మా అమ్మానాన్న. డబ్బు చుట్టూ మనుషులు తిరగని రోజులవి.

కూతురిగా గర్వపడుతున్నా...

చిన్నప్పుడు చదువుకోడానికి నాన్న బడికెళితే... ఉపాధ్యాయులు చదువు చెప్పలేదట. విద్య విలువ తెలిసిన వ్యక్తి కదా! ఏదైనా గ్రామం నుంచి వచ్చి ఎవరైనా... "అచ్చాలు! మా ఊరికి ప్రభుత్వ పాఠశాల కావాలి" అనడిగితే, మా నాన్న కలెక్టరు వెంటపడిమరీ పాఠశాల ప్రారంభమయ్యేదాకా వదిలేవారు కాదు. మా నాన్న లోక్‌సభ సభ్యుడిగా పనిచేసింది ఐదేళ్లే అయినా, జీవితాంతం


కుటుంబ సభ్యులతో అచ్చాలు

స్థానికులకు అందుబాటులో ఉంటూ వారికి తలలో నాలుకలా మెలిగారు. వ్యవహార జ్ఞానం కలిగిన వ్యక్తి కనుక కుటుంబ తగువులు కూడా సులువుగా పరిష్కరించేవారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దళాలతో సమానంగా పని చేసిన మా నాన్నను స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రభుత్వం గుర్తించలేదు. అందుకు చివరి రోజుల్లో నాన్న చాలా బాధపడ్డారు. స్వచ్ఛమైన రాజకీయాలకు తీపి జ్ఞాపకం మా నాన్న సుంకం అచ్చాలు. ఒక్క రూపాయి పంచకుండా, జనాన్ని ప్రలోభపెట్టకుండా లోక్‌సభకు వెళ్లారు. నందికొండ ప్రాజెక్ట్, నడికుడి రైల్వే మార్గం కోసం పార్లమెంటులో గొంతెత్తారు. నిత్యం ప్రజా సమస్యల మీద కొట్లాడారు. ప్రజల మనిషిగా బతికారు. అనారోగ్యంతో నలభై ఏళ్ళ కిందట కన్ను మూసినా... నిజమైన నాయకుడిగా చరిత్రలో మా నాన్న పేరు శాశ్వతం.

• సాంత్వన్
ఫొటో: లవకుమార్

ఫ్యాషన్

బంధనీ భళా

లెహంగా ట్రెండ్ ఎప్పటికీ నడుస్తూనే ఉంటుంది. అయితే వేడుకల్లో ధరించే లెహంగా రెట్టింపు ప్రత్యేకంగా ఉండాలంటే, రాజస్థానీ బంధనీ లెహంగా ధరించాలి. ఆకర్షణీయమైన రంగుల్లో, డిజైన్లలో తయారయ్యే ఈ రకం లెహంగా ఎంచుకుంటే వేడుకల్లో మీరే సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్.



లెహంగాకు తగిన చోళీ, చున్నీ జోడిస్తేనే బంధనీ లెహంగాకు అందం చేకూరుతుంది. అందు కోసం కాంట్రాస్ట్ రంగుల్లో చోళీ ఎంచుకోవాలి. లెహంగాకు చున్నీ మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి. ఎరుపు రంగు లెహంగాకు ఆకుపచ్చ, పసుపు చోళీలు బాగుంటాయి.

బంధనీ లెహంగా ధరిస్తే నగల అలంకరణ మరీ హెవీగా ఉండకూడదు. చెవులకు ఝుంకాలు, మెడలో సన్నని చైన్, చేతికి కంగన్ సరిపోతుంది.

జరీ జోడిస్తే ఎలాంటి దుస్తులకైనా భారీ లుక్ చేకూరుతుంది. బంధనీ లెహంగా మరింత భారీగా కనిపించాలంటే అర అడుగు వెడల్పు ఉండే జరీ బార్డర్ జోడించాలి. బ్లౌజ్ గోల్డ్ కలర్‌లో ఉంటే పెళ్లిళ్ల లాంటి వేడుకల్లో ధగధగలాడిపోవచ్చు.


సెన్సిటివ్ దంతాలు ఉన్నాయా?



కొందరికి చల్లని లేదా వేడి పదార్థాలు తిన్నప్పుడు దంతాలు జివ్వుమంటాయి. ఇలా కాకుండా ఉండాలంటే కొన్ని టిప్స్ పాటించాల్సిందే.

- దంతాల మీద ఎనామిల్ అనేది సున్నితమైన రక్షిత పొర. ఇది పోతే సెన్సిటివ్ దంతాలుగా మారతాయి. ఏది తిన్నా సమస్యనే కలుగుతుంది. ఇలాంటి వాళ్లు టూత్ బ్రష్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. గట్టి బ్రష్‌తో పండ్లు తోమకూడదు. సున్నితమైన బ్రష్‌లు తీసుకోవాలి. తరచూ బ్రష్‌లు మారుస్తుండాలి.
- ఆమ్ల లక్షణాలుండే కూల్‌డ్రింక్స్ తాగకూడదు. ఫాస్ట్‌ఫుడ్స్, తీపి పదార్థాలు తినకూడదు. పండ్లు, కూరగాయలు తినాలి. ముఖ్యంగా పొటాషియం ఉండే అరటిపండు, బత్తాయి పండ్లను తినాలి. పాలు, పెరుగు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలి.
- జామ ఆకులు నమలడం, లవంగాలు తినడంవల్ల ఉపశమనం ఉంటుంది.
- ఓరల్ హైజీన్ కాకున్నా కూడా కొన్ని రకాల బ్యాక్టీరియాల వల్ల ఈ సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఇలాంటి వాళ్లు రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలి.
- ఈ పద్ధతులు పాటించినా ఇంకా సమస్య ఉంటే వైద్యుడిని సంప్రదించాలి.

నవ్య | చిత్రజ్యోతి



వైవిధ్యమైన కథతో...

అశ్విన్ బాబు హీరోగా అప్సర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'శివం భజే'. మహేశ్వర్‌రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ "వైవిధ్యమైన కథతో తెరకెక్కుతోన్న న్యూ ఏజ్ సినిమా ఇది" అని చెప్పారు. అప్సర్ మాట్లాడుతూ "ఈ సినిమా టైటిల్‌కు, ఫస్ట్ లుక్‌కు విశేష స్పందన లభించినందుకు ఆనందంగా ఉంది" అని అన్నారు. ఈ ఫస్ట్ లుక్‌లో రౌద్ర రూపంలో హీరో పాత్ర కనపడుతోంది. ఈ చిత్రంలో దిగంగనా సూర్యవంశీ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్‌నటుడు అర్బాజ్ ఖాన్, హైపర్ ఆది, సాయి ధీన, మురళీ శర్మ, బ్రహ్మాజీ, తులసి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఛోటా కె నాయుడు, డీఓపీ: దాశరథి శివేంద్ర, సంగీతం: వికాస్ బడిద.

డబుల్ ఎంటర్టైన్‌మెంట్ గ్యారంటీ

ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్' సినిమాలో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా నుంచి ఎప్పుడెప్పుడు అప్‌డేట్ వస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ నెల 15న రామ్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేస్తోంది. ఈ టీజర్‌తో డబుల్ మాస్, డబుల్ ఎంటర్టైన్‌మెంట్ గ్యారంటీ అని టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చూస్తే తెలుస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: పూరి జగన్నాథ్, చార్మి కౌర్, సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియన్నెలి, సంగీతం: మణిశర్మ.





ఒక్కటి చేసిన క్రికెట్ కల

రాజ్‌కుమార్ రావు, జాన్వీకపూర్ జంటగా నటించిన క్రీడా నేపథ్య చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. ఈ నెల 31న ఈ విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. హీరో హీరోయిన్ల పెళ్లి ప్రపోజల్ నేపథ్యంలో మొదలైన ట్రైలర్ ఆద్యంతం వినోదం పంచింది. భిన్న మనస్తత్వాలున్న దంపతులుగా రాజ్‌కుమార్ రావు, జాన్వీకపూర్ జంట సందర్భోచిత నటన ఆకట్టుకుంది. ఎప్పుడూ గొడవపడే దంపతులిద్దరినీ క్రికెట్ ఎలా ఒక్కటి చేసింది, మహి క్రికెటర్‌గా ఎదిగిన తీరును ట్రైలర్‌లో చూపించిన విధానం ఆసక్తికరంగా అనిపించింది. శరణ్ శర్మ దర్శకత్వంలో కరణ్ జోహార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

అహంకారం ప్రధాన పాత్ర పోషిస్తే



రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ నటించిన ఓటీటీ చిత్రం 'విద్య వాసుల అహం'. మణికాంత్ గిల్లి దర్శకత్వం వహించగా, మహేశ్ దత్త మొతూరు, లక్ష్మీనవ్య మక్కపాటి నిర్మించారు. ఇందులో అవసరాల శ్రీనివాస్, తనికెళ్ల భరణి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 17 నుంచి ఆహాలో ఈ చిత్రం స్ట్రీమింగ్ అవనుంది. పెళ్లయిన కొత్త జంట మధ్య అహంకారం ప్రధాన పాత్ర పోషిస్తే ఎటువంటి పరిణామాలు ఎదురవుతాయనేది కథ. ఈ చిత్రానికి ఎడిటర్: సత్య గిడుతూరి, డీఓపీ: అఖిల్ వల్లూరి, సంగీతం: కల్యాణి మాలిక్.

'లేదే లేదే ప్రేమసలే'



పాపులర్ కమెడియన్ గెటప్ శీను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రాజుయాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన సాంగ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మరో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'లేదే లేదే ప్రేమసలే' అంటూ సాగే ఈ ఎమోషనల్ సాంగ్‌కు చంద్రబోస్ సాహిత్యం అందించడమే కాకుండా ఆలపించారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించారు. ఈ నెల 17న 'రాజుయాదవ్' విడుదలవుతోంది.



సందేశం వినోదం కలబోతగా

నూతన నటీనటులతో తెరకెక్కిన వినోదాత్మక చిత్రం 'అక్కడ వారు ఇక్కడ ఉన్నారు'. సాయిహర్షిణి, ఎస్పీ రమణ, పి. లలిత, పిల్లి విజయ్‌కుమార్ ప్రధాన తారాగణం. కుందుర్తి త్రివిక్రమరావు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 17న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమాన్ని యూనిట్ ఆదివారం తెనాలిలో నిర్వహించింది. ఈ సందర్భంగా త్రివిక్రమరావు మాట్లాడుతూ '10 రోజుల సింగిల్ షెడ్యూల్‌లో ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేశాం. అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కించాం. వినోదంతో పాటు ఈ తరానికి చక్కటి సందేశం ఇచ్చే చిత్రమిది' అన్నారు. ఈ చిత్రానికి శ్రీ వెంకట్ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: రాజు కేశన్న, ఎడిటర్: వెంకట్.

అసెంబ్లీలు	పార్లమెంట్	అభ్యర్థులు	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు	సమస్యాత్మకమైనవి	ఎన్నికల ఉద్యోగులు
7	1	113	17,05,152	1,874	878	22,000



నేడే పోలింగ్

నేడే పోలింగ్..! నేడు సామాన్యుడే సామ్రాట్.. ఓటే వజ్రాయుధం.. మాపుడు వేలే భవితకు బంగారు బాట చూపే బ్రహ్మాస్త్రం.. విజన్-వినాశనం, అభివృద్ధి-అవినీతి, దార్శనికత-దోపిడీ ప్రధాన అజెండాలుగా ఆలోచించి ఓటేయాల్సిన సమయమిది. అమ్మలాంటి అమరావతిని కాపాడుకోవాలన్నా.. దుర్గగుడిలో దుష్ట పన్నాగాలను తరిమికొట్టాలన్నా.. అవినీతి, అరాచకాలను అంతం చేయాలన్నా.. ప్రతి అడుగులో అభివృద్ధి జరిగి అంతకంతకూ ముందుకు వెళ్లాలన్నా.. ఉపాధి పెరిగి, ఉద్యోగాలు కలిగి, వలస జీవితాల్లో మార్పు రావాలన్నా.. కుట్రలు, కుయుక్తులు, దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాల వంటి నేరప్రవృత్తిని నిరోధించాలన్నా.. ఆలోచించి ఓటేయాలి. ఓటుకు పోటెత్తాలి. అరాచక పాలనపై వేటేయాలి.. అంటూ ఓటరన్నకు సాదరంగా స్వాగతం పలుకుతున్నాయి ఉద్యమాల పురిటిగడ్డలైన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు.





గంగూరులోని ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీ నుంచి ఎన్నికల సామగ్రి తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది

ఉదయం 7 గంటల నుంచి ప్రారంభం

జిల్లావ్యాప్తంగా ఓటర్లు.. పోలింగ్ స్టేషన్లు

నియోజకవర్గం	ఓటర్లు	మహిళలు	పురుషులు	పోలింగ్ కేంద్రాలు
తిరువూరు	2,72,740	1,05,190	1,01,994	234
విజయవాడ వెస్ట్	2,56,102	1,29,296	1,26,634	253
విజయవాడ సెంట్రల్	2,77,853	1,42,845	1,34829	267
విజయవాడ ఈస్ట్	2,70,994	1,38,160	1,32,441	298
మైలవరం	2,81,841	1,44,972	1,36,740	296
నందిగామ	2,05,577	1,06,076	99,398	222
జగ్గయ్యపేట	2,55,011	1,06,888	98,463	222

17.05 లక్షల మంది ఓటర్ల నిర్ణయాత్మక తీర్పు

- విజయవాడ పార్లమెంట్ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు..
- పోలింగ్ కేంద్రాల్లో పక్కా ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 22 వేల మంది ఉద్యోగుల సేవలు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ
- ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో కలెక్టర్ దిల్లీరావు సూచనలు



వన్‌టౌన్ గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఎన్నికల సామగ్రి సిద్ధం చేసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లావ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియకు సర్వంసిద్ధమైంది. సోమవారం ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ జరుగుతుంది. 7 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏడు అసెంబ్లీ స్థానాలకు 96 మంది అభ్యర్థులు, ఒక పార్లమెంట్ స్థానానికి 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

మహిళలే నిర్ణయాత్మక శక్తి

జిల్లావ్యాప్తంగా 17,05,152 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో మహిళలు 8,73,427 మంది కాగా, పురుషులు 8,30,499 మంది. మొత్తం 720 పోలింగ్ లొకేషన్లలో మొత్తం 1,874 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉండటం వల్ల వాటికి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ వంటివి కూడా ఇక్కడి యంత్రాంగమే చేపడుతోంది. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో 1,000 మంది ఓటర్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. 1,200 పైబడి ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు కూడా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల తర్వాత కూడా జరిగే అవకాశం ఉంది.

సమస్యాత్మక కేంద్రాల వద్ద వెబ్‌క్యాస్టింగ్

జిల్లావ్యాప్తంగా మొత్తం 878 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించారు. తిరువూరులో 129, విజయవాడ పశ్చిమలో 97, విజయవాడ సెంట్రల్‌లో 134, విజయవాడ తూర్పులో 159, మైలవరంలో 124, నందిగామలో 77, జగ్గయ్యపేటలో 116, గన్నవరంలో 42 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకంగా గుర్తించారు. ఈ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో వీడియోగ్రఫీ నిర్వహించటానికి ఏర్పాట్లు చేపట్టారు. ఇక ఎన్నికల నిర్వహణలో మొత్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 22 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రత్యక్షంగా 13,901 మంది ఉద్యోగులు పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారు.

85 శాతం పోలింగ్ లక్ష్యంగా..

రాష్ట్ర విభజన తర్వాత జరిగిన గత రెండు ఎన్నికల్లో జిల్లాలో నగటున 80 శాతం పోలింగ్ కూడా నమోదు కాలేదు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 77.28 శాతం, 2019 ఎన్నికల్లో 78.94 శాతం పోలింగ్ నమోదైంది. ఇది స్వల్ప పెరుగుదలే. గ్రామీణ ప్రాంతాలు కలిసిన నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం 89 శాతం వరకు నమోదైనా, విజయవాడ నగర పరిధిలో 70 శాతంలోపే నమోదవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం 85 శాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు అనుగుణంగా 17.05 లక్షల మంది ఓటర్లకు స్లిప్పులను అందించింది. ఓటు ఆవశ్యకతను తెలిపే అనేక కార్యక్రమాలు చేపట్టింది.

ఓటువెయ్యి..

చాలా ప్రాంతాల్లో రూ.1,000 పలికిన ఓటు ధర

- కొన్ని ప్రాంతాల్లో రూ.3,000కు మించి..
- పంపిణీలో ప్రధాన పార్టీల మధ్యే పోటాపోటీ
- సెంట్రల్‌లో ఎమ్మెల్సీ రుహుల్లా డబ్బు పంపిణీ
- భారీగా చేరుకున్న జనం.. కేసు నమోదు

“ పోలింగ్ కొద్దిగంటల్లో ప్రారంభమవుతుందనగా, రెండు జిల్లాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేశారు. ఆదివారం భారీ ఎత్తున ధనప్రవాహం కొనసాగింది. కొన్నిచోట్ల అధికారులు భారీగా డబ్బు స్వాధీనం చేసుకున్నారు.



(విజయవాడ, ఆంధ్రజ్యోతి) : జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడులో ఓ వైసీపీ నాయకుడి ఇంట్లో ఓట్ల కొనుగోలు కోసం ఉంచిన రూ.50 లక్షలను ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. డబ్బు ఇస్తామని చెప్పడంతో పలువురు అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్సీ రుహుల్లా కార్యాలయం వద్ద గుమిగూడారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఎమ్మెల్సీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. గుమిగూడిన స్థానికులను ప్రశ్నించగా, తమకు డబ్బులు ఇస్తామని చెప్పడంతో వచ్చామని తెలిపారు. దీంతో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఆయన సోదరుడు ఎండీ హఫీజుల్లా, వైసీపీ నేత రాజుపై కేసు నమోదు చేశారు. తమకు డబ్బు ఇవ్వలేదంటూ పలుచోట్ల ఓటర్లు ఆందోళనకు దిగారు. మైలవరం నియోజకవర్గం జక్కంపూడి కాలనీలో వైసీపీ అభ్యర్థి డబ్బులు ఇవ్వలేదంటూ స్థానిక నాయకుడి ఇంటి వద్దకు వచ్చి నిలదీశారు.

వైసీపీ నేతలదే ముందంజ

నగదు పంపిణీలో వైసీపీ నేతలు ముందంజలో ఉన్నారు. చాలా నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ మాట్లాడుకుని రూ.1,000 నుంచి రూ.1,500 పంపిణీ చేశారు. కొన్ని చోట్ల టీడీపీ అభ్యర్థుల కంటే వైసీపీ వారే రూ.500 నుంచి రూ.1,000 అదనంగా పంపిణీ చేశారు. విజయవాడ సెంట్రల్ వైసీపీ అభ్యర్థికి ముఖ్య అనుచరులు ఝలక్ ఇచ్చారు. వెలంపల్లికి చెందిన ఇద్దరు ప్రధాన అనుచరులు ప్రచార ఖర్చుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వారి సామాజిక వర్గంతో పాటు వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున నిధులు వసూలు చేశారు. ఈ నిధులను ఓటర్లకు పంపిణీ చేయాలని వెలంపల్లి సూచించగా, అధికశాతం జేబులో వేసుకున్నట్లు సమాచారం.

క్వార్టర్ బాటిల్ రూ.400

తోట్లవల్లూరు, మే 12 : ఎన్నికలకు రెండు రోజుల ముందే మద్యం దుకాణాలను మూసివేయటంతో బెల్టుషాపుల్లో అధిక ధరలు మార్మోగాయి. రూ.130 క్వార్టర్ బాటిల్‌ను రూ.400కు విక్రయించారు. రూ.500కు కూడా కొనేందుకు మందుబాబులు ఎగబడ్డారు. కాగా, ఆదివారం రాత్రి అధికార పార్టీ నేతలు ఓటర్లకు మద్యం పంపిణీ చేశారు. గ్రామాల్లో వందలమందికి మద్యం సీసాలను ఉచితంగా పంపిణీ చేశారు.

కసున్న బస్సులు

ఆర్టీసీ సిబ్బందితో ప్రయాణికుల ఘర్షణ

- హైదరాబాద్ నుంచి పీఎన్‌బీఎస్‌కు భారీగా జనం రాక
- ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లేక అవస్థలు
- ఎన్నికల సిబ్బంది కోసం వెళ్లిన 243 బస్సులు
- గంటలకొద్దీ వేచి ఉండలేక ఘర్షణకు దిగిన ప్రయాణికులు



పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : హైదరాబాద్ నుంచి భారీగా వచ్చిన ప్రయాణికులకు ఆదివారం విజయవాడలో చేదు అనుభవం ఎదురైంది. విజయవాడ వచ్చి, ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సుల్లేక అనేక అవస్థలు పడుతున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేయటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. బస్సులు లేకపోవటంతో పీఎన్‌బీఎస్‌లో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల మధ్య ఘర్షణలు జరిగాయి. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. వాస్తవానికి ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించటం కోసం ఆర్టీసీ కొన్ని బస్సులు పంపింది. ఇందుకోసం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం మొత్తం 495 బస్సులు కావాలని కోరగా, 243 బస్సులే అద్దెకు ఇచ్చారు. దీంతో జిల్లా యంత్రాంగం ప్రైవేట్, స్కూల్ బస్సులను సమకూర్చుకుంది. అయితే, 243 బస్సులను అద్దెకు ఇవ్వటంతో బస్సుల కొరత ఏర్పడింది. మరోవైపు హైదరాబాద్ నుంచి ఊహించని స్థాయిలో ఆదివారం కూడా ప్రయాణికులు తరలివచ్చారు. హైదరాబాద్ నుంచి వచ్చేవారిని తీసుకురావటం కోసం 20 బస్సులను అక్కడికి పంపారు. దీనివల్ల కూడా బస్సులు సరిపోని పరిస్థితి ఏర్పడింది. రద్దీ ఒక్కసారిగా పెరగడంతో ఆర్టీసీ చేతులెత్తేసింది. దీంతో ప్రయాణికులు ఆటోలు, కార్లు, క్యాబ్‌లను కిరాయిలకు మాట్లాడుకుని వెళ్లాల్సి వచ్చింది. కాగా, రైల్వేస్టేషన్ కూడా ప్రయాణికులతో కిటకిటలాడింది. రైళ్లన్నీ రద్దీగా నడిచాయి.



రైళ్లలో కిక్కిరిసి ప్రయాణం

హైదరాబాద్ నుంచి విజయవాడకు విమానాల్లోనూ భారీగా తరలివచ్చారు. బెంగళూరు, చెన్నై, ఢిల్లీ విమానాలు కూడా రద్దీగా వచ్చాయి.

భవానీపురం ఇన్‌స్పెక్టర్‌పై వేటు

- వీఆర్‌కు పంపిన పోలీస్ కమిషనర్
- ఆది నుంచి వివాదాస్పదుడే.. ఎన్నికల ముందు చర్యలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పోలీసులంతా బందోబస్తు బిజీలో ఉండగా, పోలీస్ కమిషనర్ రామకృష్ణ సంచలన నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ పశ్చిమ డివిజన్‌లో ఉన్న భవానీపురం ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణపై ఆదివారం రాత్రి వేటు వేశారు. ఉన్నట్టుండి ఆయన్ను విధుల నుంచి తప్పించారు. తక్షణమే పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలిచ్చారు. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా దొమ్మేటి ప్రసాదకుమార్‌ను నియమిస్తూ ఆదేశాలిచ్చారు. కొత్త ఇన్‌స్పెక్టర్ వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీని ప్రకారం ప్రసాదకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌స్పెక్టర్‌ను హఠాత్తుగా వీఆర్‌కు పంపడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని తెలుస్తోంది. పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న రాజకీయ నేతలతో ఆయన సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కమిషనర్‌కు పలు ఫిర్యాదులు అందడంతో ప్రత్యేకంగా విచారణ చేయించారు. ఇందులో వాస్తవం ఉందని తేలడంతో వేటు వేసినట్టు తెలుస్తోంది.

ఆ బ్యాగ్ ఏమైంది?

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఒక రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు ఓటర్లకు పంపిణీ చేయడానికి తీసుకొచ్చిన నగదు బ్యాగ్ మాయమైనట్టు తెలుస్తోంది. ఈనెల 9వ తేదీన వన్‌టౌన్ పంజా సెంటర్‌లో పవన్ కల్యాణ్ బహిరంగ సభ జరిగింది. పోలీసులంతా ఆ పనిలో ఉండగా, ఓ రాజకీయ పార్టీ నాయకులు వైఎస్సార్ కాలనీలో డబ్బు పంపిణీ చేయడానికి సిద్ధమయ్యారు. మొత్తం 18 మంది డబ్బు పంపిణీ చేశారు. ఇంతలో మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు విజిల్ వేయడంతో నగదు ఉన్న బ్యాగ్‌తో పాటు కొంత డబ్బును పక్కనే ఉన్న కాల్వలో పడేసి పారిపోయినట్టు తెలిసింది. పోలీసులు వెంటాడి ఒక వ్యక్తిని పట్టుకున్నట్టు సమాచారం. కాల్వలో పడిపోయిన డబ్బు పైకి తేలుతూ కనిపించినా, పక్కనే పడిన నగదు బ్యాగ్ మాత్రం కనిపించకుండా పోయినట్టు తెలుస్తోంది. ఈ బ్యాగ్‌లో భారీగానే నగదు ఉందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై కొత్తపేట ఇన్‌స్పెక్టర్ తిప్పా గణేశ్‌ను వివరణ కోరగా, తాను ఆరోజు పవన్ కల్యాణ్ సభ బందోబస్తులో ఉన్నానన్నారు. పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్న బ్యాగ్‌లో ఎలాంటి నగదు లేదని, ఖాళీగా ఉందని పేర్కొన్నారు.

ప్రలోభపర్వం

మైలవరంలో నోట్ల కట్టలు

- గతంలో తాయిలాలు.. తాజాగా ఓటుకు నోటు
- రెచ్చిపోతున్న వైసీపీ బ్యాచ్

విజయవాడ, మే 12: మైలవరంలో సామాన్యుడికి సీటిచ్చామని చెబుతున్న వైసీపీ అధిష్ఠానం ఆ పార్టీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావును గెలిపించేందుకు అష్టకష్టాలు పడుతోంది. ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనబడుతుండటంతో వైసీపీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు అనేక కుయుక్తులు పన్నుతోంది. డబ్బు ఎదజల్లి మైలవరంలో గెలిచే ప్రయత్నాలు చేస్తోంది. కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు టీడీపీ నేతలు మాట్లాడుకున్నట్లు ఇతర కులాలను బూతులు తిట్టినట్లు ఒక ఫేక్ ఆడియోను ఇటీవల వైరల్ చేసింది. తాజాగా పోలింగ్ ముందురోజున నోట్లకట్లతో ఓటర్లను ప్రలోభపెడుతోంది. సీటిస్తాం..ఖర్చు భరిస్తాం వైసీపీ తరపున పోటీ చేయాలని చెప్పినా వినకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ టీడీపీలోకి వచ్చి కూటమి అభ్యర్థిగా పోటీలో నిలవడం, ఏమాత్రం రాజకీయ అనుభవం లేని జడ్పీటీసీ సభ్యుడిని తొలిసారి ఎమ్మెల్యే రేసులో వైసీపీ నిలపడంతో వైసీపీ ఓటమి దాదాపు ఖాయమైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మంత్రి జోగి రమేష్ మంత్రాంగం నడిపి జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మకు దక్కాల్సిన మైలవరం సీటును యాదవ సామాజికవర్గానికి చెందిన సర్నాల తిరుపతిరావుకు దక్కేలా చేశాడు. ఒకవేళ ఇక్కడ సర్నాల గెలిచి.. తాను పెనమలూరులో ఓడినా మైలవరం ఇన్‌చార్జిగా పెత్తనం వెలగబెట్టవచ్చని జోగి ఎత్తుగడ వేసి, ఈక్రమంలోనే తన సొంత సామాజికవర్గమైన లక్ష్మీతిరుపతమ్మను కాదని యాదవ సామాజికవర్గానికి జోగి సీటు ఇప్పించాడు. కానీ, జాకీలు వేసి లేపినా సర్నాల గ్రాఫ్ ఏమాత్రం పెరగకపోగా, వైసీపీ ద్వితీయశ్రేణి నాయకుల నుంచి సర్నాలకు పూర్తి సహకారం లభించడం లేదు. దీంతో రెడ్డి సామాజికవర్గానికి చెందిన ముగ్గుర్ని ఆయన మీద పెత్తనానికి పెట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో సజ్జల సైతం మైలవరం వచ్చి, ఎలాగైనా సర్నాలను గెలిపించాలని మంత్రాంగం చేసి, డబ్బు దండిగా ఇచ్చి వెళ్లాడని తెలుస్తోంది. దీంతో ప్రచారం ముగియగానే వైసీపీ నాయకులు ఓట్లను కొనుగోలు చేయడం ప్రారంభించారు. ఈక్రమంలోనే హెచ్.ముత్యాలంపాడులో దాచిన డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిసింది.



ఇంట్లో నగదును స్వాధీనం చేసుకుంటున్న జి.కొండూరు ఎస్సై షబ్బీర్ అహ్మద్, స్వాధీనం చేసుకున్న నగదును లెక్కిస్తున్న పోలీసులు

వైసీపీ నేత ఇంట్లో రూ.40 లక్షలు స్వాధీనం

జి.కొండూరు: మండలంలోని హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో ఓ వైసీపీ నాయకుడి ఇంట్లో దాచిన రూ.40 లక్షలను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జి.కొండూరు ఎస్సై షబ్బీర్ అహ్మద్ కథనం మేరకు గ్రామానికి చెందిన చల్లా చలపతి అనే వైసీపీ నాయకుడి ఇంట్లో ఉంచిన రూ.40 లక్షలను పక్కా సమాచారంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ నగదును స్వాధీనం చేసుకుని, అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ డబ్బు రూ.57 వేలు స్వాధీనం

రెడ్డిగూడెం, మే 12: రెడ్డిగూడెం ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి ఓటర్లకు డబ్బు పంచుతున్న వైసీపీ నాయకుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న రూ.57 వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యు.గోవింద్ తెలిపారు.



మైలవరం వైసీపీ కార్యాలయం వద్ద గుమిగూడి ఆందోళన చేస్తున్న ఓటర్లు

డబ్బు అందలేదని ఓటర్ల ఆందోళన

- మైలవరం వైసీపీ కార్యాలయం వద్ద పడిగాపులు

మైలవరం, మే 12: వైసీపీ మైలవరం అభ్యర్థి సర్నాల తిరుపతిరావుకు చెందిన నోట్ల కట్టలు రూ.40 లక్షల పోలీసులు పట్టుకోవడం రెండ్రోజుల నుంచి ఓటుకు రూ.2 వేలు చొప్పున పంచడం, భారీగా మద్యం పంచడం ఇప్పుడు మైలవరం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమయ్యింది. ఈ క్రమంలో నోట్ల పంపకం వ్యవహారం వికటించింది. ఒకరికి పంచి మరొకరికి మొండిచెయ్యి చూపించడంతో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు మైలవరం వైసీపీ కార్యాలయానికి ఆటోలో పెద్ద సంఖ్యలో మహిళలు వివిధ ప్రాంతాల నుంచి ఓటర్ స్లిప్పు తీసుకొని వచ్చారు. మేము వైసీపీ కోసం ఇంత కష్ట పడితే మా సొమ్ము కూడా మీరే నొక్కేస్తారా అని కార్యాలయంలో ఉన్న వారిని నిలదీశారు. సొమ్ములు ఇస్తేనే ఇక్కడి నుంచి బయటకు వెళతామని నిలదీయడంతో అక్కడి నుంచి నాయకులు జారుకున్నారు. సామాన్యుడిపై పెట్టిన పెత్తందార్లు ఓటర్లకు పంచే డబ్బులు మింగేశారని ఓట్లకు డబ్బులు అందని వారు బహిరంగంగా వ్యాఖ్యానించారు.

వైఎస్సార్ కాలనీలో రోడ్డెక్కిన కాలనీవాసులు

విజయవాడ రూరల్, మే 12: వైసీపీ డబ్బుల పంపిణీ వ్యవహారం విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి కాలనీలో శనివారం అర్ధరాత్రి గందరగోళం సృష్టించింది. కాలనీలోని 206, 207 బ్లాక్‌ల్లో స్థానిక వైసీపీ నేత శనివారం రాత్రి డబ్బులు పంపిణీ మొదలుపెట్టారు. అక్కడి నుంచి మొదలు కాలనీలోని వివిధ బ్లాక్‌లలో ఓటర్లకు స్లిప్‌లు తీసుకుని పలుచోట్ల డబ్బులు పంపిణీ చేశారు. ఓట్లకు డబ్బులు పంచుతున్నారన్న వార్త కాలనీ మొత్తం వ్యాపించడంతో ఓటరు స్లిప్‌లతో వందలాది మంది స్థానికులు రోడ్ల పైకి చేరారు. అప్పటికే కొన్ని ప్రాంతాల్లో డబ్బులు పంచిన వైసీపీ నేతలు జనాభా తాకిడి ఎక్కువ అవడంతో అక్కడి నుంచి జారుకున్నారు. 206, 207 బ్లాక్‌ల వద్ద వైసీపీ నేతలు మకాం వేసిన ప్రాంతం వద్దకు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు చేరుకుని ఆందోళనకు దిగారు. కాలనీలో మీకు కావాల్సిన సగంమందికి డబ్బులు ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వలేదంటారా అని వైసీపీ నేతలపై ఒత్తిడి తేవడంతో వైసీపీ నేతలు అక్కడి నుంచి జారుకున్నారు.

సెంట్రల్‌లో నగదు పంపిణీకి యత్నం

- ఎమ్మెల్సీ రుహుల్లా, అతని సోదరుడిపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, మే 12: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆదివారం ప్రయత్నించారు. ఓట్లకు డబ్బులు ఇస్తామని వైసీపీ నేతలు చెప్పడంతో పలువురు స్థానికులు అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్సీ రుహుల్లా కార్యాలయం వద్ద గుమిగూడారు. విషయం తెలుసుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఎమ్మెల్సీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. గుమిగూడిన స్థానికులను ప్రశ్నించగా తమ ఓట్లకు డబ్బులు ఇస్తామని వైసీపీ నేతలు చెప్పడంతో వచ్చామని ఓటర్లు చెప్పారు. దీంతో ఎమ్మెల్సీ కార్యాలయంలో పోలీసులు తనిఖీ చేశారు. పది ఓటర్ స్లిప్‌లను పోలీసులు గుర్తించారు. దీంతో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, అతని సోదరుడు ఎండీ హఫీజుల్లా, వైసీపీ నేత రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఎన్టీఆర్ జిల్లాలో ఓటేయనున్న 17.04 లక్షల మంది ఓటర్లు

- 13,402 మంది అధికారులు, సిబ్బందితో నిర్వహణ
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న అధికారులు, సిబ్బంది
- పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ: జిల్లా ఎన్నికల అధికారి ఎస్.ఢిల్లీరావు



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ / కృష్ణలంక): "ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రశాంతంగా, పక్షపాతం లేకుండా, పారదర్శకంగా, హింసాత్మక ఘటనలకు, గొడవలకు తావు లేకుండా ఎన్నికలను నిర్వహించబోతున్నాం. ఈసారి జిల్లాలో 85శాతం ఓటింగ్ నమోదు చేయాలన్న లక్ష్యంతో ఉన్నాం. పట్టణ ఓటర్లు అధిక సంఖ్యలో ఓటేస్తారని ఆశిస్తున్నాం' అని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి ఎస్.ఢిల్లీరావు అన్నారు. జిల్లావ్యాప్తంగా సోమవారం సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లాలో 17.04 లక్షల మంది ఓటర్లు ఓటేయడానికి 1,874 కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. 13,402 మంది పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో చేరుకున్నారని పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు ఓటేసేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. నియోజకవర్గాల ఎన్నికల అధికారులు వారి పరిధిలోని ఎన్నికల అధికారులు, సిబ్బందితో పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లను పూర్తిచేసుకుని, సోమవారం ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించుకుని, సమస్యలు ఉంటే పరిష్కరించి 7 గంటల కల్లా పోలింగ్‌ను ప్రారంభించాలని ఆదేశించామన్నారు.

మొదట పార్లమెంట్, తర్వాత అసెంబ్లీ కంపార్ట్‌మెంట్లు

ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, కుర్చీలు, చక్రాల కుర్చీలు, ప్రాథమిక చికిత్స ఏర్పాట్లు చేసినట్లు ఢిల్లీరావు తెలిపారు. 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లున్న పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటల తర్వాత పోలింగ్ జరిగే అవకాశమున్నందున లైటింగ్ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ స్టేషన్‌లో మొదట పార్లమెంట్ నియోజకవర్గ ఓటింగ్ కంపార్ట్‌మెంట్ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గ ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ఉంటాయన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో 17 మంది విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 20 మంది పోటీలో నిలవడంతో ఈ నియోజకవర్గాల్లో రెండు బ్యాలెట్ యూనిట్లు ఉపయోగిస్తామని తెలిపారు. గందరగోళానికి తావులేకుండా ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు సహాయ కేంద్రం సేవలందిస్తుందని తెలిపారు. పోలింగ్‌స్టేషన్‌లో సీపీఎఫ్‌యేతర వీడియోగ్రఫీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈవీఎంలకు ఏవైనా సమస్యలు వస్తే 15 నిమిషాల సమయంలో సరిదిద్దేందుకు అనువుగా ఏర్పాట్లు చేశామని, సెక్టార్ అధికారులు, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైన్లు (ఏఎల్ఎంటీ)లతో పాటు ప్రతి నియోజకవర్గంలో ముగ్గురు చొప్పున బెల్ ఇంజినీర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

పోలింగ్ పూర్తయిన అనంతరం జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాలకు డిస్ట్రిబ్యూషన్ జరిగిన చోటే రిసెప్షన్ కేంద్రాలు ఉంటాయన్నారు. అక్కడి ఇంటర్మీడియట్ స్ట్రాంగ్‌రూంలలో ఈవీఎంలను భద్రపరుస్తామన్నారు. విజయవాడ పశ్చిమ, సెంట్రల్, ఈస్ట్, మైలవరం నియోజకవర్గాలకు నోవా, నిమ్రా కళాశాలల్లో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. నోవా, నిమ్రా కళాశాలల్లో 27 స్ట్రాంగ్ రూంలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

7 గంటలకు పోలింగ్ ప్రారంభం

ప్రజాస్వామ్యస్ఫూర్తితో ఓటర్లు ఓటేయాలని ఢిల్లీరావు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం అవుతుందని, సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పూర్తి కాకపోతే క్యూలో ఎంత మంది ఉంటే అంతమందికి వెనుక నుంచి టోకెన్లు ఇస్తామన్నారు. టోకెన్లు తీసుకున్న వాళ్లంతా ఓటేసే సమయాన్ని అనుమతిస్తామన్నారు.

సిరా మార్ఫింగ్‌కు అవకాశం లేదు

- వాట్సాప్‌లలో వస్తున్నవన్నీ వాస్తవం కాదు
- సిరా వేసుకున్న వాళ్లు పోలింగ్ కేంద్రానికి వస్తే తక్షణ చర్యలు : కలెక్టర్ ఢిల్లీరావు

"ఎన్నికల సిబ్బందికి తప్పితే చెరగని సిరా రాయటం ఎవరికీ వీలుపడదు. బయట అలాంటివి జరగటం అసంభవం. ఒకవేళ సిరా మార్కుతో ఎవరైనా వస్తే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం." అని ఢిల్లీరావు హెచ్చరించారు. ఆదివారం ఉదయం నుంచి విజయవాడ తూర్పు నియోజకవర్గంలో బలవంతంగా సిరా మార్కులు వేస్తున్నారని పలు వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడంపై ఆయన స్పందించారు. వేలిపై వేసే సిరా మార్కుకు ఉపయోగించే ఇంకును ఎన్నికల సంఘం కనుసన్నల్లోనే తయారు చేస్తారన్నారు. ఇది పూర్తిగా రహస్యంగా జరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు పోదని తెలిపారు. ఈ ఇంకు చెరిగిపోదని తెలిపారు. ఒక్కసారి గోరు మీద మార్కు పడితే అది ఆరెంజ్ రంగులోకి మారి వారం పది రోజుల వరకు పోదని తెలిపారు. చర్మంపైన ఉన్నది పోయినా గోరుపై ఉన్నది పోదన్నారు. ముందుగానే ఎడమ చేతి చూపుడువేలుపై సిరా వేస్తున్నట్టుగా వాట్సాప్‌లలో ప్రచారం జరుగుతోందని, ఎవరైనా ఇంకు మార్కుతో పోలింగ్ కేంద్రానికి వస్తే.. కచ్చితంగా అది తప్పిదం అవుతుందన్నారు. అలాంటిది ఎవరి దృష్టికైనా వస్తే తక్షణం మా దృష్టికి తీసుకు రావాలని ఆదేశించామన్నారు. అలాంటి వారిపైనా, బాధ్యులైన వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొబైల్ ఫోన్లు తీసుకురావొద్దు

పోలింగ్ కేంద్రానికి మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని ఢిల్లీరావు తెలిపారు. తెచ్చినా సెక్యూరిటీ సిబ్బంది ముందుగానే తీసుకుంటారన్నారు. వయస్సు మళ్లిన వారు, బాలింతలు, దివ్యాంగులు క్యూతో సంబంధం లేకుండా నేరుగా ఓటు వేయొచ్చన్నారు. ఓటు వేసే సమయంలో క్యూలో ఉన్న రద్దీని దృష్టిలో ఉంచుకుని మగవారు ఒకరు, ఆడవారు ఇద్దరు చొప్పున లోపలికి వెళ్లి ఓటేసే అవకాశమిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 16,86,000 మంది ఓటరు స్లిప్పులు పంచామని తెలిపారు. ఓటరు స్లిప్పులను జాగ్రత్త చేసుకోవాలన్నారు. ఓటరు స్లిప్ గుర్తింపు కార్డు కాదన్నారు. కేవలం పోలింగ్ సిబ్బందికి సమాచారం అందించటం కోసమేనని గుర్తుంచుకోవాలన్నారు.

రేషన్ కార్డు గుర్తింపుకార్డు కాదు

ఓటరు కార్డుతో పాటు ఓటేసే వారు ఐడెంటిటీ కార్డుగా ఆధార్ కార్డు కానీ, ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 డాక్యుమెంట్లలో ఏదైనా ఒకటి తీసుకువెళ్లాలని ఢిల్లీరావు సూచించారు. రేషన్ కార్డును గుర్తింపు కార్డుగా చూపించటానికి లేదన్నారు. రేషన్ కార్డును తీసుకెళ్లి పోలింగ్ సిబ్బందితో వాదులాటకు దిగొద్దన్నారు. ఓటరు కార్డును తీసుకువెళ్లాలన్నారు. కానీ, దానిని గుర్తింపు కార్డుగా చూపించటానికి వీలు లేదన్నారు. ఓటు మీ హక్కు అని అందరూ ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

మీ ఓటు ఎవరైనా వేస్తే.. టెండర్ ఓటేయండి

ఓటేయడంలో ఇబ్బందులు అధిగమించండిలా..

ఓటర్ స్లిప్ అందలేదా.. 1950కు ఎస్ఎంఎస్ చేయండి

- ఓటేయడానికి ఓటరు కార్డుతో పాటు ఏదో ఒక గుర్తింపు కార్డు తీసుకెళ్లండి..ఈసీ మార్గదర్శకాలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మీ ఓటు ఎంతో విలువైనది ఐదేళ్ల మీ తలరాతను నిర్ణయించే నిర్ణయాత్మక ఓటును మీరెంతో బాధ్యతగా వినియోగించుకోవటానికి పోలింగ్ కేంద్రానికి వెళతారు. మనం ఓటు వేయటానికి పోలింగ్ కేంద్రానికి వెళితే అంతకు ముందే ఎవరో ఒకరు వేసి ఉండొచ్చు. మన ఓటు ఎవరో వేశారని నిరాశతో బయటకు వచ్చేయకూడదు. దానిని మనం ప్రశ్నించవచ్చు. ప్రిసైడింగ్ అధికారిని కలిసి ఓటు కోల్పోయిన వ్యక్తిని తానేనని నిరూపించుకోవాలి. దీనికి ఓటరు ఐడీ కార్డు, పాస్‌పోర్టు, ఇతర ధ్రువీకరణ పత్రాలనున చూపాలి. ప్రిసైడింగ్ అధికారి అప్పుడు ఫామ్-17(బీ) ఇస్తారు. ఫామ్ పూర్తి చేసి పీవోకు ఇవ్వాలి. అప్పుడు టెండర్ బ్యాలెట్ పేపర్‌ను ప్రిసైడింగ్ అధికారి మీకిస్తారు. ఆ బ్యాలెట్‌పై రహస్య ఓటింగ్ వేసి ప్రిసైడింగ్ అధికారికి ఇవ్వాలి. ప్రత్యేకంగా దానిని కవర్‌లో ఉంచి సీల్ వేస్తారు. ఆ తర్వాత కౌంటింగ్ కేంద్రానికి పంపుతారు.

పావుగంటలో ఓటర్ స్లిప్

ప్రతి ఓటరుకూ ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల యంత్రాంగం ఓటరు స్లిప్‌ను స్థానిక బీఎల్వోల ద్వారా పంపిణీ చేసింది. దాదాపుగా ఓటర్లందరికీ ఇప్పటికే ఓటర్లు స్లిప్పులు ఇచ్చేశారు. ఒకవేళ ఏదైనా కారణాలతో ఓటరు స్లిప్పులు రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీకు సెకనులో బూత్ స్లిప్ వస్తుంది. అదెలాగో చూడండి. మీరు మీ మొబైల్ ద్వారా 1950 నెంబర్‌కు ఎస్ఎంఎస్ చేస్తే మీ బూత్ స్లిప్ వస్తుంది. దీని కోసం మీ మొబైల్ నుంచి ఇంగ్లీషులో ఈసీఐ అని టైప్ చేసి.. స్పేస్ ఇచ్చి మీ ఓటరు ఐడీ నెంబర్‌ను ఎంటర్ చేసి 1950 నెంబర్‌కు ఎస్ఎంఎస్ చేయాలి. పదిహేను నిమిషాల్లో మీకు ఓటరు స్లిప్ మీ ఫోన్‌లోకి వచ్చేస్తుంది. స్లిప్‌లో మీ పేరు, పార్ట్ నెంబర్, మీ పోలింగ్ బూత్ నెంబర్, మీ ఓటు సీరియల్ నెంబర్ వంటి వివరాలు ఉంటాయి.



12 రకాల గుర్తింపు కార్డులకు అనుమతి



పోలింగ్ కేంద్రానికి వెళ్లే ముందు ఓటరు కార్డుతో తప్పనిసరిగా మీ ఐడెంటిటీ తెలిపే ఏదైనా ఒక కార్డును తప్పనిసరిగా తీసుకు వెళ్లాల్సిందే. ఎన్నికల సంఘం 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకెళ్లవచ్చని సూచించింది. 1.ఆధార్ కార్డు, 2.పాన్‌కార్డు, 3.అంగవైకల్య ధ్రువీకరణ కార్డు, 4.సర్వీసు ఐడీ కార్డు (మీ కంపెనీ ఇచ్చే కార్డు), 5. ఫొటోతో కూడిన బ్యాంకు పాస్‌బుక్, 6.హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, 7.డ్రైవింగ్ లైసెన్స్, 8.పాస్‌పోర్టు, 9. నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌పీఆర్) ఇచ్చిన కార్డు, 10.పెన్షన్ కార్డు, 11.ఎంపీ/ఎంఎల్ఏ/ఎంఎల్సీ కార్డు, 12. ఉపాధిహామీ జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో ఏదో ఒకటి మీ ఓటరు కార్డుతో పాటు తప్పనిసరిగా తీసుకు వెళ్లాల్సి ఉంటుంది.



ఓటేశాక వీవీ ప్యాట్‌లో ఏ సింబల్ వస్తుందో స్లిప్ చూడండి

పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు ఉంటాయి. ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో ఓటరు ఓటు హక్కును వినియోగించుకుంటారు. నచ్చిన అభ్యర్థి ఎన్నికల గుర్తు పక్కనే ఉన్న బటన్ నొక్కిన తర్వాత .. పక్కనే ఉన్న వీవీ ప్యాట్ మీద ఒక్కసారి కన్నేయాలి. ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో బటన్ నొక్కగానే వీవీప్యాట్‌లో ఓటు వేసిన అభ్యర్థి సింబల్ గుర్తు ప్రింట్ అయి కనిపిస్తుంది. ఆ వెం టనే కింద ఉన్న బాక్సులో పడిపోతుంది. ఓటు ఎంతో విలువైనది కాబట్టి .. ఏ గుర్తుపైన నొక్కారో అదే వచ్చిందో లేదో ఒకసారి చెక్ చేసుకోవటానికి ఇది ఉపయోగపడుతుంది.

నేడు కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

పటమట: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం వ్యాపారం, వాణిజ్యం, పారిశ్రామిక, ఇతర సంస్థల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని యాజమాన్యాలను విజయవాడ ఉపకార్మిక కమిషనర్ సీహెచ్ ఆశారాణి ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ఉత్తర్వులను ఉల్లంఘించిన వారికి జరిమానాలతో కూడిన శిక్ష ఉంటుందని ఆమె హెచ్చరించారు.

ఆటోను ఢీకొన్న బోర్‌వెల్ వాహనం

వృద్ధురాలి దుర్మరణం..మరో నలుగురికి గాయాలు



మృతురాలు తునికిపాటి సీతమ్మ(ఫైల్)

జగ్గయ్యపేట రూరల్, మే 12: జాతీయ రహదారిపై మండలంలోని అనుమంచిపల్లి వద్ద ఆటోను వెనుకగా వస్తున్న బోర్ వెల్ వాహనం ఢీకొన్న ఘటనలో పెనుగంచిప్రోలుకు చెందిన తునికిపాటి సీతమ్మ(60) మృతిచెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సీతమ్మ తమ కుటుంబసభ్యులు వైకుంఠాచారి, శ్రీనివాసాచారి, నాగమణి, సంధ్య తదితరులతో కలిసి కోదాడ మండలంలోని యర్రవరం గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి ఆటోలో బయలుదేరారు. అనుమంచిపల్లి వద్ద అదే మార్గంలో వారి వెనుక వేగంగా వచ్చిన బోర్‌వెల్ లారీ ఆటోను ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన సీతమ్మతో పాటు కుటుంబ సభ్యులను జగ్గయ్యపేటకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మిగిలిన వారికి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడకు తరలించారు. ఘటనకు సంబంధించి చిల్లకల్లు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పుట్టెడు దుఃఖంలో కుమారులు

మాతృ దినోత్సవం రోజునే తల్లి మృతి చెందటంతో కుమారులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామి దర్శనానికి వెళ్లి వచ్చేందుకు వెళ్తున్న తమ కుటుంబంలో తీరని విషాదం నెలకొందని కుమారులు వాపోతున్నారు. గ్రామంలోనే తన తండ్రి బ్రహ్మచారి గతంలో ఆదివారం రోజునే మృతి చెందటం ఇప్పుడు కూడా తమ తల్లి సీతమ్మ సైతం ఆదివారం రోజునే మృతి చెందిందని కుమారులు ఆవేదన వ్యక్తం చేశారు.

కంచికచర్ల మాజీ సర్పంచ్ గద్దె ప్రసాద్ కన్నుమూత



గద్దె ప్రసాద్ (ఫైల్)

కంచికచర్ల రూరల్/ జగ్గయ్యపేట రూరల్, మే 12: కంచికచర్ల మాజీ సర్పంచ్, ముక్త్యాల కోటి లింగాల హర హర మహాక్షేత్రం, కంచికచర్ల శివ సాయి క్షేత్రం వ్యవస్థాపకుడు గద్దె ప్రసాద్(62) ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో తుదిశ్వాస విడిశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కంచికచర్ల పీఏసీఎస్ అధ్యక్షుడిగా, గ్రామ సర్పంచ్‌గా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి పలువురికి జీవనోపాధికి కల్పించారు. జగ్గయ్యపేటలో పీఐటీఎస్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటులో క్రియాశీలక భూమిక పోషించారు. ఎన్నో దేవాలయాలకు భూరి విరాళాలు అందించారు. అన్నదానాలు చేశారు. ఆయన తల్లి గద్దె సరస్వతి కంచికచర్ల సర్పంచ్‌గా పని చేశారు. గద్దె ప్రసాద్ భౌతికకాయాన్ని మాజీ ఎంపీపీ మల్లెల పుల్లయ్యబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కోగంటి బాబు, అల్లడి కోటేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. జగ్గయ్యపేట ప్రాంతంలోనూ గద్దె ప్రసాద్ మృతి విషాదాన్ని నింపింది. మాజీ మంత్రి నెట్టెం రఘురాం, టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తదితరులు సంతాపం తెలిపారు.

అమరావతిలో నిర్మాణాలు కొనసాగించాలి

- వేదిక అధ్యక్షుడు తన్నీరు వెంకటేశ్వర్లు

ధర్నాచౌక్, మే 12: ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని, అమరావతిలో నిర్మాణాలను కొనసాగించాలని, అమరావతి రైతులకు తక్షణమే కౌలు చెల్లించాలని వేదిక అధ్యక్షుడు తన్నీరు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. అమరావతి బాధిత రైతాంగ పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈనెల 9న మందడం గ్రామంలో బాధిత రైతుల "గర్జన" సభ విజయవంతంగా నిర్వహించామన్నారు. విభజిత రాష్ట్రానికి రాజధాని కోసం తాను 20 ఎకరాలు ఆనాటి ప్రభుత్వంపై నమ్మకంతో ఇచ్చానని అమరావతి రైతు ఆలేరు కోటేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో రాబోయే ప్రభుత్వం అమరావతిని అభివృద్ధి చేయాలని, చనిపోయిన 270 మంది రైతు కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేత దానా గౌడ్ పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యవసాయ కూలీ మృతి

పెదపారుపూడి: తాటిచెట్టు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి వ్యవసాయ కూలీ మృతిచెందాడు. వానపాములకు చెందిన పాటూరి నాగేశ్వరరావు(44) పనులు లేని వేసవిలో తాటికాయలు కోసి ముంజలు అమ్మి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం జువ్వనపూడి సమీపంలో తాటిచెట్టు ఎక్కికాయలు కోస్తుండగా జారి నేలపై పడ్డాడు. బలమైన గాయాలు కావటంతో గుడివాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఏఎస్సై దుర్గారావు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

పేదలకు అన్నదానం

అజిత్‌సింగ్‌నగర్, మే 12 : కళ్లే లలిత జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ప్రతి నెల 12వ తేదీన పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సింగ్‌నగర్‌లోని కళ్లే లలిత వీధిలో ఆదివారం పేదలకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కళ్లే నాగేశ్వరరావు, ముప్పూరి హరీష్, ఎం. జశ్విన్, జి. ధ్రువన్, స్థానికులు ఆమెకు నివాళులు అర్పించారు.



ఓట్ల తికమక

• ఒక డివిజన్ ఓటరు వేరే డివిజన్ బూత్‌లో..
• గందరగోళంలో ఓటర్లు

భవానీపురం, మే 12 : ఓటర్ల జాబితాల్లో పలుసార్లు మార్పులు చేసినా కుటుంబం అంతా ఒకే పోలింగ్ కేంద్రంలోని బూత్‌ల్లో వేసే పరిస్థితులు లేకుండా పోయాయి. 44వ డివిజన్ చెరువు సెంటర్‌ని నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ఓటు 45వ డివిజన్‌లోని ఉర్దూ కాలేజీలోకి వెళ్లింది. ఇక్కడ చాలామంది ఓట్లు ఉర్దూ కాలేజీలోకి చేరాయి. సమీపంలోని చెరువు సెంటర్‌లోని ఆర్టీసీ ట్రైనింగ్ సెంటర్ కేంద్రంలో బూత్‌ల్లోకి ఈ ఓట్లు చేరాల్సి ఉంది. 39 డివిజన్‌లో భార్యాభర్తలు ఓట్లు ఒకే డివిజన్ రాగా, కుమార్తె ఓటు వేరే పోలింగ్ కేంద్రంలోకి వచ్చింది. 44వ డివిజన్ ఎరుకుల బజార్‌లో ఉండే జోజి అనే వ్యక్తి ఓటు 56 బూత్‌లోకి రాకుండా 52వ పోలింగ్ బూత్‌లోని గుప్తాసెంటర్‌లోకి వెళ్లింది. సమీపంలోనే పోలింగ్ కేంద్రం మాలెంపాటి భాస్కరావు ఎలిమెంటరీ స్కూల్ ఉండగా రెండో కిలోమీటర్లు దూరంలో ఆయన ఓటు చేరింది. ఇలా సమీప కేంద్రాల్లోకి ఓటర్లు పేర్లులేకపోవడంతో వారు కొంత తికమక పడుతున్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ప్రతిసారి ఓటు వేసే ప్రాంతాల్లోని బూత్‌ల్లో వారి ఓట్ల లేకపోవడంతో కొంత ఆందోళన వ్యక్తం అవుతోంది.


కబేళా ఉర్దూ కాలేజీలో పోలింగ్ కేంద్రాల వద్ద వేసిన టెంట్లు

బాహాటంగానే పంపిణీలు

విద్యాధరపురంలోని చెరువుసెంటర్, కుమ్మరిపాలెం, నాగేంద్రస్వామి గుడి, నాలుగు స్తంభాల సెంటర్లలో శనివారం సాయంత్రం నుంచి ఓటర్లకు ప్రలోభాల ఎరగా నోట్లు పంచుతున్నా అడ్డుకోనే వారు కరువయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఆచూకి కరువైంది. భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది వాహనాల్లో వచ్చి విజిల్స్ వేస్తూ ఈ బృందాలను చెదరగొట్టారు.

మేముసైతం దేశం కోసం

అవగాహన సదస్సుకు ఉత్సాహంగా హాజరైన ఎన్‌సీసీ కేడెట్లు


అవగాహనా సదస్సులో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లు

పటమట, మే 12 : సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మేము సైతం అంటూ దేశం కోసం అంటూ ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రభుత్వం నిర్వహించే అవగాహన సదస్సుకు ఉత్సాహంగా హాజరయ్యారు. కాకినాడ గ్రూప్‌నకు చెందిన ఎన్‌సీసీ ఆర్మీవింగ్, నేవల్ వింగ్, ఎయిర్ వింగ్ ఇతర విభాగాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు, 4 ఆంధ్ర గర్ల్స్ బెటాలి యన్స్‌కు చెందిన వివిధ కళాశాలలకు చెందిన కేడెట్లు విజయవాడ పోలీస్ గ్రౌండ్‌లో అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడంలో ప్రజలకు సహాయ పడటం, వృద్ధులు, వికలాంగులకు సేవలు అందించడం కోసం తాము ఇక్కడకు వచ్చామని, ఎన్నికల విధులు నిర్వహించడం గర్వంగా ఉందని, దేశ సేవలో తాము కూడా పాల్గొంటున్నందుకు ఆనందంగా ఉందని ఎన్‌సీసీ కేడెట్లు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

దైవదర్శనం చేసుకున్న సుజనా చౌదరి


దర్గాలో ప్రార్థనలు నిర్వహించిన సుజనా చౌదరి, పక్కన నాగుల్‌మీరా

వన్‌టౌన్, మే 12: పశ్చిమ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుజనా చౌదరి గత 45 రోజులుగా అవిశ్రాంతంగా ప్రచార కార్యక్రమంలో పాల్గొని పోలింగ్‌కు ముందురోజున ఆదివారం హిందూ, ముస్లిం, క్రైస్తవ దైవాల ఆశీస్సులను తీసుకున్నారు. తొలుత ఆయన ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారి ఆలయాన్ని బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, ఫైలా సోమినాయుడు తదితరులతో కలిసి దర్శించుకున్నారు. దుర్గమ్మవారి దర్శనానంతరం ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆయనకు వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. వించిపేటలోని సీఎస్ఐ సెయింట్ జాన్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడ పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి సుజనా చౌదరికి ఏసుక్రీస్తు ఆశీస్సులు ఉంటాయని తప్పక విజయం సాధిస్తారని పేర్కొన్నారు. పంజాసెంటర్‌లోని లోటేచోటే మస్తాన్ వలీ దర్గాను దర్శించుకున్నారు. అక్కడ నాగుల్‌మీరాతో కలిసి ప్రార్థనలు చేశారు. బాబు మౌలానా దువా నిర్వహించి ఆయనకు ఆశీస్సులు అందజేశారు. అడ్డూరి శ్రీరామ్, పేటేటి రాజమోహన్, రౌతు రమ్యప్రియ, లింగాల అనీల్‌కుమార్, షేక్ మోబీనా ఉన్నారు.

ఇండియన్ ఆయిల్ పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో

ఘనంగా మాతృదినోత్సవం


మాతృమూర్తులతో కేక్ కట్ చేయిస్తున్న సంస్థ ప్రతినిధులు

లబ్బీపేట, మే 12: బందర్‌రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో ఆదివారం మాతృదినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొని కేక్ కట్‌చేసి మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి అమ్మ తమ పిల్లలకు మొదటి గురువని, ప్రతి తల్లి తమ వంతు పాత్ర పోషించినట్లయితే మానవజాతికి మేలు జరిగినట్లేనని అన్నారు. ఈ సందర్భంగా బంక్‌కు వచ్చిన మాతృమూర్తులకు పుష్పగుచ్ఛాలు అందజేయడంతో పాటు బహుమతులు అందజేశారు. జిల్లా ఐవోసీఎల్ సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్, చీఫ్ డివిజనల్ రిటైర్డ్ హెడ్ అనిల్, మేనేజర్ కె.వెంకటప్పయ్య పాల్గొన్నారు.

సాయి మందిరంలో శివసప్తాహం

● మట్టి విగ్రహాల నిమజ్జనం


సాయి మందిరంలో శివసప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

గవర్నర్‌పేట, మే 12: లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీ షిర్డినాగసాయిబాబా-నాగమానసాదేవి మందిరంలో శివసప్తాహం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాశివుని, గణపతి, మహానంది మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి ఈనెల 4 నుంచి నిత్య పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం కావడంతో మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఆదివారం 108 లీటర్ల ఆవుపాలతో శివలింగానికి అభిషేకం, అన్నాభిషేకం, లక్షలాది పూలతో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మట్టి విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాన్ని వేడుకతో నిర్వహించారు.

పశ్చిమలో పోలింగ్‌కు సర్వంసిద్ధం

ఎన్నికల మెటీరియల్‌తో పోలింగ్ బూత్‌లకు చేరిన సిబ్బంది


పోలింగ్ నిర్వహణ మెటీరియల్ సేకరిస్తున్న పోలింగ్ అధికారులు

వన్‌టౌన్, మే 12: పశ్చిమ నియోజకవర్గంలో సోమవారం నాటి పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఆదివారం వన్‌టౌన్ గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల మెటీరియల్‌ను, ఈవీఎంలను బూత్‌ల వారీగా పంపిణీ చేశారు. పశ్చిమలో మొత్తం 253 పోలింగ్ బూత్‌లున్నాయి. ఒక్కో బూత్‌కు పోలింగ్ ఆఫీసర్, సహాయ పోలింగ్ ఆఫీసర్‌తో పాటు మరో నలుగురు సిబ్బందిని నియమించారు. వీరంతా మధ్యాహ్న సమయానికే పోలింగ్ మెటీరియల్‌ను సేకరించి వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లకు వెళ్లి అవసరమైన ఏర్పాట్లను చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు అవసరమైన నోటిఫికేషన్‌లు, అభ్యర్థుల జాబితాలు తదితరాలను బూత్‌ల వద్ద ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని మొత్తాన్ని పశ్చిమ రిటర్నింగ్ అధికారి కిరణ్మయి పర్యవేక్షణలో జరిగింది. కాగా పశ్చిమ నియోజకవర్గంలో 153 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఇందుకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి పరిశీలించారు.

● 34వ డివిజన్‌లో కేదారేశ్వరపేట, ఖుద్దూస్ నగర్ ప్రాంతాలు ఉన్నాయి. సెక్టార్ 23గా ఉన్న ఈ రూట్‌లో 7 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. కేదారేశ్వరపేటలోని రమా పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 247, 248 బూత్‌లకు సంబంధించిన ఓటర్లు తమ ఓట్లును ఉపయోగించుకుంటారు. కేదారేశ్వర పేటలోని లక్ష్మణ దత్తు నగరపాలకసంస్థ స్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 249, 250, 251, 252, 253 బూత్‌లకు సంబంధించిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు.

● 35వ డివిజన్‌లో పూర్ణానందంపేట, బాప్టిస్టనగర్, పెజ్జోనిపేట, ఆర్టీపేట, బొగ్గులైన్ క్వార్టర్స్ ప్రాంతాలు ఉంటాయి. సెక్టార్ 23గా ఉన్న ఈ రూట్‌లో 20 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. డివిజన్‌లోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న జాక్ అండ్ జిల్ స్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 227, 228, 229, 230, 231, 232, 233, 234 బూత్‌లకు సంబంధించిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటారు. పూర్ణానందం పేటలోని నగరపాలకసంస్థ ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 235, 236 బూత్‌లకు సంబంధిం చిన ఓటర్లు తమ ఓట్లును ఉపయోగించు కుంటారు. శ్రీ కౌతా సుబ్బారావు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 237, 238, 239, 240 బూత్‌లకు సంబంధించిన ఓటర్లు తమ హక్కును వినియోగించుకుంటారు. బాప్టిస్ట్ నగర్‌లో ఉన్న బాప్టిస్ట్‌పాలెం నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 241, 242 బూత్‌లకు సంబంధించిన ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించు కుంటారు. పెజ్జోనిపేట ఆర్‌సీఎం స్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 243, 244, 245, 246 బూత్‌లకు సంబంధించిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కుంటారు.

● 55వ డివిజన్‌లో వించిపేట, నైజాంగేటు ప్రాంతాలు ఉన్నాయి. సెక్టార్ 20గా ఉన్న ఈ రూట్‌లో 10 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. డివిజన్‌లోని గాంధీబొమ్మ సమీపంలో ఉన్న నగరపాలక సంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో 207, 208, 209, 210, 211 బూత్‌లకు సంబంధించిన ఓటర్లు తమ ఓట్లును వినియోగించుకుంటారు. ఎర్రకట్ట సమీపం లో ఉన్న మోతుకూరి హనుమంతరావు నగరపాలకసంస్థ స్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 212 బూత్‌కు సంబంధించిన ఓటర్లు, వించిపేటలోని సీఎస్ఐ చర్చి సమీపంలోని గద్దె రామ్మో హనరావు కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 213 బూత్‌కు సంబంధించిన ఓటర్లు , గాంధీబొమ్మ దగ్గర ఉన్న సయ్యద్ నూరుద్దీన్ నగరపాలకసంస్థ స్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 214, 215, 216 బూత్‌లకు సంబంధించిన ఓటర్లు తమ ఓట్లును ఉపయోగించుకుంటారు.

● 56వ డివిజన్‌లో పాతరాజరాజేశ్వరి పేట, కంసాలి పేట ప్రాంతాలు ఉన్నాయి. సెక్టార్ 21గా ఉన్న ఈ రూట్‌లో 10 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. డివిజన్‌లోని పాతరాజరాజేశ్వరి పేటలో ఉన్న నగరపాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 217, 218, 219, 220 బూత్‌లకు సంబంధించిన ఓటర్లు తమ ఓట్లును ఉపయోగించుకుంటారు. ఉర్దూ స్కూలు ప్రక్కనే ఉన్న శానిటేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 221 బూత్‌కు సంబంధించిన ఓటర్లు తమ ఓట్లును వినియోగించు కుంటారు. కంసాలిపేటలోని తమ్మిన పోతరాజు నగరపాలకసంస్థ స్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 222, 223, 224, 225, 226 బూత్‌లకు సంబంధించిన ఓటర్లు తమ ఓట్లును వినియోగించుకుంటారు.

పోలింగ్ కేంద్రాలు సిద్ధం

పాతరాజరాజేశ్వరి పేట: నేడు జరగ నున్న ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. రద్దీ దృష్ట్యా క్యూలైన్ ఏర్పాటు, ఎండల దృష్ట్యా టెంట్‌లు, మంచినీటి వసతిని ఏర్పాటు చేశారు. ఆదివారం నాడే చేరుకున్న ఎన్నికల సిబ్బంది తమ తమ పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసుకున్నారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా వారి సమయం వృధా కాకుండా వచ్చిన వెంటనే తమ ఓటును వినియోగించుకునేలా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇక పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండటంతో పోలీసులు గస్తీల ముమ్మరం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పారా మిలటరీ బలగాలను కూడా రంగంలోకి దించారు.


బాప్టిస్ట్‌పాలెం నగరపాలక సంస్థ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు


వేదఘోష నిర్వహించిన వేదపండితులు, భారతీ మహాస్వామికి ప్రసాదం సమర్పిస్తున్న ఈవో దంపతులు, అర్చకులు, ఆదిశంకరాచార్యుల వేషధారణలో చిన్నారులు

దుర్గగుడిలో ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

వన్‌టౌన్, మే 12: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఆదివారం ఆదిశంకరాచార్యుల వారి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదిశంకరాచార్యుల ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం శంకరపూజ, యతివందన కార్యక్రమాలను నిర్వహించారు. చింతపల్లి ఆంజనేయ ఘనాపాటి, పురాణ పండితుడు చింతపాటి వెంకటేశ్వరశర్మలు ఆదిశంకరాచార్యుల వారి వైశిష్ట్యాన్ని వ్యాఖ్యాన రూపంలో వివరించారు. ఈవో కేఎస్ రామారావు దంపతులు, స్థానాచార్యుడు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, వేద విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు వేద ఘోషను వినిపించారు. ఈ సందర్భంగా గుంటూరు శృంగేరీ విరూపాక్ష శ్రీ పీఠం, శ్రీసదనం నుంచి గంభీరానంద భారతీ మహాస్వామి ఆలయానికి విచ్చేసి శంకరాచార్యుల జయంతి కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఈవో దంపతులు, అర్చకులు ఆయనకు యతీశ్వరపూజ, పాదపూజ నిర్వహించి పండ్లు, వస్త్రాలు అందజేశారు. అనంతరం ఆయన అనుగ్రహభాషణం చేశారు. వేదపండితులు వేదస్వస్తి పలికారు.

అన్నవితరణకు విరాళం

దుర్గగుడి ప్రతిరోజూ నిర్వహించే అన్నవితరణకు గుడివాడ రాజేంద్రనగర్‌కు చెందిన నల్లమోతు శ్యామలదేవి కుటుంబసభ్యులు లక్ష రూపాయల విరాళాన్ని దేవస్థానానికి అందజేశారు. అమ్మవారి దర్శనా నంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం,ఆశీస్సులు అందజేశారు.

నగరోత్సవం

ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఆదివారం భక్తి విశేషతతో కూడిన ఆదిశంకరుల ఉత్సవమూర్తితో నగరోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నగరోత్సవానికి ముందు పలువురు బాలలు కాషాయ వస్త్రధారణతో దండాన్ని చేతిలో పట్టుకుని ఆదిశంకరుల వేషాలను ధరించి ముందు నడిచారు. వారి ఆహార్యం చూపరులను ఆకట్టుకుంది. ఈవో కేఎస్ రామారావు, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపథం వేదికపై నృత్యప్రదర్శన

ధర్మపథం వేదికపై ఆదిశంకరుల వైభవాన్ని చాటిచెబుతూ విజయవాడకు చెందిన నటరాజ నృత్యాలయం నాట్యాచార్యులు రాయన శ్రీనివాసరావు శిష్యబృందం నృత్యప్రదర్శనలు ఇచ్చింది. అలరింపు, వినాయకకౌతు, దశావతారాలు, సంధ్యాసమయం, తిల్లానా తదితర అంశాలపై ప్రదర్శన సాగింది.

ప్రలోభాలకు తెర

గన్నవరం, మే 12 : మండలంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రలోభా లకు తెరలేపారు. శనివారం అర్ధరాత్రి నుంచి గ్రామాల్లో ఎన్నికల పండగ వాతా వరణం నెలకొంది. మద్యం, నగదు భారీ ఎత్తున పంపిణీ జరుగుతున్నట్లు, ఓటుకు రూ.3వేలు నుంచి రూ.5వేల వరకూ పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తుంది. మండలంలో 74,382 మంది ఓటర్లుకుగాను 80 శాతం మందికి నగదు పంపిణీ చేస్తున్నట్లు ప్రధాన పార్టీల నాయకులు అంటున్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

వన్‌టౌన్, మే 12: విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో శనివారం రాత్రి బస్ ఢీకొని తీవ్రంగా గాయపడిన కృష్ణా జిల్లా నందమూరుకు చెందిన శింగవరపు ప్రసన్న రాజు (69) చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్యామ్‌బాబు ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రసన్నరాజు విజయవాడ హనుమాన్‌పేటలోని ఒక చెప్పుల దుకాణంలో పనిచేస్తుంటాడు. ప్రతి రోజూ ఉదయం వచ్చి రాత్రికి తిరిగి బస్సులో వెళతాడు. ఇదే క్రమంలో శనివారం కూడా తన డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు బస్టేషన్ వద్దకు వచ్చాడు. 41 వ ప్లాట్‌ఫారంపైకి వచ్చిన బస్సు ఎక్కుతుండగా పక్కన ప్లాట్‌ఫారం వద్దకు వస్తున్న బస్సు అతనిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

త్యాగానికి ప్రతీక నర్సులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 12 : ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అనారోగ్యంతో బాధపడేవారికి సేవలందించే త్యాగధనులు నర్సులేనని పీహెచ్‌సీ వైద్యాధికారి వై. కిరణ్మయి అన్నారు. వీరవల్లి పీహెచ్‌సీ ఆవరణలో ఆదివారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవ సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సైతం భయపడే ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలందించడమే త్యాగానికి ప్రతీకన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించిన నర్సు లను స్మరించుకుంటూ వారి త్యాగాల స్ఫూర్తితో ప్రజలకు సేవలందించా లని డాక్టర్ కిరణ్మయి సూచించారు.

వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో, నర్సులు చేసే సేవ కూడా అంతే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో యూడీసీ సురేంద్ర, పీహెచ్ఎన్ సౌధామణి, ఎంపీహెచ్‌ఓ మూర్తి, ప్రదీప్‌సన్, మంగ తాయారు, పండు, ఏఎన్ఎంలు, నర్సులు పాల్గొన్నారు.


విజేతలతో నిర్వాహకులు, ముఖ్య అతిథులు

ఓపెన్ చెస్ విజేతలు వీరే

విజయవాడ స్పోర్ట్స్, మే 12 : స్థానిక గ్రీన్ స్కూల్లో కృష్ణా జిల్లా ఓపెన్, ఉమెన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఓపెన్ క్యాటగిరిలో రుషిల్ సాయి, జీవితేష్, జగదీష్‌బాబు, ఎస్. రోహన్‌లు తొలి నాలుగు స్థానాలు సాధించారు. ఉమెన్ క్యాటగిరిలో నవ్య సాహితి, పి.గీతిక, ఏ. అక్షయ,ఎం. నాగశుభ శ్రీలు వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచారు. విజేతలంతా ఈ నెల 31న రాజమండ్రిలో జరిగే ఏపీ స్టేట్ చెస్ టోర్నీకి కృష్ణా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎన్ఎం. ఫణికుమార్ తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ కె. ఈశ్వరి, కె. శ్వేత, కె. శ్రావణిలు పాల్గొని అందజేశారు.

ధనేకులలో ప్రాంగణ ఎంపికలు

పెనమలూరు, మే 12 : గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ ఈ నెల 10న నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో డిప్లొమా చివరి సంవత్సరం చదువుతున్న 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, కార్యదర్శి ధనేకుల భవా నీ ప్రసాద్, హేమ తదితరులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ధనేకుల కళాశాల యాజమాన్యం



గడ్డం గ్యాంగ్..

విధ్వంసం!

ఆర్భాటం ఎక్కువ.. చేసింది తక్కువ

అభివృద్ధికి ఆమడదూరంలో గుడివాడ నియోజకవర్గం

గుడివాడ: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని చెప్పే మాటలు మాత్రం కోటలు దాటతాయి. చేతలు మాత్రం గడప కూడా దాటవు. ఎవరు అభివృద్ధి చేసినా, నిధులు తెచ్చినా తానే తెచ్చినట్టు బిల్డప్ ఇవ్వడంతో దిట్ట. టీడీపీ హయాంలో వచ్చిన నిధుల వినియోగంలోనూ విఫలమయ్యారు. ఐదేళ్లలో నియోజకవర్గం పూర్తిగా వెనుకబడింది. అభివృద్ధి మాట దేవుడెరుగు. విధ్వంసం మాత్రం బాగా జరిగింది. ఏ పనీ చేసిన దాఖలాలు లేవు. నిర్మాణంలో ఉన్నవాటిని సైతం ఆపేశారు. నాడు-నేడుతో పాఠశాలల దశ మారుతుందని బాకాలు ఊదారు. పట్టణంలోని పార్కు స్కూల్, ఏకేటీపీ బాలికోన్నత పాఠశాలల నిర్మాణాలకు శ్లాబ్ వేసి వదలడంతో అటుగా వెళ్లేవారిని మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి. వానపడితే బస్టాండ్ అసలు రంగు బయటపడుతుంది. ఒక చిన్నపాటి చెరువునే తలపిస్తుంది. చంద్రబాబు హయాంలో నిర్మాణం ప్రారంభమైన ముస్లిం షాదీఖానాను అధికారంలోకి రాగానే అకారణంగా నిలిపేశారు. కొత్త బైపాస్ రోడ్డులో ప్రయాణించాలంటే ధైర్యం ఉండాలి. సర్కస్ ఫీట్లు చేయాలి.

గత ప్రభుత్వ హయాంలో పేదల కోసం కట్టించిన కమ్యూనిటీ భవనాలను నిర్వీర్యం చేశారు. వాటిలో సచివాలయాలను ఏర్పాటు చేశారు. పట్టణానికి మంచినీటిని అందించే చిన్నచెరువుకట్ట కోతకు గురై మూడేళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేయించలేదు. నేటికీ పట్టణవాసులకు మురుగునీరు సరఫరా అవుతూనే ఉంది. పట్టణ శివారు ప్రాంత కాలనీవాసులు నీటికి కటకటలాడుతున్నారు. ఇప్పటికీ వీరికి ట్యాంకర్ల నీరే దిక్కు. టిడ్కో నిర్వాసితులు పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మంచినీటి కోసం తహతహలాడుతున్నారు. కనీస మౌలిక వసతుల కల్పన విఫలమయ్యారు. గ్రామాలోని రక్షిత మంచినీటి పథకాలు నిధులు లేక మూలన పడ్డాయి. ప్రజలకు పచ్చరంగు నీరే దిక్కైంది. గ్రామాల్లో అంతర్గత రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోలేదు. రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. సకాలంలో పంటకాలువల ద్వారా నీరు రాక, వర్షాలకు మురుగునీరు పోక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడా కాలువలు, డ్రెయిన్‌లను తవ్వించినా దాఖలాలు లేవు. పేదలకిచ్చిన సెంటు స్థలాలు చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతున్నాయి. రోజులు తరబడి నీరు నిల్వ ఉండిపోతోంది. కనీసం కచ్చా డ్రెయిన్ సదుపాయం కూడా లేదు. ఏకంగా వైసీపీ అధినేత జగన్ ఇచ్చిన హామీలో ఒకటైన దళిత శ్మశానవాటిక ఒక్క అడుగు ముందుకు పోలేదు.

అడుగడుగునా నిలదీతలు

మంత్రి అయితే నియోజకవర్గాన్ని రూ.1500కోట్లతో ఎన్నడూ చూడని, వినని విధంగా అభివృద్ధి చేస్తానని బాకాలు ఊదారు. ఆచరణలో 1శాతం నిధులను కూడా తీసుకురాలేక చతికిలపడ్డారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన నానికి నియోజకవర్గ ప్రజలు సమస్యలతో స్వాగతం పలికారు. గుడ్‌మెన్ పేట, యానాదుల కాలనీ, శ్రీకాళహస్తి కాలనీలో తాగునీటి కోసం, ధనియాలపేటలో రోడ్లు కావాలని నిలదీశారు. మౌలిక వసతులు కల్పనలో విఫలమవ్వడంతో టిడ్కో కాలనీలో కనీసం ప్రచారానికి కూడా వెళ్లలేదు. పట్టణ శివారు కాలనీల అభివృద్ధిని గాలికొ దిలేయడంతో అటువైపు కూడా నాని ప్రచారానికి వెళ్లలేని పరిస్థితి. గ్రామాల్లో తాగునీరు, సాగునీరు కోసం నిలదీస్తున్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని గ్రామస్థులు నిలదీసిన సందర్భాలు చాలా ఉన్నాయి.



బైపాస్ రోడ్డు దుస్థితి



టిడ్కో గృహ వాసుల నీటి కష్టాలు











చెరువును తలపిస్తున్న బస్టాండ్, నీట మునిగిన గుడివాడ జగనన్న కాలనీ, దుర్భర స్థితిలో ముస్లిం షాదీఖానా, మొండిగోడలతో ఉన్న పార్కు పాఠశాల



వైసీపీ నేతలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్థలం

దోపిడీకి కాదేదీ అనర్హం అన్న చందంగా వైసీపీ నేతలు బరితెగించారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య ధోరణి వీరికి కలిసివచ్చింది. ఈ ఐదేళ్లలో గుడివాడలో ప్రైవేట్ ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది. ఏకంగా వాటిని అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారు. - గుడివాడ

కన్నేశారు.. దోచేశారు..!

- ప్రజల ఆస్తులపై వైసీపీ నేతల పాగా..!
- ఏకంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని ● రైల్వే స్థలాలనూ వదల్లేదు
- రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యమే కారణం

గుడివాడ రెవెన్యూ పరిధిలోని ఆర్.ఎస్ నెం.448/2లో సుమారు రూ.10 కోట్ల విలువైన 69సెంట్ల స్థలాన్ని కరోనా సమయంలో అసలు ఆస్తిపరులైన కాకరాల వెంకట్రామయ్య, కాకరాల రవిశంకర్‌కు తెలియకుండా మార్కెట్ యార్డు చైర్మన్ మొండ్రు సునీత భర్త, నందివాడ మండలం రామాపురం మాజీ సర్పంచ్ మొండ్రు వెంకటేశ్వరరావు దర్జాగా తన కుమార్తెల పేరున అక్రమ రిజిస్ట్రేషన్ చేసేసుకున్నారు. అసలు హక్కుదారులైన తమకు తెలియకుండానే 69 సెంట్ల స్థలాన్ని దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కాకరాల సోదరులు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. న్యాయం కోసం వారు కోర్టు మెట్లు ఎక్కి పోరాడుతున్నారు.

* గుడివాడ రెవెన్యూ పరిధిలోని ఆర్.ఎస్ నెం.448/2లో రైల్వే రెండో లైనుకు సంబంధించి 8సెంట్ల స్థలాన్ని వైసీపీ నేతలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రైల్వే అధికారులు సైతం ఆశ్చర్యపోయారు.
* గుడివాడ పట్టణంలో ఉద్యోగరీత్యా చెన్నై వెళ్లిన ఓ కుటుంబ ఆస్తి ని వైసీపీ నేతలు కొట్టేశారు. అదే పేరుతో ఉన్న వ్యక్తిని తీసుకొవచ్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించి అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారు.
* పట్టణ శివారు ప్రాంతంలో ఆమెరికాలో ఉంటున్న వ్యక్తి ఆస్తిని వైసీపీ నేతలు అక్రమంగా అమ్మేశారు. విషయం తెలుసుకుని హక్కుదారులు అవాక్కయ్యారు.
* నందివాడ మండలం తమిరిశకు చెందిన గుమ్మడి చిట్టిబాబుకు చెందిన 6సెంట్ల స్థలాన్ని స్థానిక వైసీపీ నేతల వేరేవారి పేరున అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో చిట్టిబాబు తనకు జరిగిన అన్యాయాన్ని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, వీఆర్‌వో సంతకం సైతం ఫోర్జరీ చేసినట్టు నిర్ధారణైంది. వ్యవహారం ముదరడంతో వైసీపీ నేతలు రివర్స్ రిజిస్ట్రేషన్ చేయించి చేతులు దులుపుకున్నారు.
* నందివాడ మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కోటే జాన్ సుందరరావుకు చెందిన ఎకరం పొలాన్ని అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పాస్ పుస్తకానికి అర్జీ పెడుతున్నట్టు నమ్మబలికి రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నారని బాధితురాలు వారా శాంతకుమారి ఆరోపిస్తున్నారు. న్యాయం కోసం బాధితురాలు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. బయటపడినవే కొన్నే, బయటపడనివి పదుల సంఖ్యలో ఉంటాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



తన పొలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చూపుతున్న బాధితురాలు శాంతకుమారి

* పామర్రులో విశ్రాంత జిల్లా జడ్జి తమ్మా కోటమ్మరెడ్డికి పామర్రు పట్టణంలో ఆర్.ఎస్ నెం.64/3లో 46సెంట్ల స్థలం ఉంది. వైసీపీ అక్రమార్కుల కన్ను ఈ స్థలం పై పడింది. వెంటనే వీఆర్‌వో సహాయంతో వైసీపీ నేతలు హస్తగతం చేసుకున్నారు. దొంగ రిజిస్ట్రేషన్ చేయించడంలో గుడివాడ, పామర్రుకు చెందిన బ్లూ మీడియా ప్రతినిధులు కీలకపాత్ర పోషించారు.

ఓటే.. వజ్రాయుధం

రాష్ట్ర భవిష్యత్తు కోసం రూ.లక్షల ఖర్చుతో స్వగ్రామాలకు ప్రవాసీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కు. చాలామంది స్థానికంగా ఉన్నా ఈ హక్కును వినియోగంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేవి కావడంతో ప్రవాసాంధ్రులతో పాటు విదేశాల్లో చదువుకుంటున్న యువత ఈసారి కీలకంగా నిలవబోతున్నారు. నా ఒక్క ఓటు వేయకపోతే ఏమవుతుందిలే అనే భావన నుంచి నా ఓటే రేపటి భవిష్యత్తుకు బాటలు వేసే ఆయుధంగా భావిస్తూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు లక్షలాది రూపాయల ప్రయాణ ఖర్చులను సైతం లెక్కచేయక స్వగ్రామాలకు చేరుకున్నారు.

గ్రామీణ ప్రాంత ఓటర్లే ఆదర్శం

గత ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో 80 నుంచి 90 శాతం వరకూ ఓట్లు పోలయితే మండల కేంద్రమైన బాపులపాడులో కేవలం 76 శాతం మాత్రమే పోలయ్యాయి. కొత్తపల్లి, మల్లవల్లి లాంటి గ్రామాల్లో సాంకేతిక కారణాలతో ఓటింగ్ ఆలస్యమైనా రాత్రి వరకూ వేచి ఉండి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.



టెక్సాస్ నుంచి రేమల్లెకు..

'మేమిద్దరం టెక్సాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాం. ఓటు వేయడం కంటే ఏదీ ముఖ్యం కాదని మా అభిప్రాయం' అని రేమల్లెకు చెందిన ఎన్నారై చళ్లగుళ్ల రమేష్ బాబు దంపతులు తెలిపారు. మన రాష్ట్రాభివృద్ధికి, రేపటి తరం భవిష్యత్తుకు మనం ఎన్నుకునే పాలకులను నిర్ణయించే అధికారంతో ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు రూ.నిలక్షలు ఖర్చయినా స్వగ్రామానికి వచ్చామన్నారు. అంతేకాక ఓటుహక్కు వచ్చిన త రువాత మొదటిసారి సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హ క్కు వినియోగించుకోవడంపై యువత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫ్లోరిడాలో ఎంఎస్ చదువుకుంటూ తన ఓ టును వేసేందుకు వారు తమ స్వగ్రామమైన రంగన్నగూడెంకు చేరుకున్నారు. తాము చదువుకుంటున్న విశ్వవిద్యాలయంలో ఓటు హక్కు ఉండి వేయకపోతే పెద్దతప్పుగా భావిస్తామన్నారు. అందుకే తమ తల్లిదండ్రులను ఒప్పించి ఓటు వేసేందుకు వ్యయప్రయాసలకోర్చి వచ్చామన్నారు.

జననీ.. జన్మభూమిశ్చ..

మచిలీపట్నం టౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. జననీ జన్మభూమిశ్చ



స్వర్గాదపీ గరీయసీ అంటారు పెద్దలు. అమెరికాలో ఉంటున్న చిత్తజల్లు సాయి మోహన్, లక్ష్మీ ఓటు వేసేందుకు ఆదివారం బందరు వచ్చారు. రూ.ఐదారు లక్షలు ఖర్చు పెట్టి మరీ మచిలీపట్నానికి ఓటు వేసేందుకు వచ్చిన ఈ దంపతులు స్థానికులకు ఆదర్శంగా నిలిచారు. బందరు ప్రజలందరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని వారు పిలుపునిచ్చారు.

పవన్‌పై ప్రేమాభిమానాలతో..



అవనిగడ్డ రూరల్: నియోజకవర్గంలోని అశ్వారావుపాలెం గ్రామానికి చెందిన దాసినేని వంశీ పవన్‌కృష్ణ అమెరికాలో స్థిరపడ్డాడు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో జనసేన పార్టీ అభ్యర్థులు మండలి బుద్ధప్రసాద్, వల్లభనేని బాలశౌరిని గెలిపించుకునేందుకు ఖండంతరాలు దాటి సొంత గ్రామానికి వచ్చాడు. ఓటు హక్కును బాధ్యతగా గుర్తించి పవన్ కల్యాణ్‌పై ప్రేమాభిమానాలతో ఓటు వేసేందుకు రావటంతో పలువులు అభినందనలు తెలుపుతున్నారు.



పెడన: పట్టణంలోని 14వ వార్డుకు చెందిన ఉమ్మలేటి వెంకటేష్ జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు వీరాభిమాని. మస్కట్‌లో ఉద్యోగం చేస్తున్న వెంకటేష్ ఎన్నికల్లో జనసేన పార్టీ మద్దతుగా ప్రచారం చేసేందుకు 10 రోజుల క్రితం మస్కట్ నుంచి ఇక్కడకు వచ్చాడు. ప్రచారంలో పాల్గొంటున్న వెంకటేష్ సోమవారం జరిగే పోలింగ్‌లో జనసేన పార్టీకి ఓటు వేసి మంగళవారం బయలుదేరి మస్కట్ వెళతాడు. విలువలు కలిగిన ఆదర్శ నేత పవన్‌కల్యాణ్ ప్రజాజీవితంలోకి రావలసిన అవసరం ఎంతైనా ఉందని వెంకటేష్ వ్యాఖ్యానించారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటే మన పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేసినట్టే. మంచి పాలకులను ఎన్నునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తొలిఓటు వేస్తాం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఓటుహక్కు వినియోగించుకోనున్న యువ ఓటర్లు రికార్డు స్థాయిలో 43,054 మంది ఉన్నారు. వీరంతా తొలిసారిగా ఓటు వేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. యువతరం కదిలిరావాలి. అలా కావాలంటే ఓటు హక్కు రావాలి. అప్పుడే ఓటు వినియోగంతో పాటు సామాజిక బాధ్యత కూడా కలుగుతుంది. జిల్లా ఎన్నికల యంత్రాంగం యువ ఓటర్లను పెద్ద ఎత్తున చేర్పేందుకు ఎంతో కృషి చేసింది. ఫలితంగా ఈ ఎన్నికల్లో గణనీయ స్థాయిలో యువ ఓటర్లు మొదటిసారి తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తంగా 17,05,152 మంది ఓటర్లున్నారు. పురుషులు 8,30,499 మంది కాగా మహిళలు 8,73,427 మంది. వీరే కాకుండా ట్రాన్స్ జెండర్ ఓటర్లు మరో 151 మంది ఉన్నారు.

18-19 ఏళ్లలోపు ఓటర్లు..?

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా ఈసారి కొత్తగా ఓటు హక్కు సాధించిన 43,054 మంది నవ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. వీరిలో 23,127 మంది పురుష ఓటర్లు, 19,926 మంది మహిళా ఓటర్లున్నారు. థర్డ్ జెండర్ ఒక్కరున్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే తిరువూరు నియోజకవర్గంలో 5,110 మంది ఉన్నారు. పురుషులు 2,824 మంది కాగా మహిళలు 2286 మంది ఉన్నారు. విజయవాడ పశ్చిమలో 5,365 మంది ఉండగా పురుషులు 2870 మంది, మహిళలు 2495 మంది. విజయవాడ సెంట్రల్‌లో 6,825 మంది ఉండగా పురుషులు 3,535, మహిళలు 3,290 మంది ఉన్నారు. విజయవాడ తూర్పులో అత్యధికంగా 7,833 మంది ఉండగా పురుషులు 4,219 మంది, మహిళలు 3,613 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ఒక ట్రాన్స్ జెండర్ ఓటరు కూడా ఉన్నారు. నందిగామలో 5,321 మంది ఉండగా పురుషులు 2,938 మంది, మహిళలు 2,383 మంది ఉన్నారు. జగ్గయ్యపేటలో 5,861మంది యువ ఓటర్లు ఉండగా పురుషులు 3,224 మంది, మహిళలు 2637 మంది ఉన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 43,054 మంది యువతకు తొలిసారి ఓటు హక్కు

85 పైబడిన ఓటర్లు..

జిల్లావ్యాప్తంగా 85ఏళ్లు పైబడిన ఓటర్లు మొత్తం 9,342 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 4,133 కాగా, మహిళలు 5,208 మంది. థర్డ్ జెండర్ ఒక్కరున్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే తిరువూరులో 1,266 మంది ఓటర్లు, విజయవాడ పశ్చిమలో 1,270 మంది, సెంట్రల్‌లో 1,459 మంది, తూర్పులో 1,988 మంది, మైలవరంలో 1,334, నందిగామలో 1,101, జగ్గయ్యపేటలో 924 మంది ఓటర్లు ఉన్నారు.

సర్వీసు ఓటర్లు..

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తంగా 392 మంది సర్వీసు ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 358 మంది, మహిళలు 34 మంది ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే తిరువూరులో 49, విజయవాడ వెస్ట్‌లో 58, సెంట్రల్‌లో 72, తూర్పులో 70, మైలవరంలో 51, నందిగామలో 41, జగ్గయ్యపేటలో 51మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ప్రవాసీయులు..

ఈ ఎన్నికల్లో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 684 మంది ప్రవాసీయులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా చూస్తే తిరువూరులో 35 మంది, విజయవాడ వెస్ట్‌లో 81, సెంట్రల్‌లో 58, తూర్పులో అత్యధికంగా 300 మంది, మైలవరంలో 58 మంది, నందిగామలో 56 మంది, జగ్గయ్యపేటలో 96 మంది ప్రవాసీయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



యువకులు	23.127
యువతులు	19.926
థర్డ్ జెండర్	ఒకరు
80 పైబడినవారు	9.342
సర్వీసు ఓటర్లు	392
ప్రవాసీయులు	684



కాపవరంలో పిట్టగోడ మీద కూర్చుని ఓటర్లతో ముచ్చటిస్తున్న స్కందన్

ఓసారి తేడా చేస్తే.. మళ్లీ ఓటేయం

» ఏపీ ఎలక్షన్ వాచ్ ప్రతినిధితో కాపవరం ఓటర్లు

రాజమహేంద్రవరం, మే 12(ఆంధ్రజ్యోతి): 'ఓసారి తేడా చేసినోళ్లకు మళ్లీ ఓటేయం. ఒకసారి తెలియక ఓటేసినా... తిన్నగా నడుచుకోని వాళ్లను రెండో ఎన్నికల్లో ఓడిస్తుంటాం' అని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సమీప కాపవరంలోని ఓటర్లు తేల్చి చెప్పారు. ఏపీ ఎలక్షన్ వాచ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి స్కందన్ ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కాపవరం ఓటర్ల స్పందనపై ఆయన మాట్లాడుతూ ఓటర్లలో చైతన్యం మంచి పరిణామమన్నారు. రాజమండ్రి సిటీ, రూరల్, ధవళేశ్వరం, విజ్జేశ్వరం, నిడదవోలు, చాగల్లు, దొమ్మేరు, కొవ్వూరు, దేవరపల్లి, దుద్దుకుర్రు తదితర గ్రామాల్లో ఆయన ఓటర్లతో మాట్లాడారు. దీనిపై స్కందన్ స్పందిస్తూ ఓటును ఆయుధంగా ఉపయోగించే చైతన్యంరావడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు.

చంద్రబాబుపై దుష్ప్రచారం

» భార్గవ్‌రెడ్డిపై క్రిమినల్ కేసు పెట్టాలి.. సీఈవోకు టీడీపీ ఫిర్యాదు

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారంపై టీడీపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఓ చానల్ ఇంటర్వ్యూలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని చంద్రబాబు చెప్పినట్లు ఫేక్ వీడియో తయారు చేసి, వైసీపీ అధికారిక ఎక్స్ ఖాతాల్లో పోస్టు చేశారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆదివారం సీఈవోకు ఆయన లేఖ రాశారు. చంద్రబాబు మాటలను వక్రీకరించి, కులాల మధ్య విభేదాలు సృష్టించి, రాజకీయ లబ్ధి పొందటానికి వైసీపీ కుట్ర పన్నిందని ఫిర్యాదు చేశారు. వైసీపీ సోషల్ మీడియా హెడ్ సజ్జల భార్గవ్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. ఫేక్ వీడియోను ప్రసారం చేయకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా తిరుపతిలో ఓటర్లను ప్రలోభపెట్టి, వైసీపీకే ఓటేస్తామని దేవాలయంలో ప్రమాణం చేయించడంపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సీఈవోకు ఫిర్యాదు చేశారు. టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతన రామారావు, ఇతర సభ్యులు కొందరు ఓటర్లను ప్రలోభపెట్టి, కొర్లగుంట ఆంజనేయస్వామి ఆలయంలో బలవంతంగా ప్రమాణం చేయించారని సీఈవోకు లేఖ రాశారు. వైసీపీ నేత రామారావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు సీఈవోకు లేఖ రాశారు.

రిజర్వేషన్లపై వైసీపీ తప్పుడు ప్రచారం: దేవినేని ఉమా

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి ఓడిపోతున్నాడనే భయంతో వైసీపీ సోషల్ మీడియా టీడీపీ నేతలపై దుష్ప్రచారాలు చేస్తోందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'రిజర్వేషన్లు రద్దు చేస్తామని చంద్రబాబు చెప్పినట్లు ఫేక్ వీడియోలతో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. కులాల మధ్య విభేదాలు సృష్టించాలని ప్రయత్నిస్తోంది. చంద్రబాబు అనని మాటలను మార్ఫింగ్ చేసి, ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దుర్మార్గపు ఆలోచనతో తప్పుడు ప్రచారం చేస్తోంది. ఓటమి భయంతో జగన్ రెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి చంద్రబాబుపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఫేక్ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్న సజ్జల భార్గవ్‌రెడ్డి, వైసీపీ సోషల్ మీడియాపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి' అని ఆయన ఈసీని కోరారు. కాగా, ఎండ, వానలకు వెనుకాడకుండా రాష్ట్రంలోని ప్రతి ఓటరూ తన ఓటు హక్కు వినియోగించుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య కోరారు. ప్రతి ఒక్కరూ తమ పవిత్రమైన ఓటును వినియోగించుకుని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

బాబు సీఎం కావాలని నాలుక కోసుకున్నాడు..


బంజారాహిల్స్ మే 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఓ వ్యక్తి హైదరాబాద్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుక కోసుకున్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా పోలవరం మండలం, గూటల గ్రామానికి చెందిన చేడల మహేశ్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన మహేశ్ బ్లేడుతో నాలుక కోసుకున్నారు. రక్తస్రావాన్ని గమనించి బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అతని జేబులో ఉన్న ఓ లేఖను స్వాధీనం చేసుకున్నారు. 2004, 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం కావాలని, 2019లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎం కావాలని తాను ఇలాగే నాలుక కోసుకొని మొక్కు చెల్లించినందుకు వారు గెలిచారని, అందుకే ఇప్పుడు చంద్రబాబు సీఎం కావాలని మొక్కు చెల్లించినట్టు లేఖలో మహేశ్ పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెంట్లుగా కూర్చుంటే చంపేస్తాం

» రెంటచింతల, కాకిరాలలో వైసీపీ మూకల దాడులు

మాచర్ల టౌన్/దుర్గి, మే 12: 'టీడీపీ ఏజెంట్‌గా కూర్చుంటే చంపేస్తాం నా కొ...ల్లారా... మీ అంతు చూస్తాం' అంటూ వైసీపీ గూండాలు వీరంగం సృష్టించి దాడులకు తెగబడ్డారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాలకు చెందిన మల్లయ్య, సిద్ధయ్య సోమవారం జరగనున్న ఎన్నికల్లో రెంటాల పోలింగ్ బూత్‌ల్లో ఏజెంట్లుగా కూర్చునేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వైసీపీ నేత మోర్తాల ఉమామహేశ్వరరెడ్డితో పాటు మరో 30మంది మల్లయ్య, సిద్ధయ్య ఇళ్లకు వెళ్లారు. వారు భోజనం చేస్తున్న కంచం లాగేసి ఛాతీపై తన్నారు. రాడ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడిచేశారు. మహిళలను దుర్భాషలాడారు. అక్కడున్న ట్రాక్టర్‌ను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో మల్లయ్య, సిద్ధయ్య తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీ సానుభూతిపరులు వైసీపీ నేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కారంపూడి సీఐ నారాయణస్వామి అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, దుర్గి మండలం మించాలపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు సింగంశెట్టి నాగమధు, మిర్యాల సైదులు ఏజెంట్లుగా ఉండేందుకు కాకిరాలలో ఫాంలు పూర్తి చేస్తుండగా దాదాపు 15మంది వైసీపీ గూండాలు కర్రలతో పోలింగ్ బూత్ వద్దకు వచ్చారు. 'ఏజెంట్లుగా నిలబడేంత మొనగాళ్లారా మీరు... చంపేస్తాం..' అంటూ వారిపై దాడి చేశారు. ఈ దాడిలో నాగమధు, సైదులు గాయపడ్డారు. బాధితులు దుర్గి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చివరి నిమిషం వరకు అప్రమత్తం!



» ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసేలా చూడాలి

» టీడీపీ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, మే12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితిని కల్పించాలని, పోలింగ్ శాతం పెరిగేలా కృషిచేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. ఓటమి భయంతో వైసీపీ ఊహించని స్థాయిలో అక్రమాలకు పాల్పడే అవకాశం ఉన్నందున, చివరి నిమిషం వరకు పూర్తి అప్రమత్తతతో ఉండాలని నిర్దేశించారు. సోమవారం పోలింగ్ సందర్భంగా పార్టీపరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలోని వార్‌రూమ్ నుంచి జిల్లాల పార్టీ నేతలతో చంద్రబాబు సమీక్షించారు. పోలింగ్ ఏజెంట్లుగా వెళ్లే కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామ స్థాయిలో పోలింగ్ బూత్ నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతి అంశాన్ని పర్యవేక్షించేలా ప్రణాళిక రూపొందించారు. పోలింగ్‌లో సమస్యలు తలెత్తితే ఎప్పటికప్పుడు నియోజకవర్గాల నుంచి వార్‌రూమ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. డీప్‌ఫేక్ వీడియోలు, ఫేక్ లేఖలు, పుకార్లు, హింసా రాజకీయాలతో వైసీపీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టేలా నేతలకు బాధ్యతలు అప్పగించారు. జిల్లా కలెక్టర్లు, ఆర్వోలు, ఎన్నికల పరిశీలకుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం ద్వారా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు గ్రామ స్థాయిలో కార్యకర్త నుంచి పార్టీ నేతలెవరూ విశ్రాంతి తీసుకోవద్దని కోరారు. సోమవారం ఉండవల్లిలో ఓటు వేసిన తర్వాత చంద్రబాబు వార్‌రూమ్ నుంచి పర్యవేక్షించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కూటమిలో జోష్!

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మ విశ్వాసంతో సన్నద్ధమయ్యాయి. ఎన్నికల గడువు సమీపించిన కొద్దీ వివిధ సమీకరణలు తమకు అనుకూలంగా మారాయని, ప్రభుత్వ మార్పు ఖాయమని కూటమి పార్టీలు విశ్లేషిస్తున్నాయి. జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత అసాధారణ స్థాయిలో నెలకొనడంతో తాము సునాయాసంగా గెలవబోతున్నామని పేర్కొంటున్నాయి. 'గత ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ మధ్య తొమ్మిదిన్నర శాతం ఓట్ల తేడా ఉంది. జనసేనకు విడిగా ఆరున్నర శాతం ఓట్లు వచ్చాయి. కేవలం పోయినసారి వచ్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకున్నా టీడీపీ, జనసేన పార్టీలు కలవడంతో వాటికి... వైసీపీకి మధ్య ఉన్న తేడా ఆరున్నర శాతం తగ్గిపోయింది. కొత్తగా వైసీపీకి పెరిగిన ఓట్లేమీ లేవు. ప్రభుత్వ వ్యతిరేకతతో అనేక వర్గాల్లో వైసీపీ ఓటు బ్యాంకు ప్రతిపక్షానికి మారిపోయింది. కేవలం ఈ లెక్కలు చూసినా వైసీపీ ఓటమి గోడ మీద రాసినంత స్పష్టంగా కనిపిస్తోంది' అని టీడీపీ తరఫున సాంకేతిక విశ్లేషణలు చూస్తున్న ఒక నేత పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్న ఏజెన్సీల అంచనా ప్రకారం.. యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, వ్యాపార వర్గాలు, భవన నిర్మాణ కార్మికులు, మద్యం సేవించే పేద వర్గాలు.. కరెంటు బిల్లులు, పెట్రో చార్జీల పెంపు వంటి బాదుడు నిర్ణయాలతో విసుగుచెందిన మధ్య, దిగువ మధ్య తరగతి వర్గాలు.. జగన్ సర్కారుపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఈ అంచనాల్లో వాస్తవం ఉందని ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సమయంలో వెల్లడైంది. గతంలో పోస్టల్ బ్యాలెట్లను పోస్టు ద్వారా పంపేవారు. అనేక మంది వాటిని వేయడానికి పెద్దగా శ్రద్ధ తీసుకునేవారు కాదు. ఈసారి ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ప్రత్యక్ష ఓటింగ్ విధానం పెట్టారు. సుమారుగా నాలుగున్నర లక్షల మంది ఉద్యోగులు ఓట్లు వేశారు. ఇందులో అత్యధికులు కూటమికి ఓట్లు వేశారని ఉద్యోగ వర్గాల ద్వారానే తేలిపోయింది. గత ఎన్నికల్లో ఇదే ఉద్యోగ వర్గం వైసీపీకి బలంగా మద్దతిచ్చింది. ఈసారి అంతే బలంగా దానికి వ్యతిరేకంగా మోహరించింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఓట్లు పరిగణనలోకి తీసుకుంటే కనీసం పది లక్షల ఓట్లు కూటమికి పడేలా కనిపిస్తున్నాయని, ఇది బాగా పెద్ద సంఖ్యని సర్వే ఏజెన్సీలు చెబుతున్నాయి. ఉద్యోగులు, యువత, నిరుద్యోగులు వైసీపీ పట్ల విముఖతతో ఉన్నారని నిరుడు జరిగిన పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే తేలిపోయింది. అప్పుడు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఎన్నికలు జరిగితే మొత్తం మూడు పట్టభద్ర స్థానాలనూ టీడీపీ అనూహ్యంగా గెలుచుకుంది. అప్పటికి కూటమి ఏర్పాటు కూడా జరగలేదు. అయినా ఈ వర్గాల్లో నెలకొన్న వ్యతిరేకతతో టీడీపీ సునాయాసంగా గెలువగలిగింది.

వైసీపీ పథకాలకు దీటుగా..

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుంటున్న పేద వర్గాలు పూర్తిగా తమ వైపే ఉన్నాయని, వారి మద్దతుతో తాము తిరిగి అధికారంలోకి వస్తామని వైసీపీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తుండేవి. అయితే ఆ వర్గాలను ఆకట్టుకోవడానికి టీడీపీ కూటమి సూపర్ సిక్స్ పేరుతో మరింత సాయం అందించే హామీలను ప్రకటించింది. అలాగే పింఛను పొందుతున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచుతూ పెద్ద హామీ ఇచ్చింది. దీంతో పథకాల లబ్ధిదారుల్లో మార్పు వచ్చిందని, వారిలో గణనీయ భాగం విపక్షం వైపు ఆకర్షితులయ్యారని కూటమి నేతలు అంటున్నారు. దీనికి తోడు మరికొన్ని అంశాలు కొన్ని వర్గాలను వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మార్చాయని ఆ నేతలు చెబుతున్నారు. 'ల్యాండ్ టైటిలింగ్ చట్టంలోని అంశాలు రైతాంగంలో వైసీపీ ప్రభుత్వం పట్ల బాగా భయాన్ని పెంచాయి. ఈ ప్రభుత్వం వస్తే తమ భూములకు రక్షణ ఉండదన్న అనుమానాలు బలంగా వ్యాపించాయి. అలాగే జగన్ ఇసుక విధానం భవన నిర్మాణ కార్మికుల్లో బాగా వ్యతిరేకత పెంచింది. ఈ విధానం వల్ల తమకు పనులు బాగా తగ్గిపోయాయని, ఆర్థికంగా కుదేలయ్యామని వారిలో అత్యధికులు భావిస్తున్నారు. ఇన్ని వర్గాల్లో వ్యతిరేకత ఉన్న తర్వాత ఏ ప్రభుత్వమైనా తిరిగి అధికారంలోకి రావడం కష్టం' అని జనసేనలో క్రియాశీలంగా ఉన్న ముఖ్యుడొకరు అభిప్రాయపడ్డారు. ఈ అంచనాలకు తగినట్లే ప్రచార సమయంలో కూటమి పార్టీల ముఖ్యులు చంద్రబాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ వంటి వారి సభలకు ప్రజలు పోటెత్తారు. నేతల ప్రసంగాలు పూర్తయ్యేవరకూ కదలకుండా ఉన్నారు. అధికార పార్టీ అర్థ, అంగ బలాలను తట్టుకోగలమా అని కొద్దికాలం క్రితం వరకు ప్రతిపక్ష నేతల్లో కొంత భయం ఉండేది. కానీ ప్రచారం సాగేకొద్దీ ఆ భయం పోతూ వచ్చింది. పోలింగ్ సమయానికి నేతలు, శ్రేణుల్లో విశ్వాసం, ఉత్సాహం ఉరకలు వేస్తున్నాయి. మారిన వాతావరణమే దీనికి కారణమని కూటమి నేతలు విశ్లేషిస్తున్నారు. పోలింగ్‌లో పాల్గొనడానికి హైదరాబాద్, ఇతర రాష్ట్రాల నుంచి ప్రవాహం మాదిరిగా ఓటర్లు తరలిరావడం కూడా కూటమిలో ఆత్మవిశ్వాసం పెంచింది. అమెరికా, బ్రిటన్, గల్ఫ్ దేశాల నుంచి కూడా ప్రవాసాంధ్రులు అంతకు ముందే మాతృభూమికి వచ్చి కూటమికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేయడాన్ని ఆయా పార్టీల నేతలు ప్రస్తావిస్తున్నారు.



చంద్రబాబు గెలవాలని పొర్లుదండాలు..

తార్నాక, మే 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం పాటుపడే చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సీబీఎన్ ఫ్యాన్స్ పొర్లుదండాలతో ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు సతీష్ గౌడ్, గోపీ, రాము తదితరులు ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి శ్రీనివాసరావు మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎన్నాళ్లకు.. ఎన్నేళ్లకు..!

» ఐదేళ్ల తర్వాత సొంతూరిలో సీఎం జగన్ బస

» 2019 ఎన్నికలకు... తిరిగి 2024 ఎన్నికల ముందు

» ఇదేనా పులివెందులపై ప్రేమ అంటూ విమర్శలు

కడప, మే 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల తర్వాత సొంతూరు పులివెందులలో బసచేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయన సతీసమేతంగా ఆదివారం పులివెందులకు విచ్చేశారు. రాత్రికి ఇక్కడే బస చేసి సోమవారం ఉదయం ఓటు హక్కు వినియోగించుకుంటారు. 2019 ఎన్నికల సందర్భంగా పోలింగ్‌కు ఒకరోజు ముందు ఆయన సతీసమేతంగా పులివెందులకు వచ్చారు. ఆరోజు రాత్రి బాకరాపురంలోని ఆయన ఇంట్లో బస చేశారు. సీఎం అయ్యాక ఏనాడూ పులివెందులలో బస చేయలేదు. పులివెందులకు వచ్చినా ఆయా కార్యక్రమాలలో పాల్గొని వెళ్లిపోయేవారు. పులివెందుల లేదా కడప పర్యటనకు జగన్ వస్తే నేరుగా హెలికాప్టర్ ద్వారా ఇడుపులపాయకు వెళ్లి అక్కడ బసచేసేవారు. బాకరాపురంలోని తన ఇంట్లో ఉండేవారు కాదు. వివేకా మృతి అనంతరం భద్రతా కారణాల వల్లే ఆయన ఇక్కడ బస చేయలేదని సమాచారం. బాకరాపురంలో జగన్ ఇంద్రభవనాన్ని తలపించే స్థాయిలో సొంతఇంటిని, పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకున్నారు. కానీ, ముఖ్యమంత్రిగా ఉండి కూడా సొంత ఊరిలో బసచేయలేని దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని సొంతూరి ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతి నెలా పులివెందుల పర్యటనకు వచ్చేవారని, ఇక్కడే అనేక సార్లు బస చేసేవారని అంటున్నారు. పులివెందులకు వచ్చినపుడు ఆ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ కనీసం ఒకరిద్దరిని పేర్లతో పిలిచి పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడేవారు. కానీ జగన్ దీనికి పూర్తి భిన్నంగా సొంత నియోజకవర్గానికి జగన్ వచ్చినా.. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి వర్గానికి చెందిన నాయకులు తప్ప వేరొకరు ఆయన్ను కలవడానికి అవకాశం ఉండదు. సొంత నియోజకవర్గంలోకి వచ్చినప్పటికి పెద్దఎత్తున భద్రత ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ పూర్తిగా మళ్లించడం, పరదాలు కట్టడం, ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి జనాన్ని ఇబ్బంది పెట్టడం జగన్ పంథాగా మారింది. మొన్న నామినేషన్ వేసేందుకు వచ్చినప్పుడు కూడా అక్కడి ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో అనేక ఇబ్బందులు పడ్డారు. దీంతో పులివెందుల ప్రజల్లో జగన్‌పై అసంతృప్తి కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో గతంలో వచ్చిన మెజార్టీ తగ్గే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయని అక్కడి రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అమ్మ... నా ప్రాణం, ప్రేరణ

» షర్మిల మదర్స్ డే శుభాకాంక్షలు

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): మదర్స్ డే సందర్భంగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. "అమ్మ... చీకటిలో వెలుగు రేఖై, బాధల్లో బలానివై, అలసటలో ఆలనవై, విజయాల్లో ఆశీర్వాదానివై... దేవుడు నాకిచ్చిన అనిర్వచనమైన కానుక, నా ప్రాణం, నా ప్రేరణ... అమ్మకు మదర్స్ డే శుభాకాంక్షలు... హ్యాపీ మదర్స్ డే మా!! హ్యాపీనెస్ ఆల్వేస్ టు యు!!!" అంటూ షర్మిల శుభాకాంక్షలు తెలిపారు. తన తల్లి విజయలక్ష్మితో కలసి దిగిన ఒక ఫొటోను తన సందేశంతో పాటు ఎక్స్‌లో పంచుకున్నారు. కాగా, సీఎం జగన్మోహన్‌రెడ్డి మాత్రం సామాజిక మాధ్యమాల్లో ఎక్కడా తన తల్లికి మదర్స్ డే శుభాకాంక్షలు చెప్పిన దాఖలాలు లేవు.

నాడు ఉత్సాహం.. నేడు డీలా!

'వైనాట్ 175' ధీమా సడలిందా?.. వీరభక్తులపై ఈసీ వేటుతో జగన్‌లో ఆకస్మిక బేలతనం

» చిన్నాన్న వివేకా హత్య కేసు రివర్స్

» కాంగ్రెస్‌లో చేరి చెల్లెలు షర్మిల సవాల్

» భారీగా దెబ్బతీసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలింగ్ ముంగిట సీఎం జగన్‌లో గెలుపు ధీమా సడలిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. 'వైనాట్ 175' అని ఊదరగొట్టిన ఆయన.. గత కొన్ని రోజులుగా తన ప్రచారంలో బేలతనం ప్రదర్శిస్తూ వచ్చారు. వైసీపీని గెలిపించేందుకు కంకణం కట్టుకున్న కొందరు సీనియర్ ఐపీఎస్ అధికారులు, కలెక్టర్లపై కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) వేటువేయడమే దీనికి కారణమని రాజకీయ వర్గాలు అంటున్నాయి. పలు సర్వేలు టీడీపీ కూటమికే విజయమని అంచనాలు వేయడంతో వైసీపీ నేతలు స్తబ్ధుగా ఉండిపోయారు. అవన్నీ తప్పుల తడకని.. మేమే గెలవబోతున్నామని ఇదమిత్థంగా ఓ అంకె కూడా చెప్పలేకపోవడాన్ని ప్రస్తావిస్తున్నాయి. సర్వేల ప్రభావంతో క్రమంగా వైసీపీ అభ్యర్థులను నీరసం ఆవహించినట్లుగా ఉందని చెబుతున్నాయి. జగన్ సహా ఆ పార్టీ ముఖ్య నేతలెవరిలోనూ.. 2019 ఎన్నికలనాటి ఉత్సాహం కనిపించడం లేదని పేర్కొంటున్నాయి. వాస్తవానికి ఎన్నికల ప్రచారం మొదలుపెట్టినప్పటి నుంచి సీఎం నోట 'వైనాట్ 175' వినిపించకపోవడం వైసీపీ నేతలను, శ్రేణులను కూడా విస్మయపరుస్తోంది. 'గడప గడపకు మన ప్రభుత్వం' వర్క్‌షాపుల్లో, అధికారిక సమీక్షల్లో మొత్తం 175 అసెంబ్లీ స్థానాలు, 25 లోక్‌సభ సీట్లూ కైవసం చేసుకుంటామని జగన్ దర్పంగా చెప్పేవారు. అయితే పరిస్థితులు ఏ మాత్రం సానుకూలంగా లేవని సొంత సర్వేలే తేల్చడం.. చిన్నాన్న వివేకాందరెడ్డి హత్య కేసు వెన్నాడుతుండడం.. చెల్లెళ్లు వైఎస్ షర్మిల, సునీత తనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తుండడం.. సిద్ధం సభలకు, బస్సు యాత్రకు స్పందన లేకపోవడం.. టీడీపీ-జనసేనతో బీజేపీ సైతం జట్టుకట్టడం.. స్వయంగా ప్రధాని మోదీ కూటమి తరఫున ప్రచారానికి రావడం వంటి పరిణామాలు ఆయనలో విశ్వాసం సన్నగిల్లడానికి కారణాలని సొంత పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. జగన్‌లో ధీమా సడలినట్లు ఆయన హావభావాలు, ప్రసంగాలతో స్పష్టం కావడంతో ఆ ప్రభావం వైసీపీ శ్రేణులపైనా పడిందని అంటున్నారు. అందుకే భయపడాల్సిన పనిలేదని.. బొటాబొటీగా 100 స్థానాలతోనైనా బయటపడతామని.. జగనే మళ్లీ అధికారంలోకి వస్తారంటూ కొందరు వైసీపీ పెద్దలు ఆంతరంగికులతో చెబుతున్నట్లుగా లీకులివ్వడం విశేషం.

నాడు రాత మార్చిన హత్యే..

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు 2019లో రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మార్చేసింది. ఈ హత్యను జగన్ తనకు సానుకూలంగా ప్రచారం చేసుకుని గెలిచి అధికారంలోకి వచ్చారు. కానీ ఐదేళ్లు తిరిగేసరికి చరిత్ర రివర్స్ అవుతోందని అంటున్నారు. నాడు జగన్‌కు మద్దతిచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇప్పుడు ఎదురుతిరిగారు. ఎన్నికల వేళ ఈ తిరుగుబాటు తీవ్రమైంది. అన్న కోసం వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసిన వైఎస్ షర్మిలారెడ్డి కాంగ్రెస్‌లో చేరి ఏకంగా పీసీసీ అధ్యక్షురాలిగా పగ్గాలు చేపట్టారు. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని సీబీఐ ఈ హత్య కేసులో నిందితులుగా పేర్కొనడం.. ఆయన్ను సీబీఐ అరెస్టు చేయకుండా జగన్ చేసిన అధికార దుర్వినియోగం.. బహిరంగంగానే మద్దతివ్వడం.. మరోసారి వైసీపీ టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆమె కడప లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. వివేకా హత్య వ్యవహారంలో న్యాయం కోసం ఒంటరి పోరాటం చేస్తున్న ఆయన కుమార్తె సునీతారెడ్డి ఆమెకు మద్దతుగా ప్రచారం చేశారు. అన్నాచెల్లెళ్ల తగవుకు దూరంగా విజయలక్ష్మి అమెరికా వెళ్లిపోయారు. అయితే పోలింగ్ ముంగిట కడపలో షర్మిలను గెలిపించాలని ప్రకటన విడుదల చేయడంతో వైసీపీ శ్రేణులు డీలాపడ్డాయి.

టైటిలింగ్ యాక్టు దెబ్బ!

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అనూహ్యంగా తమను దెబ్బతీసిందని వైసీపీ నేతలు వాపోతున్నారు. ఈ ఐదేళ్లలో అధికార పార్టీ ఆక్రమణలు, భూకబ్జాలను దగ్గరగా చూసిన జనం తమ భూమిని అధికారికంగానే లాక్కుంటారన్న ఆందోళనలో పడిపోయారని.. దీనికితోడు చంద్రబాబు, పవన్ కల్యాణ్ దీనినే ప్రధాన ప్రచారాస్త్రం చేయడం.. తాను అధికారంలోకి వస్తే జగన్ తెచ్చిన కబ్జా చట్టాన్ని రద్దుచేసేస్తానని.. దానిపైనే రెండో సంతకం చేస్తానని టీడీపీ అధినేత ప్రకటించడం.. తమ విజయావకాశాలను సంక్లిష్టంగా మార్చాయని వారు అంగీకరిస్తున్నారు.

కారులో రూ.కోటిన్నర... వదిలేసి పరార్



విశాఖలో స్వాధీనం చేసుకున్న నగదు

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): కారులో రహస్యంగా తరలిస్తున్న రూ.కోటీ 54 లక్షల 28వేల నగదును విశాఖలో ఫ్లైయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. బీచ్‌రోడ్డులో వెళుతున్న కారులో భారీగా నగదు తరలిస్తున్నట్టు గుర్తుతెలియని వ్యక్తులు 'సీవిజిల్ యాప్'లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎలక్షన్ ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు పాండురంగాపురం జంక్షన్‌లో హోండా సిటీ కారు ఆపి తనిఖీలు చేశారు. అధికారులు కారు ఆపగానే కారులో ఉన్న వ్యక్తులు పరారైపోయారు. పోలీసులు ఉండగానే అందులోని వ్యక్తులు పరారైపోయినా వారిని పట్టుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది.

మద్యంతో దొరికిపోయిన వైసీపీ సర్పంచ్

రొద్దం, మే 12: ఓటర్లకు పంచేందుకు కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువస్తున్న అధికార పార్టీ సర్పంచ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని రొద్దం మండలం ఆర్.లోచర్ల గ్రామ సర్పంచ్ గంగాధర్.. శనివారం రాత్రి కర్ణాటక నుంచి స్వగ్రామానికి భారీ ఎత్తున అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ దౌలత్‌ఖాన్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రెండు ద్విచక్రవాహనాలు, ఓ కారులో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తెస్తున్నట్లు గుర్తించారు. సర్పంచ్ గంగాధర్, వైసీపీ వర్గీయులు భాస్కర్, బోయ మారుతి, కాపు మారుతిరెడ్డిని అరెస్టు చేసి.. పెనుకొండ కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మూడు వాహనాలను, 480 టెట్రా ప్యాకెట్లను పోలీసులు సీజ్ చేశారు.

డబ్బులు పంచుతూ దొరికిన వైసీపీ కార్యకర్త

కారంపూడి, మే 12 : పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండలంలోని వేపకంపల్లిలో వైసీపీ కార్యకర్త డబ్బులు పంచుతుండగా ఆదివారం గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మాచర్ల మండలం నాగులవరానికి చెందిన మండ్ల మహేష్ వేపకంపల్లిలో ఇంటింటికీ తిరుగుతూ వైసీపీకి ఓటు వేయాలని డబ్బులు పంచుతున్నాడు. గమనించిన గ్రామస్థులు అతడ్ని నిలువరించారు. ఎస్ఐ రామాంజినేయులు తనిఖీ చేయగా అతడి వద్ద రూ.3.85లక్షల నగదు లభ్యమైంది. పోలీసులు మహేష్‌పై కేసు నమోదు చేశారు.

ఓటర్ల కోసం తెస్తున్న బియ్యం పట్టివేత

ఒంగోలు(క్రైం), మే 12: ఓటర్లకు పంచేందుకు తరలిస్తున్న బియ్యం బస్తాలను అధికారులు పట్టుకున్నారు. శనివారం రాత్రి గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్ నుంచి ఒంగోలులోని వెంకటేశ్వరకాలనీ, ప్రకాశం కాలనీలకు లారీల్లో బియ్యం తరలిస్తుండగా అధికారులు తనిఖీలు చేశారు. డ్రైవర్లు సరైన సమాధానం చెప్పకపోవడంతో సరుకుతోపాటు లారీలను స్వాధీనం చేసుకున్నారు. గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని రైస్‌మిల్లులో 300బస్తాలకుపైగా బియ్యాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యం మొత్తం 2వేల బస్తాల వరకు ఉండొచ్చని సమాచారం. కాగా, శనివారం అర్ధరాత్రి బియ్యం బస్తాలను పట్టుకున్న అధికారులు ఆదివారం రాత్రి వరకు ఒక అంచనాకు వచ్చిన దాఖలాలు లేవు. ఈ విషయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసుల మధ్య సమన్వయలోపం కనిపిస్తోంది. రైస్‌మిల్లులో స్వాధీనం చేసుకున్న బియ్యానికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో సీజ్ చేసిన వాహనాలు, సరుకు విషయంలో ఎన్నికల అధికారులు మీనమేషాలు లెక్కపెట్టడంలో అధికారపార్టీ ఒత్తిళ్లు ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

ధన రాజకీయాలను తిరస్కరించండి: సీపీఐ

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): ధన రాజకీయాలను తిరస్కరించి.. ఓటుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న జగన్ ప్రభుత్వం ఇసుక, మైనింగ్, మద్యం కుంభకోణాల ద్వారా అక్రమంగా సంపాదించిన డబ్బుతో మరోసారి తిరిగి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలన 'రివర్స్'లో నడిచిందని, రాష్ట్రాభివృద్ధి అటకెక్కిందని విమర్శించారు. డబ్బు ఇచ్చి ఓట్లు కొనుగోలు చేయాలనుకునే పార్టీలకు బుద్ధి చెప్పి ఓటు విలువ గుర్తించేలా చేయాలని కోరారు. మన రాష్ట్ర, దేశ భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పోలింగ్‌కు ముందు మరో పంచ్

(మొదటి పేజీ తరువాయి)

ముగ్గురు అధికారులపై సాయంత్రంలోగా అభియోగాలు నమోదు చేయాలని ఆదివారం మధ్యాహ్నం డీజీపీని ఆదేశించింది. కోడ్ అమలు చేయడంలో ఈ ముగ్గురూ విఫలమయ్యారని తేల్చింది. ఓఎస్‌డీ రవీంద్రనాథ్ రెడ్డి, టూటౌన్ సీఐ రాజారెడ్డి కనీస బందోబస్తు చర్యలు చేపట్టలేక పోయారని ఆగ్రహం వ్యక్తంచేసింది. వీరందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకుని విచారణ చేపట్టాలని సూచించింది. ఈసీ అనుమతి లేకుండా మొక్కుబడి చర్యలు తీసుకుంటే కుదరదని స్పష్టం చేసింది.

జరిగింది ఇదీ!

నంద్యాల వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఇంటివద్ద సినీనటుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు జనం భారీగా పోగయ్యారు. సెక్షన్ 30(పోలీస్ యాక్ట్) అమల్లో ఉన్నప్పుడు అందుకు అనుగుణంగా పోలీసులు చర్యలు చేపట్టాలి. ఆర్వో అనుమతి తప్పనిసరి. అయితే, అల్లు అర్జున్‌ను నంద్యాలలో ప్రచారానికి తీసుకొచ్చిన శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి... ఎలాంటి అనుమతి లేకుండా పట్టణ శివారు నుంచే భారీ ర్యాలీతో తీసుకొచ్చారు. అయినా.. ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు ఉద్దేశ పూర్వకంగానే చోద్యం చూశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అదేసమయంలో చంద్రబాబు పర్యటన ఉండటంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ క్రమంలోనే కేంద్ర ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపించినట్లు పోలీసు ఉన్నత స్థాయి వర్గాలు భావిస్తున్నాయి.

వైసీపీ పోలీసులకు హెచ్చరికే..

ఇప్పటివరకూ రాష్ట్రంలో పోలీసు అధికారులపై తీసుకున్న చర్యలకు, తాజాగా ఈసీ జారీచేసిన ఆదేశాలకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. చార్జెస్ ఫైల్ చేయాలంటూనే ఆ వివరాలు తమకు చెప్పాలని పేర్కొనడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చాక పోలీసులు ఐపీసీ పక్కన పెట్టి వైసీపీ చట్టాన్ని అమలు చేస్తున్నారు. చివరకు ఎన్నికల సమయంలోనూ జగన్ పార్టీ కోసమే పని చేస్తామని, ఈసీ మార్గదర్శకాలు పాటించబోమని హద్దుదాటారు. అలాంటి పోలీసులపై ఈసీ వరుసగా వేటేస్తూ వచ్చింది. అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్, చిత్తూరు-జాషువా, నెల్లూరు-తిరుమలేశ్వర్ రెడ్డి, ప్రకాశం-పరమేశ్వర్ రెడ్డి, పల్నాడు- రవిశంకర్ రెడ్డితో పాటు గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజును ఎన్నికల విధుల నుంచి పక్కన పెట్టింది. విజయవాడ సీపీ కాంతిరాణా టాటా, ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులుపైనా వేటు వేసింది. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డిని మార్చేసి హరీశ్ కుమార్ గుప్తాను పోలీస్ బాస్‌గా నియమించింది. అయితే ఇందులో ఎవ్వరిపైనా చార్జెస్ ఫ్రేమ్ చేయాలనిగానీ, విచారణ చేపట్టాలనిగానీ ఆదేశించలేదు. కానీ నంద్యాలలో వైసీపీ మూకలకు వంతపాడిన ఖాకీలను మాత్రం ఈసీ వాతపెట్టింది. చార్జెస్‌తోపాటు విచారణలో తేలిన తప్పులుకూడా తమకు చెప్పి సస్పెన్షన్ లేదా మేజర్ పెనాల్టీ లాంటి చర్య తీసుకోవాలని డీజీపీకి ఇచ్చిన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

భవానీపురం ఇన్‌స్పెక్టర్‌పై వేటు


విజయవాడలో భవానీపురం ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణపై అధికారులు వేటు వేశారు. మరికొద్ది గంటల్లో పోలింగ్ ప్రారంభమవుతుందనగా ఆయన్ను వీఆర్‌లోకి పంపుతూ పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో ప్రసాద్ కుమార్‌ను నియమించారు.

తిరుపతి జిల్లాలో ఐదుగురు పోలీసుల బదిలీ..

చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, కడప జిల్లాల్లో వైసీపీ పోలీసులుగా ముద్రపడ్డ వారిలో అగ్రస్థానంలో ఉండే జగన్మోహన్ రెడ్డి, అంజూ యాదవ్‌తో పాటు ఐదుగురు అధికారులపై ఈసీ చర్య తీసుకుంది. వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్న పలువురు సీఐలు, ఎస్ఐలను ఎన్నికల సందర్భంగా అటూ ఇటూ మార్చేసి తమకు ఉపయోగపడేలా అధికార పార్టీ నేతలు తిరుపతి పరిసరాల్లోనే పోస్టింగుల్లో పెట్టించారు. అభిమానం, కృతజ్ఞత రెండూ ఎన్నికల సందర్భంగా చూపించేందుకు ప్రయత్నిస్తూనే ఉండటంతో ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ... కొన్ని ఆధారాలు కూడా సమర్పించింది. ఐదేళ్లుగా తిరుపతి కొండపై ఏకంగా సీఎం జగన్మోహన్ రెడ్డి స్థాయిలో అధికారం చెలాయించిన సీఐ జగన్మోహన్ రెడ్డికి కళ్లెం వేసింది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి కోసం జనసేన నేతలపై దాడులు చేసిన సీఐ అంజూ యాదవ్, అమర్నాథ్ రెడ్డి, శ్రీనివాసులుతోపాటు ఎస్ఐ వినోద్‌కుమార్‌ను తక్షణమే ఎన్నికల విధుల నుంచి తప్పించాలని ఆదేశించింది. అనంతపురం డీఐజీ కార్యాలయంలో వెంటనే రిపోర్టు చేయాలని వారిని ఆదేశించింది.

జన చైతనం

ప్రజా అజెండా



అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..

కౌంట్ డౌన్ నేడే పోలింగ్

ఆంధ్రజ్యోతి
సోమవారం ◇ 13-5-2024

ఒకవైపు బాదుడే బాదుడు! మరోవైపు... బాధలే బాధలు! ఇదీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలన సాగిన తీరు! నోరెత్తి మాట్లాడాలంటే భయం! ప్రశ్నించాలంటే భయం! ఎదురు తిరిగి మాట్లాడితే కేసులు, అరెస్టులు, లాకప్‌లో చిత్రహింసలు! 'యథారాజా తథా ప్రజా' అన్నట్లు క్షేత్రస్థాయిలో వైసీపీ శ్రేణుల వీరంగాలు! టీడీపీ సామాన్య కార్యకర్త నుంచి పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు దాకా బాధితులే! దళిత డాక్టర్ సుధాకర్ నుంచి ఎంపీ రఘురామ కృష్ణంరాజు వరకు పోలీసు హింసను అనుభవించిన వారే! దళితులపై దాడులకు లెక్కే లేదు. మైనారిటీలపై లెక్కలేనన్ని అరాచకాలు! పట్టపగలే బీసీల హత్యలు! అన్నీ జరుగుతున్నా ఏనాడూ నోరెత్తని పాలకులు! పైగా... దాడులు, దౌర్జన్యాలు చేసిన వారికి పదవులిచ్చి ప్రోత్సహించేంత బరి తెగింపు! ఇలాంటి పాలన ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేదు! ఇంత అరాచకం ప్రజాస్వామ్య పాలనలో కనిపించదు! ఈ ఆటవికం ఓటుతో వేటేస్తే తప్ప పోదు!



పల్నాడులో అరాచకం

స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మాచర్లలో టీడీపీ వారిని నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంతో అక్కడికి వెళ్లిన టీడీపీ నేతలు బొండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్నల కారుపై వైసీపీ నేత తురగా కిషోర్ ఆయన అనుచరులు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. పల్నాడు జిల్లాలో అనేక గ్రామాల్లో వైసీపీ దాష్టీకాలను భరించలేక టీడీపీ కార్యకర్తలు సొంతూళ్లను వదిలి ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు.

'జడ్ ప్లస్'కే భద్రత లేదు



వైసీపీ నేతల రాళ్ల దాడిలో గాయపడ్డ ఎన్ఎస్‌జీ కమాండో

దేశంలోనే అత్యంత సీనియర్ నాయకుల్లో ఒకరు చంద్రబాబు నాయుడు! ఆయనకు జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉంది. కానీ... ఈ ఐదేళ్లలో ఆయనకే భద్రత లేకుండా పోయింది. చంద్రబాబుపై జరిగినన్ని దాడులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు బహుశా దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఏ ప్రతిపక్ష నేతపైనా జరగలేదేమో! వైసీపీ మూకలు ఏకంగా ఆయన ఇంటిపైకే దండయాత్రకు వెళ్లాయి. అంగళ్లలో రాళ్ల దాడికి తెగబడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. నందిగామలో రోడ్ షో సందర్భంగా చంద్రబాబు కాన్వాయ్‌పై జరిగిన రాళ్ల దాడిలో ఆయన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) మధు తలకు గాయమైంది. గతేడాది ఏప్రిల్‌లో ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో చంద్రబాబు రోడ్‌షో సందర్భంగా ఆయన కాన్వాయ్‌పై మంత్రి ఆదిమూలపు సురేశ్ ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. చంద్రబాబు కాన్వాయ్‌పై చెప్పులు, రాళ్లు విసిరారు. పోలీసులు వారిని అడ్డుకోకుండా టీడీపీ కార్యకర్తలపైనే లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో ఎస్ఎస్‌జీ కమాండో సంతోషకుమార్ తలకు గాయమైంది. దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త, దళితుడు చేలూరి రాజయ్య (66) చికిత్స పొందుతూ మృతిచెందారు.

ఐదేళ్ల అరాచకాలపై

ఓటుతో వేటెయ్యండి!



ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్‌ను చంపేసి తన కారులోనే తరలించిన దృశ్యం

దళిత డ్రైవర్‌ను చంపేసి..

'మాకు నచ్చింది చేస్తాం. మాకు నచ్చకపోతే చంపేస్తాం! ఇదిగో డెడ్‌బాడీ' అనే స్థాయి అరాచకం వైసీపీ పాలనలో రాజ్యమేలింది. 2022 మే 18న అర్ధరాత్రి వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని కాకినాడ బీచ్‌రోడ్డులో హత్య చేశారు. ఎమ్మెల్సీ తన కారులో స్వయంగా డ్రైవర్ మృతదేహాన్ని అతడి ఇంటికే తీసుకువచ్చారు. బాధితులు నిలదీయడంతో కారు వదిలేసి అక్కడినుంచి అనంతబాబు పారిపోయారు. అనంతబాబు ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు. జైలు నుంచి బయటకు వచ్చినపుడు వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికి మరీ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతబాబును జగన్ తన పక్కన పెట్టుకుని తిరుగుతూనే ఉన్నారు.

మైనారిటీ కుటుంబం బలి

2020 నవంబరు 3న నంద్యాలలో మైనారిటీ వర్గానికి చెందిన అబ్దుల్ సలాం తన కుటుంబంతో కలసి ఆత్మహత్య చేసుకున్నారు. దొంగతనం చేసినట్టు ఒప్పుకోవాలని వైసీపీ నేతల ఒత్తిడితో పోలీసులు వేధించడమే ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి. అంతకుముందు సలాం తన కుటుంబ సభ్యులతో కలసి తీసుకున్న సెల్ఫీ వీడియో బయట పడింది. ఈ కేసులో ఓ సీఐ, ఓ హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసి జైలుకు పంపించారు. పోలీసులను ఒత్తిడి చేసిన వైసీపీ నాయకులు మాత్రం తప్పించుకున్నారన్న విమర్శలున్నాయి.



ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో సలాం కుటుంబం



ప్రొద్దుటూరులో హత్యకు గురైన నందం సుబ్బయ్య

బీసీ నేత దారుణహత్య

కడప జిల్లాలో చేనేత సామాజిక వర్గానికి చెందిన టీడీపీ అధికార ప్రతినిధి నందం సుబ్బయ్య (41)ను పట్టపగలే అందరూ చూస్తుండగా నరికి చంపేశారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపణలు చేసిన కొన్ని రోజులకే ఈ దారుణం జరిగింది. ఎమ్మెల్యే, ఆయన బావమరిది బంగారు రెడ్డి హత్య చేయించారని సుబ్బయ్య భార్య అపరాజిత పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ కేసు నమోదు చేయలేదు.

పాలన కాదు.. పగ!

- జగన్‌తో రాజకీయంగా విభేదించినందుకు తన కిరాయి సైన్యంతో సొంత చెల్లెలు షర్మిలపై నీచాతినీచమైన కామెంట్లు చేయించారు. తన పుట్టుక, క్యారెక్టర్ గురించి సోషల్ మీడియాలో దారుణంగా దాడి చేశారంటూ షర్మిల కన్నీటి పర్యంతమయ్యారు.
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుపై ఏసీబీతో ఈఎస్‌ఐ కేసు నమోదు చేయించి అర్ధరాత్రి వందలాది మంది పోలీసుల్ని ఇంటిపైకి పంపించారు. ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తిని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో 78 రోజులు పెట్టారు.
- పులివెందులలో హత్యకు గురైన దళిత మహిళ నాగమ్మకు న్యాయం జరగాలంటూ నిరసన చేపట్టిన తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిపై అట్రాసిటీ కేసు నమోదు చేయించి 14 రోజులు జైల్లో ఉంచారు.
- టీడీపీ ఆఫీసులోకి మఫ్టీలో వచ్చిన సీఐని ఎవరంటూ ప్రశ్నించినందుకు... ఆయన్ను బంధించారంటూ నారా లోకేశ్, ఆలపాటి రాజా, శ్రవణ్ కుమార్, అశోక్ బాబుపై హత్యాయత్నం కేసు పెట్టారు.



- మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కుటుంబంపై కేసులు పెట్టి వేధించి ఆయన ఆత్మహత్యకు పాల్పడేలా చేశారు.
- మాజీ మంత్రులు చినరాజప్ప, యనమల రామకృష్ణుడు ఓ వివాహానికి హాజరైనందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు.
- దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై 50కి పైగా కేసులు పెట్టి రెండు నెలలకు పైగా జైల్లో ఉంచారు.
- అనంతపురం జిల్లాలో జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు అస్మిత్ రెడ్డిపై లెక్కలేనన్ని కేసులు పెట్టి వేధించారు. కాల్వ శ్రీనివాసులు, పరిటాల శ్రీరామ్‌పై కేసు పెట్టారు.
- మున్సిపల్ ఎన్నికల్లో రిగ్గింగ్ చేస్తున్న వైసీపీ నాయకుల్ని అడ్డుకున్న కొల్లు రవీంద్రపై కేసు నమోదు చేశారు. మచిలీపట్నంలో ఒక హత్య కేసుతో ఏ మాత్రం సంబంధం లేకున్నా కొల్లు రవీంద్రను అరెస్టు చేసి జైలుకు పంపారు.
- సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఇంటిని వేకువజామున చుట్టుముట్టి రాజమండ్రి జైలుకు పంపారు.
- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన రెడ్డిపై అట్రాసిటీ కేసు పెట్టి జైలుకు పంపారు.
- ఆనందయ్య కరోనా మందు విషయంలో కాకాని అంతర్గత విషయాలు బయట పెట్టినందుకు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై దొంగతనం కేసు పెట్టారు.
- బొండా ఉమా, కూన రవికుమార్, కేఈ ప్రభాకర్, తిక్కారెడ్డి, వంతల రాజేశ్వరి, యరపతినేని శ్రీనివాసరావుపై తప్పుడు కేసులు పెట్టారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడిపై ఏకంగా ఏడు కేసులు పెట్టారు.
- నిమ్మల రామానాయుడు, కళా వెంకట్రావ్, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, నక్కా ఆనంద్ బాబు, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, జీవీ ఆంజనేయులు, అశోక్ గజపతి రాజు, నాదెండ్ల బ్రహ్మం, బుద్దా వెంకన్న, వర్ల రామయ్యపై తప్పుడు కేసులు నమోదు చేశారు.
- చంద్రబాబు ఇంటిపైకి జోగి రమేశ్ దాడికి వెళితే అక్కడున్న టీడీపీ శ్రేణులపై అట్రాసిటీ కేసులు పెట్టారు.
- టీడీపీ కార్యాలయంపై పట్టపగలు దాడి చేస్తే... టీడీపీ వారిపైనే కేసులు నమోదు చేశారు.
- గన్నవరంలో టీడీపీ ఆఫీసుపై మూకలు దాడి చేస్తే, టీడీపీ నేత పట్టాభిరామ్‌తో పాటు పలువురిపై ఎదురు కేసులు పెట్టారు. పోలీసులు పట్టాభిని చితకబాదారు. అదే విజయవాడ పటమటలో వైసీపీ గుండాలు టీడీపీ నేత కన్ను పొడిచేస్తే సాధారణ కేసు నమోదు చేశారు.
- సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ చింతకాయల విజయ్‌పై కేసులు పెట్టి ఇంట్లో చిన్నపిల్లల్ని వేధించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారితో పాటు పాత్రికేయులు, సామాన్యులపై ఏకంగా 150కిపైగా కేసులు పెట్టారు.
- హైకోర్టు న్యాయమూర్తులపై వైసీపీ కార్యకర్తలు, జగన్ అభిమానులు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేసినా చర్యలు తీసుకోలేదు. తమ వల్ల కాదంటూ సీఐడీ చేతులు ఎత్తేయడంతో హైకోర్టు సీబీఐకి కేసు అప్పగించింది.
- టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పేరుతో కుప్పంలో యాత్ర ప్రారంభించిన రోజే మోటర్ సైకిళ్ల ర్యాలీకి అనుమతి లేదంటూ కేసు పెట్టారు. ఏకంగా 20కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.
- రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందంటూ ఎవరో తనకు పంపిన సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసిన పెద్దావిడ ఇంటికి గుంటూరులో రాత్రి పది గంటలకు పోలీసులు వెళ్లి విచారణ పేరిట డీజీపీ కార్యాలయానికి తీసుకెళ్లారు.

రక్షక భటులకే రక్షణ లేదు..

- దేశంలో ఎక్కడైనా పోలీసుల్ని చూసి నేరస్తులు భయపడతారు. వైసీపీ పాలనలో మాత్రం నేరస్తుల దెబ్బకు పోలీసులే భయపడే పరిస్థితి.
- కడపలో మంత్రికి చెందిన మయూర హోటల్ భాగస్వామి రాజగోపాల్ రెడ్డి మరికొందరితో కలిసి ఒక వీధిలో అల్లరి చేస్తుంటే ప్రశ్నించిన సీఐపై దాడి చేశారు. తాను పోలీస్ అని చెబితే మరింత ఎక్కువగా కొట్టారు. సీఐ కేసు పెడితే రాజీ చేసుకోవాలంటూ మంత్రి ఒత్తిడి చేశారు.
- అనంతపురంలో నవోదయ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్త సురేశ్ అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తుంటే పట్టుకున్నందుకు సెబ్ పోలీసు స్టేషన్‌పైకి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అనుచరులు దండెత్తారు. ఎస్ఐపై చేయి చేసుకుని, మహిళా కానిస్టేబుల్ దుస్తులు లాగేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలిపై వైసీపీ రౌడీలు బెదిరింపులకు దిగడంతో స్టేషన్ నుంచి కన్నీరు పెట్టుకొంటూ బయటికి వచ్చారు.
- తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పోలీసు స్టేషన్లో దళిత ఎస్ఐ రవిబాబుపై వైసీపీకి చెందిన రౌడీషీటర్ సునీల్ రెడ్డి దాడి చేశాడు.
- కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వైసీపీ కార్యకర్త ఇంటికి తనిఖీల కోసం వెళ్లిన ఎస్ఐ వేణుగోపాల్‌పై అధికార పార్టీ మూకలు కత్తితో దాడి చేశాయి.
- గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో చెరువు మట్టిని తరలిస్తున్న వైసీపీ నేతల్ని అడ్డుకున్న ఎస్ఐ కోటేశ్వరరావుపై దాడికి పాల్పడ్డారు.
- కృష్ణా జిల్లా పమిడిముక్కలలో మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు రెవెన్యూ సిబ్బందితో వెళ్లిన కానిస్టేబుల్ బాలకృష్ణపై వైసీపీ గూండాలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.



చంద్రయ్యను హత్య చేస్తున్న వైసీపీ నేతలు

టీడీపీ జెండా పట్టుకున్నాడని..

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ బీసీ నేత తోట చంద్రయ్యను పట్టపగలు, నడి వీధిలో చంపేశారు. ఆయన టీడీపీకి మద్దతుగా నిలవడం, వైసీపీ వైపు వచ్చేందుకు నిరాకరించడమే ఈ దారుణానికి కారణం. బైకుపై వెళ్తున్న చంద్రయ్యను కింద పడేసి... గుండెలపై పొడిచి, ఆ తర్వాత గొంతు కోసి కిరాతకంగా చంపేశారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి దాడికి ప్రేరేపించినట్టు ఆరోపణలు వచ్చాయి.



చంద్రయ్య పాడె మోస్తున్న చంద్రబాబు

డాక్టర్ సుధాకర్‌పై ఘోరం



దళిత డాక్టర్ కె.సుధాకర్ (52)ను వైసీపీ సర్కారు వెంటాడి, వేధించి బలితీసుకుంది. కరోనా సమయంలో 2020లో రోగులకు చికిత్స చేసే వైద్యులకు కనీసం మాస్కులు కూడా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించడంతో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. సాధారణంగా అయితే ప్రభుత్వం స్పందించి అన్ని ఆస్పత్రులకు అవసరమైన గ్లౌజులు, మాస్కులు సరఫరా చేయాలి. కానీ డాక్టర్ సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. ఆయనపై వైసీపీ పెద్దలు వ్యక్తిగతంగా కక్ష కట్టారు. ఆయనను నేషనల్ హైవేపై దుస్తులు లేకుండా నిలబెట్టి పోలీసులతో లాఠీలతో కొట్టించారు. మతి భ్రమించిందనే ముద్రవేసి మానసిక వైద్యశాలలో పడేశారు. కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించడంతో ఆయనకు ఊరట లభించింది. ఉద్యోగంలోకి తిరిగి తీసుకోకపోవడంతో మానసిక వేదనకు గురైన డాక్టర్ సుధాకర్ ఏడాది తిరగకుండానే గుండెపోటుతో మరణించారు.

అక్కకు అండగా ఉన్నాడని...



తన అక్కను వేధిస్తున్నారని ప్రశ్నించాడని అమర్నాథ్ గౌడ్ అనే పదో తరగతి విద్యార్థిపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాజోలులో ఈ దారుణం జరిగింది. ఈ కేసులో ఏ1 నిందితుడు వెంకటేశ్వరరెడ్డి వైసీపీ సానుభూతిపరుడిగా ఉన్నాడు. ఈ కేసులో నిందితులంతా దర్జాగా బెయిల్‌పై బయట తిరగడమే గాక మళ్లీ బాధిత కుటుంబాన్నే భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త హత్య

ప్రకాశం జిల్లా టంగుటూరు పంచాయతీ పరిధిలో రావివారిపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నవలం హనుమాయమ్మ(ఎస్సీ)ను ప్రత్యర్థులు రాజకీయ కారణాలతో ట్రాక్టర్‌తో తొక్కించి దారుణంగా చంపేశారు. ఇంటి పక్కన ఉండే వైసీపీకి చెందిన ఆమె బంధువులే పథకం ప్రకారం హత్య చేశారు.


యువకుడికి శిరోముండనం

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్నారనే కారణంతో 2020 జూలై 20న ఇండుగుమిల్లి వరప్రసాద్ అనే యువకుడిని సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులు గుండు గీశారు. ఈ కేసులో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిందితులకు అండగా ఉన్నారంటూ అప్పట్లో దళితులు ఉద్యమించారు. దళితుల ఆందోళనలతో ఎట్టకేలకు ఎస్ఐని సస్పెండ్ చేశారు.

దళిత యువకుడు బలి

తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరు వైసీపీలో వర్గపోరుకు బొంతా మహేంద్ర అనే దళిత యువకుడు బలైపోయారు. హోంమంత్రి తానేటి వనితకు సంబంధించిన ఫ్లెక్సీలో కొందరి చిత్రాల తల భాగాలు కత్తిరించి ఉండడంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, మహేంద్రను స్టేషన్‌కు తీసుకెళ్లారు. తనను అన్యాయంగా కేసులో ఇరికించారనే మానసిక క్షోభకు గురైన మహేంద్ర ఆత్మహత్య చేసుకున్నారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



ఓటేద్దాం పదండి..

'వినదగు నెవ్వరు జెప్పిన' అంటూ ఎవరేం చెప్పినా వింటూనే ఉన్నాం! మైకం కమ్మేలా మైకుల్లో హోరెత్తిస్తే తలలూపాం! మేనిఫెస్టోల హామీల వర్షంలో తడిసి ముద్దయ్యాం. విభజన తర్వాత తొలి ఐదేళ్ల టీడీపీ పాలన చూశాం. ఆ తర్వాత 'ఒక్క చాన్స్' అంటూ వచ్చిన వారి పరిపాలననూ చూశాం! అన్నీ బేరీజు వేసుకుని... మన తీర్పు చెప్పే రోజు వచ్చేసింది. మన రాష్ట్ర గతినీ, మన తలరాతనూ, మన పిల్లల భవిష్యత్తునూ నిర్ణయించే ఓటుకు వేళయింది! ఇంటి నుంచి కదలండి! ఓటుకు పోటెత్తండి!

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, 'గేమ్ చేంజర్'గా ముద్ర పడిన జనసేన సారథి పవన్ కల్యాణ్... 'ఒంటరిని' అంటూ విన్యాసాలు చేస్తున్న వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి! అభ్యర్థులు ఎవరైనా, పార్టీలు వేర్వేరైనా... ఈ అగ్ర నేతలపైనే అందరి కన్ను! సామాన్యుడి స్థాయి నుంచి అసామాన్య నేతగా ఎదిగిన వ్యక్తి చంద్రబాబు! సినిమా హీరోగా సుఖవంతమైన జీవితం గడిపే అవకాశమున్నా... సామాజిక స్పృహతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన పవన్ కల్యాణ్! తండ్రి పేరు చెప్పి రాజకీయాల్లోకి వచ్చి... సానుభూతి పవనాలు, వక్ర వ్యూహాలతో ముఖ్యమంత్రి పీఠం చేపట్టిన జగన్! ఈ ముగ్గురి ప్రస్థానం ఎలా మొదలైంది? ఇప్పుడు ఎలా ఉంది? వారిపై జనానికి ఉన్న అభిప్రాయం ఏమిటి? ముగ్గురు నేతల వ్యక్తిత్వం, విధానాలపై విశ్లేషణ...



హై.. హై.. నాయకా!

ఎదురీదుతూ ముందడుగు



ఎర్రటి ఎండ... చెమటతో తడిసిన చొక్కా! మనిషిలో ఎక్కడా కనిపించని అలసట! ఉరుముతున్న స్వరం! రోజుకు మూడు సభల్లో అలుపూ సొలుపూ లేకుండా ప్రచారం! ఇది... ఏడు పదుల వయసులోనూ చంద్రబాబు స్థైర్యం, ధైర్యం, సహనం, సామర్థ్యం! అధికారంలో ఉంటే సంక్షేమం, అభివృద్ధికోసం ఆరాటం! విపక్షంలో ఉంటే... పోరాటం! రెండు ముక్కల్లో చెప్పాలంటే ఇదే చంద్రబాబు రాజకీయ జీవితం. రాజకీయ వైకుంఠపాళిలో చాలా త్వరగా నిచ్చెన మెట్లు ఎక్కి ఉన్నత స్థాయికి చేరిన ఆయన అదే సమయంలో ప్రతి అడుగులో అనేకానేక ప్రతి ఘటనలు ఎదుర్కొని పోరాడుతూ ముందడుగు వేయాల్సి వచ్చింది. తిరుపతికి సమీపంలో ఒక పల్లెటూరులో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబు తనను తాను నాయకుడిగా తీర్చిదిద్దుకొంటూ ఎదిగారు. వెంకటేశ్వర యూనివర్సిటీలో విద్యార్థి నేతగా రాజకీయ జీవితం ఆరంభించిన ఆయన ఆ విశ్వవిద్యాలయం ఎన్నికల్లో దిగ్గజాలను ఢీకొని పెద్ద పోరాటంతో తన బృందాన్ని గెలిపించుకొన్నారు. ఆ పోరాటమే ఆయనకు గుర్తింపును తెచ్చి పెట్టి 1978 ఎన్నికల్లో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ లభించేలా చేసింది. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మరింత ఎదిగే ప్రయత్నంలో జిల్లా పరిషత్ ఎన్నికల్లో పార్టీ ఆదేశాన్ని ధిక్కరించి తన మనిషిని జడ్పీ చైర్మన్‌గా గెలిపించుకున్నారు. ఆ పరిణామం ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసేవరకూ వెళ్లింది. అయినా నిలదొక్కుకొని ఆ తర్వాత కొంత కాలానికే మంత్రి కాగలిగారు. ఎమ్మెల్యేగా గెలిచిన మొదట సారే మంత్రి పదవి దక్కిన అతి కొద్ది మంది నేతల్లో చంద్రబాబు ఒకరు. మంత్రిగా సినిమాటోగ్రఫీ వంటి చిన్న శాఖ లభించినా... దానివల్ల ఆ నాటి ప్రఖ్యాత హీరో ఎన్టీ రామారావుకు అల్లుడు కాగలిగారు. ఎన్టీఆర్ అల్లుడు అయినప్పటికీ ఆయన పార్టీ పెట్టిన సమయంలో చంద్రబాబు అందులో చేరలేదు. కాంగ్రెస్ నుంచే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలో చేరాల్సి వచ్చింది. టీడీపీలో అనేక ఎత్తుపల్లాలు చూసి వాటిని అధిగమిస్తూ అక్కడ ముఖ్య నేత కాగలిగారు. లక్ష్మీ పార్వతి ప్రమేయంపై పార్టీలో, ఎన్టీఆర్ కుటుంబంలో తలెత్తిన తిరుగుబాటు పెద్ద సంక్షోభంగా మారి చివరకు ఎన్టీఆర్ గద్దె దిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. రాజకీయ ప్రత్యర్థులు నిరంతరం దాడి చేసినా తన శ్రమ, మేధో శక్తితో నిలదొక్కుకొని పార్టీకి తిరుగులేని నేతగా ఎదిగారు. ఆయన హయాంలో టీడీపీ కొన్నిసార్లు గెలిచింది... కొన్నిసార్లు ఓటమిపాలైంది. అధికారంలో ఉన్నప్పుడు విశ్రాంతి లేకుండా పనిచేసిన ఆయన ప్రతిపక్షంలోకి వెళ్లినప్పుడు కూడా ఆ మరుసటి రోజు నుంచే పోరాటానికి నడుం బిగించి పార్టీ శ్రేణులను కదిలించారు. రాష్ట్ర విభజనకు ముందు రెండు ప్రాంతాల్లో భారీ సంఖ్యలో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీకి ఒక్క సీటు కూడా రాలేదు. దీంతో రెండు రాష్ట్రాల్లో పార్టీ పని అయిపోయినట్లేనని అనేక మంది అనుకొన్నారు. అటువంటి పరిస్థితుల్లో కూడా చంద్రబాబుపై ఉన్న అభివృద్ధి ముద్ర మళ్లీ ఆ పార్టీని ఒక రాష్ట్రంలో అధికారంలోకి తేగలిగింది. తన రాజకీయ జీవితంలో ఎందరో రాజకీయ దిగ్గజాలను ఎదుర్కొన్న చంద్రబాబుకు జగన్ ముఖ్యమంత్రి కాగానే అనూహ్య అనుభవాలు ఎదురయ్యాయి. ప్రతిపక్ష నేతగా ఏనాడూ చవిచూడని సవాళ్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. జగన్ సర్కారు అణచివేత, అరాచక విధానాల కారణంగా... అనేక మంది నాయకులు ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడ్డారు. వ్యక్తిగతంగా చంద్రబాబు కూడా తీవ్రమైన ఒత్తిళ్లకు గురయ్యారు. తన రాజకీయ జీవితంలో అరెస్టు కావాల్సి వస్తుందని ఆయన ఏనాడూ ఊహించలేదు. జగన్ ప్రభుత్వం ఆయనపై పలు కేసులు మోపడానికి ప్రయత్నిస్తోందని ప్రచారం జరుగుతున్నా... అరెస్టు వరకూ రాదని ధైర్యంగా ఉన్నారు. నంద్యాలలో ఆయన బస్సును పోలీసులు చుట్టుముట్టిన సమయంలో కూడా నోటీసు ఇచ్చి వెళ్లిపోతారన్న అభిప్రాయంలోనే ఆ పార్టీ శ్రేణులు ఉన్నాయి. కానీ, ఆ అంచనాలకు భిన్నంగా అరెస్టు కావడమే కాకుండా చంద్రబాబు 53 రోజులపాటు జైలువాసం గడపాల్సి వచ్చింది. సాధారణంగా ఇలాంటి సమయంలో... అరెస్టయిన వ్యక్తిపై ఉన్న కేసులు, ఆరోపణలు, అభియోగాలకు సంబంధించిన చర్చ జరుగుతుంది. కానీ.. చంద్రబాబు చేసిన అభివృద్ధి, సాధించిన ఫలితాలను అంతా గుర్తు చేసుకున్నారు. ఆయన విడుదల కోసం పార్టీ శ్రేణులు నిరంతరం ఏవో కార్యక్రమాలు నడిపాయి. ఆయన అరెస్టును నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఐటీ ఉద్యోగులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా చంద్రబాబు జంకకుండా పోరాట స్ఫూర్తితో పార్టీని నడిపించారు. గతంలో మాదిరిగా టీడీపీ పోరాడగలుగుతుందా... జగన్‌ను తట్టుకోవడం సాధ్యపడుతుందా అన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ పార్టీని సర్వసన్నద్ధంగా ఎన్నికల యుద్ధ రంగంలోకి నడిపించారు. విజయం తథ్యమనే విశ్వాసంతో ఉన్నారు.



పరిణతి చెందిన పవన్

'పవన్ కల్యాణ్ రియల్ హీరో'.. ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పదేపదే చెప్పిన మాట ఇది! అన్న చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ యువజన విభాగం... 'యువరాజ్యం' సారథిగా పవన్ వ్యవహరించారు. ప్రసంగాల్లో ఆవేశం, ఆక్రోశం, కోపం, ఆవేదనతో తీవ్రస్థాయిలో విరుచుకుపడే వారు. ఆయన ప్రసంగాలు ప్రజల్ని, ముఖ్యంగా యువతను ఆకట్టుకున్నాయి. కానీ... బూత్‌ల్లో ఓట్లుగా మారలేదు. ఆయన ప్రమేయం లేకుండానే 2011లో ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైంది. అప్పటి నుంచి పవన్ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తగిన సమయం కోసం వేచి చూసి... రాష్ట్ర విభజన అనంతరం 2014 మార్చి నెలలో జనసేన పార్టీని స్థాపించారు. 'కాంగ్రెస్ హటావో... దేశ్‌కో బచావో' అని ఆయన ఇచ్చిన నినాదం అప్పట్లో సంచలనం సృష్టించింది. కొత్త రాష్ట్రం అభివృద్ధి చెందాలని, నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో... తెలుగుదేశం, బీజేపీకి ఆయన మద్దతు పలికారు. ప్రత్యేక హోదా అంశంపై పోరాడుతూ... 2019 ఎన్నికల్లో సొంతంగా పోటీ చేసినప్పటికీ, ఆయనకు చేదు ఫలితాలు ఎదురయ్యాయి. రెండుచోట్ల పోటీ చేసినా ఆయనే గెలవలేకపోయారు. జగన్ సీఎం అయ్యాక పవన్ కల్యాణ్‌పై జరిగిన వ్యక్తిగత దాడి అంతా ఇంతా కాదు! గ్రామ స్థాయి వైసీపీ నాయకుడి దగ్గర నుంచి మంత్రులు, ముఖ్యమంత్రి వరకూ వ్యక్తిగత దూషణలు చేశారు. సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్స్ చేశారు. ఎక్కడా వణకలేదు... బెణకలేదు. మరోవైపు... రాష్ట్రంలో అరాచకం, దౌర్జన్యాలు, అభివృద్ధి లేమి పవన్‌ను కదిలించాయి. జనసేన సొంతంగా పోటీ చేయడంవల్ల ఓట్లు చీలిపోయి వైసీపీకి మరోసారి లబ్ధి చేకూరకూడదని నిర్ణయించుకున్నారు. పూర్తిస్థాయి రాజకీయ పరిణతితో ఆలోచించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో తెలుగుదేశంతో పొత్తు గురించి ప్రకటించారు. బీజేపీని కూటమిలోకి కలిసి వచ్చేలా చేశారు. అన్నింటికంటే ముఖ్యంగా... సీట్ల పంపిణీలో ఆచరణాత్మకంగా వ్యవహరించారు. 'వైసీపీ ఓటు చీలనివ్వను' అనే మాట కోసం నాలుగు అడుగులు వెనక్కి తగ్గారు. ఇందుకు పార్టీ శ్రేణులను మొదటి నుంచే మానసికంగా సిద్ధం చేశారు. నేతలకు నచ్చజెప్పారు. పూర్తిస్థాయిలో ఓట్ల బదిలీ జరిగేలా అడుగులు వేశారు. పవన్ కల్యాణ్ ఈసారి పిఠాపురంలో అభ్యర్థిగా నిలబడ్డారు. తన ప్రసంగాల్లో ఆవేశం పాలును తగ్గించి... జనాన్ని ఆలోచింపచేసేలా మాట్లాడుతున్నారు. ఇప్పుడు పవన్ ప్రసంగాలను యువతతోపాటు పెద్దలూ సాలోచనగా వింటున్నారు. 'వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వను' అన్న ప్రకటన నుంచి కూటమి ఏర్పాటు వరకూ పవన్ తీసుకున్న ప్రతి నిర్ణయానికీ జగనే కారణమని చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో పవన్ 'గేమ్ చేంజర్'గా మారారు.

అహం.. విశ్వరూపం!



చిన్న వయసులోనే వచ్చిన అధికారం! నిజానికి... అది అతి కొద్దిమందికి మాత్రమే లభించే అద్భుతమైన అవకాశం! కానీ... వైఎస్ జగన్మోహన్ రెడ్డి 'అహం'తో అపఖ్యాతిని మూటగట్టుకున్నారు. తన పాలనను అరాచకం, అవినీతి, అభివృద్ధి లేమికి ప్రతీకగా వి ంగిల్చి ప్రజలకు అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయారు. వైఎస్ కుమారుడిగా తెరపైకి వచ్చి, తండ్రి మరణానంతరం ముఖ్యమంత్రి పీఠం కోసం ఆరాటపడి... అది దక్కకపోవడంతో కాంగ్రెస్‌ను వీడి సొంత పార్టీ పెట్టుకున్నారు. వైఎస్‌కు ఉన్న క్రేజ్ వల్ల కావొచ్చు... తొలుత జగన్ ప్రజల్లో విపరీతమైన ఆదరణ కలిగిన నేతగా గుర్తింపు పొందారు. తన తండ్రి రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో వెల్లువెత్తిన సానుభూతి జగన్‌కు పెట్టని కోటలా నిలిచింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. దీంతో... 2019 ఎన్నికల్లో గెలుపు కోసం 'వక్ర వ్యూహాల'ను ఎంచుకున్నారు. 'యుద్ధంలో గెలవాలంతే! దానికోసం ఎంత అధర్మానికి పాల్పడినా ఫర్వాలేదు' అనే సిద్ధాంతాన్ని ఎంచుకున్నారు. సుదీర్ఘ పాదయాత్రలో ప్రతి వర్గాన్ని నమ్మించేలా హామీలు ఇచ్చారు. అటు చంద్రబాబు ప్రభుత్వంపై ఐదేళ్లూ అబద్ధాలు, అర్ధసత్యాలతో దాడి చేశారు. దీని ఫలితమే... గత అసెంబ్లీ ఎన్నికల్లో 151 అసెంబ్లీ సీట్లలో వైసీపీ విజయం. పార్టీ లోపలా... బయటా తిరుగేలేని రీతిలో వచ్చిన సీట్లు, ఓట్లు జగన్మోహన్ రెడ్డి తీరును పూర్తిగా మార్చేశాయి. ఆయనలో అహం విశ్వరూప ప్రదర్శన స్థాయికి ఎదిగింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు అయినా ఆయన అనుమతిస్తే తప్ప దరిదాపుల్లోకి వెళ్లగలిగే పరిస్థితులు లేకుండా పోయాయి. సాధారణ ప్రజలకు ముఖ్యమంత్రి దర్శనమే దుర్లభం అయింది. ఆయన సచివాలయానికి రారు. అధికారిక నివాసంలోకి ఎవరికీ ప్రవేశం లేదు. ఆయన పిలిపించిన వారికి మాత్రమే రాజకోటలోకి ప్రవేశం. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పరదాలు, బ్యారికేడ్ల మధ్య ప్రయాణం చేసే ముఖ్యమంత్రిగా ఆయన చరిత్రకెక్కారు. ఆయన క్యాబినెట్ సమావేశానికి సచివాలయానికి వెళ్లాల్సి వస్తే... రాజధాని గ్రామాల్లో ఇంటికో పోలీసును నిలబెట్టారు. గతంలో ఎవరు ముఖ్యమంత్రి అయినా పాలనపై తనదైన ముద్ర వేయాలని తాపత్రయపడేవారు. కానీ, జగన్ దానికి పూర్తి భిన్నమైన వ్యవహారం నడిపారు. బటన్ నొక్కడం పేరుతో సంక్షేమ పథకాల కోసం నిధులు విడుదల చేయడం మినహా ఈ ఐదేళ్లలో ఆయన మరేం చేశారంటే సమాధానం దొరకని పరిస్థితి తెచ్చారు. టీడీపీ హయాంలో ఒప్పందాలు జరిగి, స్థలాలు కేటాయింపు జరిగిన పరిశ్రమలనూ బెదరగొట్టారు. రాజధాని నిర్మాణాన్ని నిలిపివేశారు. టీడీపీ మొదలుపెట్టిన, ఒక కొలిక్కి తెచ్చిన పనులను, ప్రాజెక్టులను జగన్ కొనసాగించి ఉంటే ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండేది. ఆయన రాజకీయ ప్రతీకారేచ్ఛకు రాష్ట్రం బలైపోయింది. అంబానీలకు ఒక రాజ్యసభ పదవి, అదానీలకు రాష్ట్రంలో పోర్టులు సమర్పించడం మినహా రాష్ట్రానికి వారి నుంచి ఒక్క కొత్త పెట్టుబడి సాధించలేకపోయారు. పెద్ద పరిశ్రమలతో ఉద్యోగాలు రావని, ఫిష్ మార్ట్ వంటి వాటితో స్వయం ఉపాధిని చూపించాలని తాజాగా చేసిన సూత్రీకరణ జగన్ ఆలోచనా ధోరణికి అద్దం పట్టింది. పోలీసు వ్యవస్థను చేతిలో పెట్టుకొని ప్రత్యర్థులను అణిచివేసే ప్రక్రియ... చివరికి ప్రజలనూ బాధితులను చేసింది. డాక్టర్ సుధాకర్, పదో తరగతి బాలిక మిస్బా వంటి వారి మరణాలు, అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య, దళిత డ్రైవర్ మృతదేహం డోర్ డెలివరీ... ఇలాంటి ఎన్ని ఘోరాలు జరిగినా జగన్‌లో ఏ స్పందనా కనిపించలేదు. తనను చూసి అందరూ భయపడాలన్న ఆయన ఆలోచనా ధోరణికి ఇది అద్దం పడుతోందన్న వ్యాఖ్యలు వచ్చినా జగన్ పట్టించుకోలేదు. అవినీతి విషయంలో కూడా ఆయన లెక్కలేనితనాన్ని ప్రదర్శించారు. ఇసుక, మద్యం వంటి వాటి విషయాల్లో అవినీతిపై ఎన్ని విమర్శలు వచ్చినా ఆయన నుంచి... లేదా ఆయన బృందం నుంచి ఏ ప్రతిస్పందనా ఉండేది కాదు. పాలన మొత్తం తానొక భీకర నియంత అన్న అభిప్రాయం కలిగించడానికే ప్రయత్నించిన జగన్... ఎన్నికల వేళ వచ్చేసరికి భీరువులా మాట్లాడుతూ సానుభూతి పొందే ప్రయత్నం చేయడం విశేషం!

- అమరావతి, ఆంధ్రజ్యోతి

ఆ..
నా ఒక్క ఓటు వేయకపోతే ఏంటిలే.. అని బద్ధకించి ఇంటి నుంచి కదలని ఓటర్లపై ఆగ్రహంతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇది. 'ఒళ్లు విరిచి బయటకొచ్చి ఓటేయండి. లేదా రాష్ట్రం వదిలిపోండి. అదీ కుదరకుంటే చచ్చిపోండి' అంటూ తాడేపల్లిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఓటు వేయకుంటే..!





నడి సంద్రంలో ఓట్ల వేట!

కాకినాడకు 12 కిలోమీటర్ల దూరంలో.. సముద్రంలో ఉండే హోప్ ఐలాండ్‌కు ఆదివారం ఎన్నికల సిబ్బంది బోటులో బయలుదేరి వెళ్లారు. 1823 మంది ఓటర్లు ఉన్న ఈ దీవికి బోటులో వెళ్లేందుకు సుమారు రెండు గంటలు పడుతుంది.

ఓటు కోసం పోదాం.. పద!



విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో.. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఏపీ జనమంతా ఓటు వేసేందుకు స్వగ్రామాలకు బయలుదేరారు. ఓట్ల జాతరకు వీరంతా ఒక్కసారిగా బయలుదేరడంతో రైళ్లు, బస్సులు ఏమీ ఖాళీలేవు. విజయవాడ స్టేషన్‌లో.. అనంతపురం బస్టాండులో కిక్కిరిసిన జనంతో ఇలా రైలు.. బస్సు!









పోలింగ్ సైన్యం కదిలింది

ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం. ఓట్లు వేసే జనమే కాదు.. వారితో ఓట్లు వేయించే సిబ్బందీ ఈ యజ్ఞంలో కీలకమే. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల నుంచి ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని తీసుకుని.. పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన ఎన్నికల సైన్యమిది.

మండుటెండ.. గాలివానల్లో పోలింగ్ సిబ్బంది కష్టాలు



గుంటూరు ఎల్ఈఎం స్కూల్ గ్రౌండ్‌లో భోజనాల కోసం మండుటెండలో క్యూలో నిల్చున్న పోలింగ్ సిబ్బంది



పలాసలో గాలివానకు ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద కూలిన టెంట్లు.. నిరీక్షిస్తున్న సిబ్బంది

గుంటూరు(ఆంధ్రజ్యోతి), పలాస మే 12: ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన పోలింగ్ సిబ్బందికి సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆదివారం విభిన్న వాతావరణ పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంటూరు జిల్లాలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని ఏఎల్ బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఆదివారం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం 6 గంటలకు వచ్చిన సిబ్బంది మధ్యాహ్నం 3 గంటల వరకు షామియానాల కింద ఉడికిపోయారు. మధ్యాహ్న భోజన సమయంలో తగినన్ని షామియానాలు లేక మండుటెండలో భోజనం కోసం క్యూల్లో నిల్చోవాల్సి వచ్చింది. ఇక శ్రీకాకుళం జిల్లా పలాసలో ఆదివారం వేకువజామున భారీ వర్షంతోపాటు ఈదురుగాలులు వీయడంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద టెంట్లు మొత్తం కూలిపోయాయి. కుర్చీలు చెల్లాచెదురయ్యాయి. దీంతో పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పక్కపక్కనే పంపిణీ కేంద్రాలు పెట్టడంతో గందరగోళం ఏర్పడింది. మధ్యాహ్నం 2 గంటలలోపు సామగ్రి పంపిణీ పూర్తి చేయాల్సి ఉండగా, సాయంత్రం 6 గంటలైనా పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో సామగ్రి తరలించలేకపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు ఎన్ని గంటలకు చేరుకుంటామో? అర్ధరాత్రి వరకూ సామగ్రి సర్దుకోవాలా? అని సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు.



గుంటూరు నగరంలోని పొన్నూరు రోడ్డులో ఉన్న అంజుమన్ ఇస్లామియా స్కూల్లో ఒకే చోట 16 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసిన దృశ్యం

ఒకే స్కూల్‌లో 16 పోలింగ్ బూత్‌లు

- ఓటర్లకు నిలువ నీడలేని క్యూలైన్లు.. గుంటూరులో ఏర్పాట్లు అస్తవ్యస్తం

గుంటూరు, మే 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పలుచోట్ల ప్రైవేటు స్కూళ్లలోనూ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో పలు స్కూళ్లకు ప్రాంగణం, ప్రహరీ తదితరాలు కూడా లేవు. రోడ్లపైనే ఓటర్లకు క్యూలైన్లకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల షామియానాల కింద క్యూలైన్లలో కనీసం 50 మంది కూడా నిలుచోలేని పరిస్థితి. పెద్ద స్కూళ్లలో అధిక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. కొన్ని స్కూళ్లకు ఒకే ముఖద్వారం ఉండటంతో ఓటర్లు లోపలికి ప్రవేశించేటప్పుడు సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. అంజుమన్ ఇస్లామియా స్కూల్లో 16 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది.

ఓటరూ... ఈ 'గుర్తింపు' చాలు

ఓటరు జాబితాలో పేరు ఉండి ఓటరు గుర్తింపు కార్డు లేకపోతే కంగారుపడాల్సిన పనేం లేదు. ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉంటే చాలు.. ధీమాగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి మీ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ప్రవాస ఆంధ్రులు మాత్రం తమ ఓటు హక్కును వినియోగించుకునేటప్పుడు తప్పనిసరిగా తమ ఒరిజినల్ పాస్‌పోర్టును చూపించాల్సి ఉంటుంది. ఈసీ ఆమోదించిన 12 రకాల గుర్తింపు కార్డులు... 1)ఆధార్ కార్డు, 2) ఉపాధి జాబ్ కార్డు, 3) ఫొటోతో ఉన్న బ్యాంక్ పాస్‌బుక్, 4) పోస్టాఫీసు పాస్‌బుక్, 5) కార్మిక శాఖ మంజూరు చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, 6) డ్రైవింగ్ లైసెన్స్, 7) పాన్ కార్డ్, 8) ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, 9) ఇండియన్ పాస్‌పోర్ట్, 10) ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, 11) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులు, ప్రభుత్వం, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన కార్డులు, 12) ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చూపించే అధికారిక గుర్తింపు కార్డులు, ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డు(యూడీఐడీ) కార్డు... పైన పేర్కొన్న వాటిలో ఏ ఒక్క గుర్తింపు కార్డు ఉన్న ఓటరైనా తమ ఓటు హక్కును ఉపయోగించుకోవచ్చు. ఓటరు జాబితాలో మీ పేరు ఉందో లేదో చూసుకోండి. ఉంటే మీ ఓటరు ఐడీ కార్డు తీసుకొని వెళ్లండి. అదిలేకపోతే... పైన పేర్కొన్న 12 రకాల కార్డుల్లో ఏది ఉన్నా మీరు నిరభ్యంతరంగా మీ ఓటు హక్కును ఉపయోగించుకోవచ్చు.

మీ ఓటు వేరేవాళ్లు వేస్తే...

ఓటు వేయాలన్న పట్టుదలతో పోలింగ్ బూత్‌కు వెళ్లిన మీకు చావు కబురు చల్లగా చెప్పినట్లు... 'మీ ఓటు వేసేశారు' అని చెపితే... డీలా పడకండి. మీ గుర్తింపును చూపించి టెండరు ఓటు వేస్తానంటూ డిమాండ్ చేయండి. ప్రిసైడింగ్ అధికారి మీ చేతికి ప్రత్యేకంగా టెండర్డ్ బ్యాలెట్ పేపర్ ఇస్తారు. మీరు ఓటు వేసిన తరువాత దానిని జాగ్రత్తగా సీల్ చేస్తారు. అలా ఓటు వేసిన వేసిన వ్యక్తి వివరాలను ఫాం 15 లేదా 17బీలో నమోదు చేస్తారు. టెండర్ ఓటు ఓటరు హక్కు. పోటీ హోరాహోరీగా జరిగి, ప్రత్యర్థుల మధ్య స్వల్ప మెజారిటీ మాత్రమే ఉంటే మీ టెండరు ఓటే నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉంది. ఒకవేళ ప్రత్యర్థుల మధ్య మెజారిటీ వ్యత్యాసం భారీగా ఉంటే మాత్రం టెండర్ ఓట్లను లెక్కించాల్సిన అవసరం ఉండదు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

ఆఖరిదాకా అవే కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండలంలోని పేటసన్నిగండ్ల శివారు సింగరుట్లతండాలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇక్కడ వెబ్ క్యాస్టింగ్ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరా, కేబుల్ వైరును అపహరించుకుపోయారు. దీని వెనుక వైసీపీ మూకలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆదివారం ఉదయం పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది దీనిని గుర్తించి కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాటు చేసింది. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. అయితే... ఆయా పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు కూడా అంతరాయం సృష్టించే అవకాశాలుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

ఎన్నడూ లేనంత భద్రత...

హింసకు తావులేకుండా, శాంతియుత వాతావరణంలో పోలింగ్ జరగాలన్న లక్ష్యంతో ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంది. ఈసారి భద్రతా బలగాలను రెట్టింపు చేశారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా నియోజకవర్గానికో పోలీసు అబ్జర్వర్‌ను నియమించారు. నిరంతర పర్యవేక్షణ కోసం 34 వేల పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ కెమెరాలు పెట్టారు. 12 వేల పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. ఇక్కడ పోలింగ్ కేంద్రాల లోపల, బయటా కెమెరాలు పెట్టారు. 295 కంపెనీల సాయుధ బలగాలు కాపలా కాస్తున్నాయి. నిష్పాక్షిక, శాంతియుత పోలింగ్ జరిగేలా చూడాలని ఎన్నికల సంఘం కలెక్టర్లను, ఎస్పీలను అనేకసార్లు హెచ్చరించింది. 'జీరో రీపోలింగ్, జీరో హింస'తో ఎన్నికల ప్రక్రియ ముగియాలని ప్రతి సమావేశంలో స్పష్టం చేసింది. ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే దానికి పూర్తి బాధ్యత ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీలదేనని తేల్చిచెప్పింది.

- (అమరావతి - ఆంధ్రజ్యోతి)

రండి ఓటేయండి!

- ఉదయం 7 నుంచే పోలింగ్ ప్రక్రియ
- 'పోల్‌డే మేనేజ్‌మెంట్'తో నిశిత పరిశీలన
- వేళ్లపై ముందే ఇంకేస్తే చర్యలు తప్పవు
- సీఈవో ముఖేశ్ కుమార్ మీనా



సచివాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీఈవో

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేసింది. రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాలు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. రాష్ట్ర వ్యాప్తంగా 46,389 పోలింగ్ కేంద్రాలను ఈసీ సిద్ధం చేసింది. వీటిలో 12,438 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. 34651 పోలింగ్ కేంద్రాల్లో లోపల, బయట వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వినియోగించే ఈవీఎంలు అన్నీ కొత్తవేనని, 20 శాతం ఈవీఎంలు అదనంగా రిజర్వ్‌లో ఉంచామని, సాంకేతిక సమస్యలు తలెత్తినా పరిష్కరించే వ్యవస్థను అందుబాటులో ఉంచుకున్నట్టు ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్క ఓటరూ పాల్గొని రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

మూడు దశల్లో పరిశీలన

ఎన్నికల ప్రక్రియను మూడు దశల్లో పరిశీలిస్తున్నట్టు సీఈవో వివరించారు. జీరో వయొలెన్స్ లక్ష్యంగా 74 శాతం పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి వెబ్ క్యాస్టింగ్‌తో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. 26 జిల్లాలకు 26 టీవీ మానిటర్ల ద్వారా ఆయా జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఓటింగ్ సరళిని(పోలింగ్ కేంద్రం లోపల, బయట కూడా) పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఓటింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రత్యేక అప్లికేషన్ తీసుకొచ్చామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఏపీ ఓటర్లను సరిహద్దుల వద్ద ఎవరు అడ్డుకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. వంద శాతం పోలింగ్ తమ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. కనీసం 83 శాతం పోలింగ్ లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

పోల్‌డే మేనేజ్‌మెంట్

'పోల్‌డే మేనేజ్‌మెంట్ సిస్టం' అనే వెబ్ అప్లికేషన్ ద్వారా ఎప్పటికప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లోని సిబ్బంది కదలికలను, పోలింగ్ స్టేషన్‌లో కార్యకలాపాలను తెలుసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోని పీవోకి పోలింగ్ డే మేనేజ్‌మెంట్ సిస్టం అప్లికేషన్ ఇచ్చామన్నారు. పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, సామగ్రి తీసుకున్నప్పటి నుంచి ఎంత పోలింగ్ జరుగుతోంది, పోలింగ్ స్టేషన్‌లో జరుగుతున్న ప్రతి అంశంపై లైవ్ మానిటరింగ్ ఉంటుందన్నారు. గతంలో కన్నా ఇప్పుడు ఎన్నికలకు భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్టు తెలిపారు. ప్రతి ఓటరు ఓటు వేసేలా చూడాలని ఎక్కడా ఆపకూడదని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఓటర్లను ప్రలోభపరిచే అంశాలపైనా దృష్టి పెట్టామన్నారు. ఎన్నికల్లో మొత్తం 1.60 లక్షల ఈవీఎంలను వినియోగిస్తున్నట్లు మీనా వివరించారు. వీటికి అదనంగా మరో 20 శాతం ఈవీఎంలను కూడా సిద్ధంగా ఉంచామన్నారు.

అది దుష్ప్రచారమే!

చెరగని సిరాతో ఓటర్ల వేళ్లపై వారి ఇంటి వద్దే మార్కు చేస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని సీఈవో ముఖేశ్ కుమార్ మీనా పేర్కొన్నారు. అది దుష్ప్రచారమేనని తెలిపారు. ఎన్నికల్లో వినియోగించే చెరగని సిరా ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, ఈ సిరా ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా ఇతర సిరాల ద్వారా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

5.26 లక్షల మంది సిబ్బంది

పోలింగ్ విధుల కోసం నిర్దేశించిన 3.30 లక్షల మంది సిబ్బంది ఇప్పటికే కేంద్రాలకు చేరుకున్నారు. పోలీస్ బందోబస్తు సహా 5.26 లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. పోలింగ్ కేంద్రాల భద్రత కోసం 295 కంపెనీల సాయుధ బలగాలతో కలిసి మొత్తం 1.6 లక్షల మంది పోలీసులు పాల్గొంటున్నారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు ఏజెంట్ల సమక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు.

ప్రతిగంటకూ పర్సంటేజ్

ప్రతి గంటకు పోలింగ్ బూత్‌లో పోలింగ్ పర్సంటేజ్, తదితర వివరాలను పోల్ డే మేనేజ్మెంట్ సిస్టం వెబ్ అప్లికేషన్ ద్వారా పర్యవేక్షిస్తామని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి హరేంధిర ప్రసాద్ తెలిపారు. 14 నియోజకవర్గాల్లో వంద శాతం వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బందోబస్తుకు సీనియర్ ఐపీఎస్‌లు: డీజీపీ గుప్తా

రాష్ట్రంలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలకు ఒకేసారి పోలింగ్ జరుగుతున్నందున గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సివిల్ పోలీసులు 58,948, ఏఆర్, హెచ్‌జీ 45,960 మందిని ఎన్నికల విధులకు కేటాయించామన్నారు. కర్ణాటక నుంచి 3500, తమిళనాడు నుంచి 4500, ఇతర విభాగాల నుంచి 3366 మంది సేవలు వినియోగిస్తున్నామన్నారు. రిటైర్డ్ అధికారులు 246 మందిని కూడా బందోబస్తు వినియోగించినట్టు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం ఇవ్వకుండా పోలీసు బలగాలకు దిశా నిర్దేశం చేసేందుకు ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లను నియమించినట్టు తెలిపారు. ఏపీఎస్‌పీ బెటాలియన్స్ ఏడీజీ అతుల్‌సింగ్‌ను రాయలసీమకు, సెబ్ కమిషనర్ రవి ప్రకాశ్‌ను ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరితోపాటు కృష్ణా జిల్లాకు, ఆక్టోపస్ ఐజీ శ్రీకాంత్‌ను ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌తోపాటు గుంటూరు రేంజ్‌లోని జిల్లాలకు నియమించారు.

83 శాతం ఓటింగ్ లక్ష్యంగా

రాష్ట్రంలో జరిగిన గత ఎన్నికల్లో 79.84 శాతం ఓటింగ్ నమోదైందని, ప్రస్తుత ఎన్నికల్లో 83 శాతం ఓటింగ్ లక్ష్యంగా విస్తృతస్థాయిలో ఓటర్లను చైతన్య పరిచేలా పలు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించామని మీనా చెప్పారు. అర్బన్ ఏరియాల్లో ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చేశామన్నారు. గత 6 నెలల కాలంలో మరణించిన, జాడ తెలియని వారికి సంబంధించిన సుమారు 60 లక్షల ఓట్లను జాబితా నుంచి తొలగించామన్నారు. సీవిజిల్‌లో వచ్చే ఫిర్యాదుల ద్వారా ప్రలోభాలకు అడ్డుకట్టవేశామని తెలిపారు.

ఓటేసేందుకు రెడీ..!

- ఉండవల్లిలో చంద్రబాబు.. మంగళగిరిలో పవన్.. పులివెందులలో జగన్

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. టీడీపీ అధినేత చంద్రబాబు ఉండవల్లిలో, జనసేనాని పవన్ మంగళగిరిలో తమ ఓటు హక్కు వినియోగించుకోనుండగా.. సీఎం జగన్ పులివెందులలో ఓటు వేయనున్నారు. సోమవారం ఉదయం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి పంచాయతీ కార్యాలయం రోడ్‌లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి ఓటు వేయనున్నారు.

టీడీపీ ఏజెంట్లపై వైసీపీ శ్రేణుల దాడి

- పోలీసుల నిర్లక్ష్యం వల్లేనంటూ స్టేషన్ ముట్టడి
- పచ్చలతాడిపర్రులో ఉద్రిక్తత

పొన్నూరుటౌన్, మే 12: సార్వత్రి ఎన్నికల పోలింగ్ మరి కొద్ది గంటలకు చేరినా వైసీపీ మూకల ఆగడాలకు అడ్డుకట్ట పడడంలేదు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం పచ్చలతాడిపర్రు గ్రామంలో ఆదివారం టీడీపీ ఏజెంట్లపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయి. గ్రామానికి చెందిన ఎర్రగుంట నాగార్జున్, పోతన నవతేజ ఏజెంట్ ఫారాలు సమర్పించేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ మాటువేసి ఉన్న వైసీపీ శ్రేణులు వారిద్దరిపై దాడి చేశారు. ఆ తర్వాత కర్రలతో గ్రామంలో సంచరిస్తూ పోలింగ్ అయిపోయిన తర్వాత ఒక్కొక్కడి అంతు చూస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో గ్రామస్థులు పెద్దసంఖ్యలో స్టేషన్ ముట్టడించి పోలీసుల నిర్లక్ష్యం వల్లే వైసీపీ మూకలు రెచ్చిపోతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి రాత్రి వేళ సంచరిస్తూ.. టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తే అంతుచూస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా బందోబస్తు ఏర్పాటు, అనుమానితులను విచారించడం కానీ చేయడంలేదని నిరసన తెలిపారు. వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ ఏజెంట్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిర్భయంగా ఓటేయండి

- భద్రత కల్పించే బాధ్యత మాది
- ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు
- మూడంచెల్లో ఈవీఎంలకు భద్రత
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో సీఈవో మీనా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

"నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునే భరోసా కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. మీరు అందరూ రండి.. పోలింగ్ ప్రక్రియలో పాల్గొనండి. ఓటనేది కేవలం హక్కు మాత్రమే కాదు. బాధ్యత కూడా" అని ఎన్నికల సంఘం తరుపున సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా ఓటర్లకు భరోసా కల్పించారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ఎన్నికలకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

సీఈవో: రాష్ట్ర ఎన్నికల ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం ఎక్కువ దృష్టి పెట్టింది. చాలా ఫిర్యాదులు రావడంతో నిశితంగా పరిశీలిస్తోంది. మిషన్ పని చేయడం లేదు.. ఇంక్ పడడం లేదు.. సరిగ్గా చెక్ చేయడం లేదు వంటి ఫిర్యాదులు రాకుండా సిబ్బందికి 3సార్లు శిక్షణ ఇచ్చాం. 20 శాతం అదనంగా ఈవీఎం మిషన్లు తెప్పించాం. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత ఈవీఎంలకు సరిగ్గా సీల్ వేశారా లేదా? అన్నది కూడా యాప్‌లో నమోదవుతుంది.

పోలింగ్ శాతం ఎంత నమోదు కావొచ్చు?

2019 ఎన్నికల్లో 79.8 శాతం పోలింగ్ నమోదైంది. ఈ సారి చాలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. 10 లక్షల మంది కొత్త ఓటర్లు వచ్చారు. ఈసారి దాదాపు 82 నుంచి 83 శాతం పోలింగ్ శాతం పెరుగుతుందని భావిస్తున్నాం. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఈసారి ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే కొన్ని హింసాత్మక సంఘటనలు ఎక్కువ కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఈసీ నుంచి వచ్చిన సూచనల మేరకు దాదాపు 100 కంపెనీల బలగాలను అధికంగా తెప్పించాం. ఎలక్షన్ కమిషన్ నుంచి 'నో వయెలెన్స్. నో రీపోల్' నినాదం ఇచ్చింది. కాబట్టి హింసాత్మక సంఘటనలు జరగకుండా సిబ్బందిని పెంచాం. సాధారణంగా అన్ని పోలింగ్ స్టేషన్లు అప్రోచ్‌లోనే ఉంటాయి. కానీ, రంపచోడవరం దగ్గర గుర్తేడు ఏరియాలో ఉన్న ఆరు పోలింగ్ స్టేషన్స్ కొద్దిగా దూరంగా ఉన్నాయి. ఆయా స్టేషన్లలో ఉన్న సిబ్బంది రాత్రి వెనక్కి రావడానికి ఇబ్బంది ఉంటుంది. కాబట్టి ఆ ఆరు పోలింగ్ స్టేషన్ సిబ్బందిని, మెటీరియల్‌ను ఎయిర్ లిఫ్ట్ చేయడానికి 2 హెలికాప్టర్స్ వినియోగించాం.

దొంగ ఓట్లను ఎలా కట్టడి చేస్తున్నారు?

పోలింగ్‌కు ముందు ఓటర్లకు స్లిప్పులు ఇచ్చాం. ఓటరు పోలింగ్ బూత్‌కు వచ్చినప్పుడు అభ్యర్థుల ఏజెంట్లు వారి దగ్గర ఉన్న లిస్ట్‌లో సమాచారాన్ని పరిశీలిస్తారు. అయినా పోలింగ్ ఏజెంట్ ఓటర్ గుర్తింపును చాలెంజ్ చేస్తే, దొంగ ఓటర్ అని తెలిస్తే సదరు వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేస్తారు. పోలింగ్ తేదీ ప్రకటించిన తర్వాత పల్నాడు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో కొన్ని హింసాత్మక సంఘటనలు జరిగాయి. 14 సెగ్మెంట్లను సెన్సిటివ్ నియోజకవర్గాలుగా గుర్తించాం. అక్కడ 100 శాతం వెబ్ క్యాస్టింగ్‌కు ఆర్డర్ ఇచ్చాం. అన్ని పోలింగ్ స్టేషన్లు మా కంట్రోల్ ఉంటాయి. దీంతో పాటు అక్కడ సాధారణ బందోబస్తు కంటే ఎక్కువ సెంట్రల్ ఫోర్స్‌తో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశాం.

హోం ఓటింగ్‌తో విజయవంతం అయిందా?

ఇది చాలా సానుకూల నిర్ణయం. రాష్ట్రంలో 7 లక్షల మంది ఓటర్లకు హోం ఓటింగ్ అవకాశం కల్పించాం. ఇంటి వద్దనే ఓటేస్తారా? అని అడిగాం. 7 లక్షల మందిలో 3 శాతం మంది వినహా మిగిలిన అందరూ పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేస్తామని ఆప్షన్ ఇచ్చారు. మిగిలిన వారి ఓట్లను వారి ఇంటి వద్దే సేకరించాం. ఇది విజయవంతంగా జరిగింది.

గిరిజన ప్రాంతాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

గిరిజన ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్లు కొద్ది దూరంగా ఉంటాయి. ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుంది. కానీ, ఈసారి గిరిజన ప్రాంతాల్లో పోలింగ్ పెంచడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం, కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం. గిరిజన ప్రాంతాల్లోని ఓటర్లు తమ ఇళ్ల దగ్గర నుంచి రోడ్ పాయింట్ వరకు వస్తే అక్కడ నుంచి వారి కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించాం. రోడ్ పాయింట్ నుంచి ఓటర్లను పోలింగ్ బూత్‌ల వరకూ కలెక్టర్లు తీసుకురావాలి. వీరితో పాటు పోలింగ్ స్టేషన్‌కు వచ్చినప్పుడు దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వీల్‌ఛైర్స్ ఏర్పాటు చేశాం. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, డిపార్ట్‌మెంట్ సిబ్బంది వీల్‌ఛైర్‌లో వారిని తీసుకువెళ్లి ఓటు వేయించి మళ్లీ వెనక్కి పంపిస్తారు.

నంద్యాల ఎస్పీ మీద ఎలాంటి చర్యలు ఉంటాయి?

నంద్యాల ఎస్పీపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి ఈసీ నుంచి ఆర్డర్ ఇచ్చింది. ఆయనతో పాటు ఏఎస్పీ, ఒక ఇన్‌స్పెక్టర్‌పై చర్యలకు ఆదేశించింది. చార్జిషీట్ రెడీ అయిన తర్వాత ఆయనపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయి. అలాగే, నటుడు అల్లు అర్జున్, నంద్యాల అభ్యర్థి శిల్పా రవిచంద్ర మీద కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. అనుమతి లేకుండా వాళ్లు ర్యాలీ చేశారు.

ఓటర్లను ప్రలోభ పెడితే ఎలాంటి చర్యలుంటాయ్?

ఓటర్లను ప్రలోభ పెట్టకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఈ రోజు వరకు రూ.270 కోట్ల నగదు, లిక్కర్, బంగారం ఇతర వస్తువులు సీజ్ చేశాం. ఎన్నికల సంఘం జనవరిలో ఏపీకి వచ్చినప్పటి నుంచి చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెట్టాం. ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. సెక్షన్ 188, 108 కింద కేసులు నమోదు చేస్తున్నాం. రాష్ట్రంలో కొన్ని చోట్ల కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నాయి. పార్టీల నేతలైనా, మంత్రులైనా కోడ్ ఉల్లంఘిస్తే కేసులు పెడుతున్నాం. ఇప్పటి వరకు దాదాపు వెయ్యి కేసులు నమోదయ్యాయి.

ఈవీఎంల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

పోలింగ్ తర్వాత ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్స్‌కు వెళ్తాయి. స్ట్రాంగ్ రూమ్స్ భద్రత మొత్తం సెంట్రల్ ఫోర్స్ అధీనంలో ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 350 స్ట్రాంగ్ రూమ్స్ ఉన్నాయి. వీటి వద్ద మూడు అంచెల్లో భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశాం. దీంతో పాటు రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు కూడా స్ట్రాంగ్ రూమ్స్ వద్ద కూర్చొనే అవకాశం ఉంది. వారు కూడా పర్యవేక్షణ చేసుకోవచ్చు. స్ట్రాంగ్ రూమ్స్ భద్రత విషయంలో అనుమానాలు అవసరం లేదు.

పల్నాడులో వెబ్‌క్యాస్టింగ్ వైర్లు కట్ చేస్తున్నారన్న విషయం మీ దృష్టికి వచ్చిందా?

మా దృష్టికి రాలేదు. అలాంటిది ఏమైనా ఉంటే వెంటనే సరి చేస్తాం. అలా చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

ధర్మవరంలో ఏం చేయబోతున్నారు?

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఎక్కువ ఉన్నాయని కొందరు కోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాల మేరకు మొత్తం 242 పోలింగ్ కేంద్రాలనూ సమస్యాత్మక కేంద్రాలుగా ప్రకటించాం. ఈ నియోజకవర్గం వరకు ఒక ఐపీఎస్ అధికారిని పర్యవేక్షణకు నియమించాం. అన్ని చోట్ల వెబ్‌క్యాస్టింగ్ పెడుతున్నాం. 70 మంది మైక్రో అబ్జర్వర్స్‌ను, అధిక సంఖ్యలో బలగాలను నియమించాం.

ఓటర్ ట్రబుల్స్!

పోటెత్తిన ఓటర్లు.. చేతులెత్తేసిన ఆర్టీసీ

- హైదరాబాద్ నుంచి ఏపీకి ప్రయాణికుల తాకిడి
- కిక్కిరిసిపోయిన బస్సులు, రైళ్లు
- హైదరాబాద్ నుంచి బెజవాడ వరకే ప్రత్యేక బస్సులు
- ఇక్కడి నుంచి జిల్లాలకు బస్సులు లేక ఇబ్బందులు
- ఆర్టీసీ సిబ్బందిపై ప్రయాణికుల ఆగ్రహం, వాగ్వాదం



విజయవాడ పీఎన్‌బీ బస్ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

విజయవాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆదివారం హైదరాబాద్ నుంచి ఓటర్ల వరద కొనసాగింది. ఎలాగైనా స్వస్థలాలకు చేరి ఓటు హక్కు వినియోగించుకోవాలన్న తాపత్రయంతో బస్సులు, రైళ్లు, కార్లలో పెద్ద ఎత్తున తరలిరావటంతో కోలాహలం నెలకొంది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి కార్ల రద్దీతో కిటకిటలాడింది. గత రెండు రోజుల నుంచీ ఉదయం నుంచి రాత్రి వరకూ ఈ ఉధృతి కొనసాగింది. హైదరాబాద్ నుంచి భారీ సంఖ్యలో వస్తున్న వారు విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ (పీఎన్‌బీఎస్) చేరుకుంటున్నారు. ఇతర జిల్లాలకు వెళ్లే బస్సులన్నింటినీ హైదరాబాద్‌కు పెద్ద సంఖ్యలో పంపి అక్కడి నుంచి ప్రజలను తీసుకు వచ్చే పని చేపట్టారు. అయితే వీరంతా విజయవాడ వచ్చే సరికి ఇక్కడ చాలినన్ని బస్సులు లేవు. విజయవాడ నుంచి తమ స్వస్థలాలకు వెళ్లటానికి బస్సులు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ నుంచి కాకినాడ, రావులపాలెం, అమలాపురం, రాజమండ్రి, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు వెళ్లటానికి బస్సులు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీఎన్‌బీఎస్ ఆర్టీసీ అధికారులతో గొడవకు దిగారు. తామేమీ చేయడలేమని వారు చేతులెత్తేశారు. గత్యంతరం లేక ప్రయాణికులు విజయవాడ నుంచి కార్లు, మ్యాక్సీ క్యాబ్‌లను అధిక కిరాయికి మాట్లాడుకుని వెళ్లాల్సి వచ్చింది. మరో వైపు ఆర్టీసీ అధికారులు ఏకంగా 5,458 బస్సులను ఎన్నికల సంఘానికి అద్దెకు ఇచ్చారు. షెడ్యూలు కంటే 55 శాతం బస్సుల అదనంగా కేటాయించి ఆదివారం ఉదయం నుంచే బస్సులను ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పంపడంతో ప్రయాణికులకు బస్సులకొరత ఏర్పడింది.

నూరు శాతం ఆక్యుపెన్సీతో విమానాలు

హైదరాబాద్, సికింద్రాబాద్, బెంగళూరు, చెన్నైల నుంచి పెద్ద సంఖ్యలో రైళ్లలో ప్రయాణికులు తరలివచ్చారు. రైళ్లన్నీ కిటకిటలాడాయి. సీట్లు లేకపోవటంతో రిజర్వేషన్ బోగీల్లోకి చొరబడి రావాల్సి వచ్చింది. మరోవైపు హైదరాబాద్ నుంచి విజయవాడకు ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలు నూరు శాతం ఆక్యుపెన్సీతో వచ్చాయి. కార్లలో పెద్ద ఎత్తున తరలిరావటంతో ఆంధ్రా చెక్‌పోస్టు, టోల్‌ప్లాజాల వద్ద ఖాళీ లేనంతగా వాహనాలు ముందుకు సాగాయి. అనంతపురం ఆర్టీసీ బస్టాండు వందలాది మంది ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. రద్దీకి తగిన బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వచ్చిన అరకొర బస్సులూ ఖాళీ లేకపోవడంతో టాప్‌పైన, ఫుట్‌బోర్డుపై వేలాడుతూనే ప్రయాణించారు. ఏలూరు జిల్లాలో ఓటేసేందుకు దూర ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వస్తున్న ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండుటెండలో బస్సుల కోసం గంటలతరబడి నిరీక్షించారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల పరిధిలోని బస్సులంటినీ తరలించడంతో రెగ్యులర్ సర్వీసులు తగ్గిపోయాయి. దీంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

ఎన్నికలకు 5,458 ఆర్టీసీ బస్సులు

- షెడ్యూలు కంటే 55 శాతం అదనం

విజయవాడ (బస్‌స్టేషన్), మే 12: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల సిబ్బంది, ఈవీఎంల వంటి సామగ్రి రవాణా కోసం 5458 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూలు కంటే సుమారు 55 శాతం అదనంగా బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఓటు వేసేందుకు ఏపీకి వచ్చే వారి కోసం ఆదివారం వరకు 1066 బస్సులు, బెంగుళూరు నుంచి 284 బస్సులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎక్కడైనా సుమారు 30 నుంచి 40 మంది ప్రయాణికులు ఒకే గమ్యానికి చేరుకోవాలంటే ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలోని ఎలక్షన్ సెల్ 9959111281 నంబరులో సంప్రదిస్తే బస్సులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.